www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం

21-01-2025

సంపుటి : 01 | సంచిక : 259 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







## మీ పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలి

**'కంగ్రాట్స్ మై డియర్ ఫ్రెండ్'**

ఇరుదేశాల ప్రయోజనాలు, ప్రపంచానికి మంచి భవిష్యత్తును అందించడానికి

మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను

డొనాల్డ్ ట్రంప్‌నకు మోడీ అభినందనలు




## ట్రంప్ రిటర్న్స్..




**రెండో సారి అమెరికా అధ్యక్షునిగా ప్రమాణం**

- 78ఏళ్ల వయసులో అగ్రరాజ్య అధినేతగా బాధ్యతలు
- 'ట్రంప్ మార్క్' ఏవిధంగా ఉండబోతుందన్న విషయంపై యావత్ ప్రపంచం ఆసక్తి
- భారత్ తరపున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్
- అమెరికాలో స్వర్ణయుగం మొదలైంది: డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్ డీసీ:** అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా మిగతా2లో...



దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల సీఎంలు స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ ఎయిర్‌పోర్టులో కలుసుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ కాసేపు ముచ్చటించుకున్నారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ముఖ్యమంత్రుల మధ్య చర్చ జరిగింది. రేవంత్‌రెడ్డి వెంట తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు.

## దావోస్ సదస్సుకు బాబు, రేవంత్

**ఎయిర్‌పోర్టులో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు**


**ముచ్చటించుకున్న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు**

**జ్యూరిచ్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ కు చేరుకుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి బృందానికి జ్యూరిచ్ ఎయిర్ పోర్ట్ లో ప్రవాస తెలంగాణవాసులు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. దావోస్ పర్యటనకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు సారధ్యంలోని ప్రతినిధి బృందం కూడా అదే సమయంలో అక్కడికి చేరుకుంది. జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో కలుసుకున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు, మంత్రులందరూ కాసేపు ముచ్చటించుకున్నారు. రెండు రాష్ట్రాల బృందాలు ఫొటోలు దిగారు. దావోస్ సదస్సు తొలి రోజున పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమవుతారు. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్య స్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసే నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో దావోస్ పర్యటనపై రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందులో భాగంగానే భారీ పెట్టుబడుల లక్ష్యంతో పలు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరుపనుంది. మిగతా2లో...

## 8మందికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

- ప్రకటించిన రాజ్‌భవన్
- రిపబ్లిక్‌డే సందర్భంగా పురస్కారాలు అందజేయనున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అవార్డు గ్రహీతలకు రూ.2లక్షలు, జ్ఞాపిక అందజేత




## సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు

- ఆర్జీకర్ హత్యాచార ఘటనలో నిందితునికి శిక్షఖరారు
- ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదన్న న్యాయస్థానం
- బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వానికి ఆదేశం

2

## రైతు ఆత్మహత్యలపై బీఆర్‌ఎస్ అధ్యయన కమిటీ



- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో 9 మంది సభ్యులు రెండు వారాల పాటు అన్ని జిల్లాల్లో పర్యటిస్తారు
- కాంగ్రెస్, ఏడాది పాలనలో 400మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు
- పార్టీ తరపున రూపొందించే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం
- రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలపై, వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీసాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో 9 మంది సభ్యులు గల ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి, మిగతా2లో...

## రాష్ట్ర ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలి

- అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి
- ప్రాజెక్టుల ఆర్థిక అంచనాలు, అనుమతులతో కూడిన లేఖ అందజేత



**కోణార్క్:** తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం, అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. సోమవారం ఒడిస్సా రాష్ట్రం కోణార్క్ లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సమావేశంలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల ఆర్థిక అంచనాలు, అనుమతులతో కూడిన లేఖను కిషన్ రెడ్డికి కోణార్క్ లో డిప్యూటీ సీఎం అందజేశారు.తెలంగాణ రాష్ట్రానికి మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 125 | రిటైల్ ₹ 147 |
| స్కిన్ ₹ 213 | స్కిన్ లెస్ ₹ 243 |

## తల్లి వద్దే బాలుడు

**అతుల్ సుభాశ్ కుమారుడు కస్టడీ కేసులో సుప్రీం తీర్పు**

**నాలుగేళ్ల మనవడిని తమ కస్టడీకి అప్పగించాలి**

**హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన అతుల్ తల్లి**

**కస్టడీకి అప్పగింతకు సుప్రీంకోర్టు నిరాకరణ**



**ఢిల్లీ:** భార్య వేధింపులు తాళలేక బెంగళూరు టెకీ ఆత్మహత్య చేసుకొన్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తన నాలుగేళ్ల మనవడిని తమ కస్టడీకి అప్పగించాలని ఇటీవల అతుల్ తల్లి సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానం విచారణ చేపట్టింది. బాలుడు తన తల్లి వద్దే ఉంటాడని తీర్పు చెప్పింది. తన మనవడిని తమ కస్టడీకి అప్పగించాలని ఇటీవల మిగతా2లో...




## అమెరికాలో కాల్పుల కలకలం

**హైదరాబాద్ యువకుడి మృతి**

**మాస్టర్స్ చేసి ఉద్యోగవేటలో ఉన్న రవితేజ**

**వాషింగ్టన్‌లో దుండగుల కాల్పుల్లో అక్కడికక్కడేమృతి**

## నా ఓటమికి హరీశ్‌రావే కారణం

- సిద్దిపేటలో గెలుపొందడానికి ఎంత కష్టపడ్డారో.. నన్ను ఓడించేందుకు అంతే చెమటోడ్చారు
- రాజకీయ వ్యూహం పన్ని, విజయావకాశాలను దెబ్బతీశారు
- ఏ పార్టీకైనా కక్షసాధింపు రాజకీయాలు మంచిది కాదు
- రాజకీయ యుద్ధం చేస్తాను తప్ప రివెంజ్ పాలిటిక్స్ చేయను: కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

2



# మీ పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలి

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్ రోటుండాలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ''అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన నా ప్రియ మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అభినందనలు. ఇరుదేశాల ప్రయోజనాలు, ప్రపంచానికి మంచి భవిష్యత్తును అందించడానికి మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. మీ పదవీ కాలం విజయవంతంగా కొనసాగాలి'' అని ఆకాంక్షిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

# 8మందికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

**విశ్వంభర, హైదరాబాద్:** 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు.

**అవార్డుకు ఎంపికైన వారు..**

- దుశ్చర్ల సత్యనారాయణ
- అరికపూడి రఘు
- పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి
- ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా
- ధ్రువాంశు ఆర్గనైజేషన్
- ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి
- ఆదిత్య మెహతా ఫౌండేషన్
- సంస్కృతి ఫౌండేషన్

# సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి శిక్ష ఖరారైంది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు అతడికి జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది. ఈ శిక్ష ఖరారు చేయడానికి ముందు న్యాయమూర్తి ఇరు పక్షాల వాదనలు విన్నారు. తనను ఈ కేసులో తప్పుగా ఇరికించారని సంజయ్ రాయ్ తన వాదన వినిపించగా.. ఇది అరుదైన కేసని, అతడికి మరణ శిక్ష విధించాలని సీబీఐ తరఫు న్యాయవాది వాదించారు. శనివారం న్యాయస్థానం సంజయ్‌ను దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారించింది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరినుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇక సంజయ్‌కు శిక్ష ఖరారు నేపథ్యంలో కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు.

# తల్లి వద్దే బాలుడు

**మొదటిపేజీ తరువాయి**

అతుల్ తల్లి సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా జస్టిస్ బివి. నాగరత్న, జస్టిస్ ఎస్‌సీ. శర్మ వీడియో కాల్ ద్వారా బాలుడిని చూశారు. చిన్నారితో మాట్లాడారు. అనంతరం ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ బాలుడు తన తల్లి వద్దే ఉంటాడని తీర్పునిచ్చింది. కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు సమర్పించేందుకు మరో వారం గడువు కావాలని బాలుడి నానమ్మ తరఫు న్యాయవాది కోరగా.. న్యాయస్థానం తిరస్కరించింది. కాగా.. తన భార్య వేధింపులు తాళలేక బెంగళూరు టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ చావుకు కారణం తన భార్య అని ఆత్మహత్య చేసుకొనే ముందు దాదాపు 80 నిమిషాల వీడియోను చిత్రీకరించాడు. అతుల్ భార్య నిఖితా సింఘానియాను పోలీసులు అరెస్టు చేశారు. ఆమెతో పాటు నిందితురాలి తల్లి నిషా, సోదరుడు అనురాగ్‌లను సైతం అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం తన మనవడి కోసం అతుల్ తల్లి పోరాడుతున్నారు. బాలుడిని తమ కస్టడీకి అప్పగించాలని కోరగా.. సుప్రీం కోర్టు నిరాకరించింది.

# దావోస్ సదస్సుకు చంద్రబాబు, రేవంత్..

**మొదటిపేజీ తరువాయి**

మరోవైపు జ్యూరిచ్ చేరుకున్న సీఎం చంద్రబాబు బృందానికి ఎయిర్‌పోర్టులో యూరప్ తెదేపా ఫోరం సభ్యులు, ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారులు ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్‌తో ఎన్ఆర్ఐ తెదేపా నేతలు ఫొటోలు దిగారు. జ్యూరిచ్‌లో పెట్టుబడిదారులతో సీఎం చంద్రబాబు బృందం సమావేశం కానుంది.



# రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ..



**మొదటిపేజీ తరువాయి**

వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు నివేదిక అందిస్తుందని తెలిపారు. రెండు వారాల పాటు విస్తృతంగా పర్యటించిన అనంతరం, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధాన కారణాలతో పాటు గత ఏడాది వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదికను రూపుదిద్దుతుందని కేటీఆర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్న, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఏడాది పాలనలో రైతు ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది ఆందోళనకర పరిస్థితి అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని కూడా దాటకపోవడం, గతంలో అందిన రైతుబంధును ఆపివేయడం, ఇస్తామన్న 15 వేల రూపాయల రైతు భరోసా సైతం రద్దు చేయడం వంటి ముఖ్యమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని తెలిపారు. అలాగే, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ కారణంగా రైతులు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్ర వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిందని విమర్శించారు. రైతన్నలను, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దిక్కులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలన్న ఉద్దేశంతో ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. 10 సంవత్సరాల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ప్రయత్నిస్తుందని అన్నారు. విస్తృత అధ్యయనం అనంతరం, పార్టీ తరఫున రూపొందించే నివేదికను ప్రభుత్వానికి అందజేసి, రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలపై, వారికి ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

**కమిటీ సభ్యులు**

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ సభ్యులుగా ఉన్నారు.

# ట్రంప్ రిటర్న్స్..

**మొదటిపేజీ తరువాయి**

ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.

- ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు జో బైడెన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు.
- భారత్ తరఫున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేయనున్నారు. అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు.
- పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. కమలా హ్యారిస్ ఈ వేడుకలో పాల్గొన్నారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిషెల్ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. ట్రంప్ ప్రమాణ స్వీకారం సందర్భంగా సంగీత కార్యక్రమాలు, పరేడ్‌లు ఆకట్టుకున్నాయి.
- అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

**'ఎగ్జిక్యూటివ్ ఆర్డర్'.. అధ్యక్షుడి చేతిలో ఆయుధం!..**

- అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ .. అనేక కీలక అంశాలకు సంబంధించి తక్షణమే నిర్ణయాలు అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. తొలిరోజే దాదాపు 100కుపైగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతాకాలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి చేతిలో అత్యంత శక్తిమంతమైన సాధనంగా పేర్కొనే ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల ప్రాధాన్యం, వాటి అమలు గురించిన అంశాలను పరిశీలిస్తే..
- అమెరికా చట్టసభ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వానికి అధ్యక్షుడు జారీ చేసే లిఖితపూర్వక ఆదేశాలనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌గా పేర్కొంటారు.
- ప్రభుత్వ విధానాలకు సంబంధించి అధ్యక్షుడు తీసుకునే కీలక నిర్ణయాలు ఇందులో ఉంటాయి. కేంద్ర సంస్థలకు ఆదేశాలు ఇవ్వడం లేదా నివేదికలను కోరడం వంటివి ఉండవచ్చు.
- అమెరికా రాజ్యాంగంలోని ఆర్టికల్ II ప్రకారం ఈ ఆదేశాలు జారీచేసే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది.
- ఈ ఆదేశాలకు చట్టబద్ధత ఉంటుంది. సాధారణంగా జారీచేసే అధికారిక ప్రకటన వంటివాటికి మాత్రం చట్టబద్ధత ఉండదు.
- ఎగ్జిక్యూటివ్ ఆదేశాలను తిరస్కరించేందుకు చట్టాన్ని తీసుకొచ్చే అవకాశం కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ.. దానిపై వీటో అధికారం మాత్రం అధ్యక్షుడిదే. అందుకే కాంగ్రెస్ ఆమోదించలేని అంశాలను తమ అజెండాలో అధ్యక్షుడు పెట్టుకుంటారు.
- చట్టసభ ఆమోదం లేకుండా జారీచేసే అధికారం అధ్యక్షుడికి ఉన్నా.. వీటికి కొన్ని పరిమితులు ఉన్నాయి.
- ఆదేశాలను వ్యతిరేకించలేనప్పటికీ.. ఆ నిర్ణయాలకు అవసరమైన నిధులు ఇవ్వకుండా అడ్డుకోవడం లేదా ఇతర అడ్డంకులు సృష్టించడం ద్వారా వీటి అమలుకు 'కాంగ్రెస్' ఆటంకం కలిగించే వీలుంది.
- మునుపటి అధ్యక్షులు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయడానికి ఈ ఎగ్జిక్యూటివ్‌ను కొత్త అధ్యక్షుడు ఉపయోగించే అవకాశం ఉంది.
- యుద్ధ సమయంలో లేదా దేశీయంగా సంక్షోభాల నివారణ క్రమంలో ఈ ఆదేశాలు జారీ చేయొచ్చు. 1942లో అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డీ రుజ్‌వెల్ట్ జారీ చేసిన ఆదేశాలు.. 1.20 లక్షల జపనీస్ అమెరికన్ల కోసం నిర్బంధ కేంద్రాల ఏర్పాటుకు దారితీసింది.
- అమెరికా చరిత్రలో వేల కొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ అయ్యాయి. జార్జ్ వాషింగ్టన్ ఎనిమిది ఆర్డర్లపై సంతకాలు చేస్తే.. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ అత్యధిక ఆర్డర్లపై సంతకాలు చేశారు.
- తొలిసారి అధ్యక్ష బాధ్యతల్లో డొనాల్డ్ ట్రంప్ 220 ఆర్డర్లపై సంతకాలు చేయగా.. బైడెన్ 160 ఆర్డర్లపై (డిసెంబర్ 20నాటికి) సంతకాలు చేశారు.
- అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే 100కుపైగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేస్తానని ట్రంప్ ప్రకటించారు.
- అధ్యక్షుడు చట్టపరిధిని దాటి ఏదైనా నిర్ణయం తీసుకుంటే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కాంగ్రెస్‌తోపాటు న్యాయస్థానాలు కూడా ఈ ఆదేశాలను సమీక్షించే వీలుంటుంది.

**అమెరికాలో స్వర్ణయుగం మొదలైంది: డొనాల్డ్ ట్రంప్..**

- అమెరికాలో నేటి నుంచి స్వర్ణయుగం ప్రారంభమైందని డొనాల్డ్ ట్రంప్‌అన్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం అనంతరం ట్రంప్ తొలిసారి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''నా ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన అతిథులందరికీ సుస్వాగతం. అమెరికా ఫస్ట్ అనేదే నా నినాదం. అమెరికా అనేక ఆటుపోట్లను తట్టుకొని నిలబడింది. అనేక సమస్యలు ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డాం. నేటి నుంచి స్వర్ణ యుగం మొదలైంది. ఇవాళ్టి నుంచి అమెరికా ప్రపంచ దేశాల గౌరవం పొందుతుంది. దేశంలో నేర ఘటనలు తగ్గించాల్సిన అవసరం ఉంది. అమెరికాకు ప్రపంచ దేశాల సహకారం కూడా కావాలి. విద్యారంగంలో అనేక సంస్కరణలు రావాల్సి ఉంది.. త్వరలోనే తీసుకొస్తాం. శాంతి భద్రతల విషయంలో మరింత కఠినంగా ఉండాలి'' అన్నారు.

**అమెరికా దక్షిణ సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధిస్తాం..**

''దేవుడి దయ వల్ల తుపాకీ కాల్పుల నుంచి తృటిలో బయటపడ్డా. అమెరికా ప్రజలకు అత్యుత్తమ సేవలందించేందుకు కృషి చేస్తాం. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తాం. అమెరికా దక్షిణ సరిహద్దుల్లో అత్యయిక పరిస్థితి విధిస్తాం. అక్రమ వలసలు అరికట్టేందుకు సత్వర చర్యలు చేపడతాం. అమెరికాలోకి నేరగాళ్లు రాకుండా కఠిన చర్యలు చేపడతాం. అమెరికా భూభాగంపై తీవ్రవాద కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. నేరాలు చేసే ముఠాలతో కఠినంగా వ్యవహరిస్తాం. రెస్టారంట్లలో కాల్పుల ఘటనలు జరగకుండా చూస్తాం'' అని ట్రంప్ తెలిపారు.

**ఈవీల తయారీలో దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుతా..**

గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్‌ఆఫ్ అమెరికాగా మారుస్తాం. పనామా కెనాల్‌కు సంబంధించిన ఒప్పందాల్లో ఉల్లంఘనలు జరుగుతున్నాయి. అందువల్ల పనామా కెనాల్‌ను తిరిగి వెనక్కి తీసుకుంటాం. ప్రపంచమంతటికీ అమెరికా ఎనర్జీ ఎగుమతి కావాలి. ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం. పర్యావరణ పరిరక్షణ దిశగా అనేక చర్యలు తీసుకుంటాం. అమెరికా పేరు ప్రఖ్యాతులు నిలబెట్టేందుకు ప్రజలంతా ముందుకు రావాలి. ప్రతిభావంతులకు మా ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుంది. ఈ విషయంలో ఎలాంటి వివక్ష ఉండదు. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తాం'' అన్నారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన కొన్ని ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులను మీ పరిశీలనకు, అవసరమైన చర్యలు తీసుకోవడానికి మీకు తెలియజేయాలని కోరుకుంటున్నానని ఆలేఖలో డిప్యూటీ సీఎం కోరారు.

**1. ప్రాంతీయ రింగ్ రోడ్ :**2016లో కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ (MoRTH) ఈ ప్రాజెక్టును "సూత్రప్రాయంగా" ఆమోదించింది. 2022 జూలై 3న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయ సంకల్ప సభలో 350 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రస్తావించారు.

**ప్రాజెక్టు వ్యయం:** ₹34,367.62 కోట్లు

**వివరాలు:** ఉత్తర మరియు దక్షిణ కారిడార్లకు కేంద్రం ఆర్థిక ఆమోదం ఇప్పటికీ ఇవ్వలేదు. భూమి సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 50% ఖర్చును భరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

**2. రేడియల్ రోడ్ అభివృద్ధి:** హైదరాబాద్ మెట్రో కారిడార్‌లోని 10 కొత్త గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల అభివృద్ధి ద్వారా నగర విస్తరణకు ప్రణాళిక రూపొందించారు.

**ప్రాజెక్టు వ్యయం:** ₹45,000 కోట్లు

**3. మెట్రో రైల్ ఫేజ్-2:** హైదరాబాద్ మెట్రో ఫేజ్--2కు సంబంధించి మొత్తం 76.4 కి.మీ మేర కొత్త కారిడార్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాము.

**ప్రాజెక్టు వ్యయం:** ₹24,269 కోట్లు

**4. మూసీ నది తీరాభివృద్ధి:మూసీ నదికి పునరుజ్జీవన ప్రాజెక్టు, బాపు ఘాట్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు.**

**ప్రాజెక్టు వ్యయం:** ₹14,100 కోట్లు

**5. గోదావరి-మూసీ నదుల అనుసంధానం:** గోదావరి నుంచి 5 టీఎంసీ నీటిని మళ్లించి మూసీ నదిని శుద్ధి చేయడం.

**ప్రాజెక్టు వ్యయం:** ₹7,440 కోట్లు

**6. హైదరాబాద్ నగరానికి సీజంపి:** హైదరాబాద్ నగరానికి 7,444 కి.మీ పొడవునా సీవరేజ్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడింది.

**ప్రాజెక్టు వ్యయం:** ₹17,212.69 కోట్లు

**7.వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళిక:** రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ కోసం సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక.

**ప్రాజెక్టు వ్యయం:** ₹4,170 కోట్లు



**8. బందర్ పోర్ట్ నుండి హైదరాబాదు డ్రైపోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే:** బందర్ పోర్ట్ మరియు హైదరాబాదు మధ్య ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం.

**ప్రాజెక్టు వ్యయం:** ₹17,000 కోట్లు

**9. సింగరేణి బొగ్గు బ్లాక్ కేటాయింపు:** తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాల్సిందిగా అభ్యర్థన.

**10.సెమీకండక్టర్ మిషన్:** సెమీకండక్టర్ తయారీ కోసం హైదరాబాదు అనుకూలమైన కేంద్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడం.

**మొత్తం వ్యయం:** ₹1,63,559.31 కోట్లుమీ సముచిత జోక్యంతో ఈ ప్రాజెక్టులకు మంజూరులను పొందడంలో రాష్ట్రానికి సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

# అమెరికాలో కాల్పుల కలకలం



**విశ్వంభర, ఎల్బీనగర్:** అమెరికాలో దుండగుల కాల్పులలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధి లోని ఆర్కే పురం గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్2కి చెందిన కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవితేజ అనే యువకుడు మృతి. 2022 మార్చిలో అమెరికా వెళ్లిన రవితేజ మాస్టర్స్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణ లో ఉన్నాడు. అమెరికా వాషింగ్టన్ ఏవ్ లో దుండగులు జరిపిన కాల్పులలో మృతి చెందగా.. హైదరాబాద్ ఆర్కే పురం అతని నివాసంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**రవి తేజ బాడీ నీ తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.**

అమెరికా లో దుండగులచేతిలో మరణించిన రవితేజ బాడి నీ వెంటనే తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ మహేశ్వరం నియోజక వర్గం ఆర్కే పురం గ్రీన్ హిల్స్ కాలనీ లోని రవి తేజ తల్లిదండ్రులను సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. మాట్లాడుతూ బాడీని తీసుకువచ్చేందుకు ప్రభుత్వము వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కేటీఆర్ తో మాట్లాడి అతనికి అమెరికాలో ఉన్న పరిచయాలతో తొందరగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. రవితేజ ప్రాణాలు తీసుకు రాలేకపోయినా బాడిని త్వరగా తీసుకొచ్చేందుకు సహకారం అందిస్తానని తెలిపారు. పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సాజిద్, నవీన్ , రమేష్ కురుమ తదితరులు ఉన్నారు.

మృతదేహాన్ని త్వరగా తీసుకురావాలి: చిలుక ఉపేందర్ రెడ్డి.

అమెరికాలో నల్లజాతీయుల చేతిలో కాల్పులచే మరణించబడ్డ రవితేజ మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి కోరారు. ఆర్కే పురం లోని రవితేజ తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు లింగస్వామి గౌడ్, రమేష్ నేత లు ఉన్నారు.

# నా ఓటమికి హరీశ్‌రావే కారణం



**విశ్వంభర, హైదరాబాద్:** సంగారెడ్డిలో తన ఓటమికి మాజీ మంత్రి హరీశ్‌రావు కారణమంటూ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు సిద్దిపేటలో గెలుపొందడానికి ఎంత కష్టపడ్డారో.. నన్ను ఓడించేందుకు అంతే చెమటోడ్చారని అన్నారు. రాజకీయ వ్యూహం పన్ని, విజయావకాశాలను దెబ్బతీశారని విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ఎప్పుడూ రివెంజ్ రాజకీయాలు చేయలేదు. ఏ పార్టీకైనా కక్షసాధింపు రాజకీయాలు మంచిది కాదు. తెలంగాణ ప్రజల రక్తంలో కక్షసాధింపు గుణమే ఉండదు. అలాంటి చర్యలకు నేను పూర్తి వ్యతిరేకం. రాజకీయ యుద్ధం చేస్తాను తప్ప రివెంజ్ పాలిటిక్స్ చేయను. రివెంజ్ పాలిటిక్స్ కాంగ్రెస్ నేతలు చేసినా మంచిది కాదు. అలాంటి రాజకీయ నాయకులు ఏదో ఒక రోజు బాధపడక తప్పదు'' అని జగ్గారెడ్డి అన్నారు.

# ఘనంగా డా.కిరణ్ కొమ్రేవార్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, భైంసా:** ఆపదలో ఎందరికో చేయూతనిచ్చి , వైద్యపరంగా ఎందరికో భరోసా కల్గించిన ముధోల్ నియోజకవర్గ ముద్దుబిడ్డ, బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమితి సభ్యులు డా.కిరణ్ కొమ్రేవార్ జన్మదిన వేడుకలు సోమవారం భైంసా పట్టణ కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, కిరణ్ కొమ్రేవార్ అభిమానులు, శ్రీయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈసందర్భంగా కిరణ్ కొమ్రేవార్ మాట్లాడుతూ నన్ను ఆదరిస్తున్న ముధోల్ నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోకి కార్యకర్తలకు, అభిమానులకు అండగా ఉంటానన్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, ముధోల్ బండారి గంగాధర్, బీఆర్ఎస్ యువనాయకులు రావుల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## 26న రాజ్యాంగంపై తెలంగాణ జాగృతి సెమినార్

### కీలకోపన్యాసం చేయనున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**విశ్వంభర,హైదరాబాద్ :** 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 26 తేదీన తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో "గణతంత్ర భారత్ – జాగ్రత్త భారత్" పేరిట హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో సెమినార్ నిర్వహించనుంది. ఈ సెమినార్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడం, సవాళ్లు, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, మహిళా సాధికారత, మైనారిటీలు, బలహీన వర్గాలు, కులగణన వంటి మొత్తం 16 అంశాలపై ఈ సెమినార్ లో చర్చించనున్నారు. భారత రాజ్యాంగం అమలు జరిగిన నాటి నుంచి నేటి వరకు దాని స్ఫూర్తిని అనుసరించి ప్రజలకు దక్కవలసిన హక్కులు ఎంత మేరకు దక్కాయన్న చర్చ జరగాల్సిన అవసరం ఉందని తెలంగాణ జాగృతి అభిప్రాయపడింది. రాజ్యాంగం పట్ల ప్రజలకు సంపూర్ణ అవగాహన ఏర్పడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. రాజ్యాంగ స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని పాలకులు అది ప్రతిపాదించిన హక్కులను పౌరులకు దక్కేలా కృషి చేయాలని కోరింది. భారత రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేందుకు, ఫలాలను మరింత విస్తృతంగా అన్ని వర్గాల ప్రజలకు దక్కేందుకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని, కాబట్టి ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సెమినార్ లో ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ జాగృతి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో నవీన్ ఆచారి , చరణ్ పసుల, శ్రీకాంత్ గౌడ్, లింగం , డాక్టర్ సత్య , వసుమతి, కృష్ణ కిషోర్ , శ్రీనివాస్ గౌడ్ , మాడ హరీష్ రెడ్డి , జన్ము రాజు , అశోక్ యాదవ్ , గాజుల అరుణ్ పాల్గొన్నారు.

## ఐనోల్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం ఐనోల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేనీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి, మహేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి పథకాలు అందేలా చూడాలి

**విశ్వంభర. కందుకూరు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కొరకు ఇందిరమ్మ కమిటీని నియమించింది. ఈ కమిటీలో మూడు నెలల ముందు ప్రతి పార్టీ నుండి ముగ్గురు సభ్యులు ఎస్టీ ఒకరు బీసీ ఒకరు ఎస్సీ ఒకరు అని గ్రామపంచాయతీ వద్ద పిలిపించి కమిటీలు వేయడం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఏకపక్షం తో వాళ్ల అనుకూలంగా ఉన్న సభ్యులనే నియమించుకోవడం జరిగింది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఈ ప్రభుత్వం చేయకూడదని అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి పథకాల అందేలా చర్యలు తీసుకోవాలని గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

**విశ్వంభర, కాళేశ్వరం:** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం నూతన ఎస్ఐ జి.తమషా రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం పోలీసు స్టేషన్ లో రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరి ప్రోద్బలంతో ఎలాంటి నేరాలకు, గ్రూపు తగాదాలకు పాల్పడవద్దని రౌడీషీటర్లకు సూచించారు. భవిష్యత్తులో నేరాలకు పాల్పడితే, చట్టం ప్రకారం జీవితాంతం జైలులోనే గడపాల్సి వస్తుంది అని హెచ్చరించారు. కౌన్సెలింగ్ నిర్వహించడం యొక్క లక్ష్యం మీ నేర ప్రవృత్తిని వదిలించుకుని, మీ కుటుంబ సభ్యులతో మంచి జీవనోపాధిని ఏర్పరచుకోవడం మరియు మీ ప్రవర్తనను మెరుగుపరచడం అని ఎస్సై తమాషారెడ్డి సూచించారు. రౌడీషీటర్లు తాత్కలిక ఆనందాలకు పాల్పడి నేరస్తులుగా మారవద్దని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ప్రత్యేక బృందం మిమ్మల్ని, మీ కార్యకలాపాలపై నిఘా ఉంచుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## గిరిజన ఉపాధ్యాయురాలికి సన్మానం

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** నారాయణపురం మండలంలోని పోర్లగడ్డ తండాకు చెందిన కొర్ర చందన గురుకుల పీజీటీ ఉద్యోగానికి ఎంపికైంది. బంజారా ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కొర్ర చందానను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ప్రేమ్ సింగ్, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సురేష్ నాయక్, అసోసియేషన్ సభ్యులు వాంకుడోత్ భాన్సీలాల్, ఆంగోతు శంకర్ నాయక్, లచ్చిరామ్ నాయక్, కోర్ర జగ్రామ్, బద్యా నాయక్ పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**విశ్వంభర, మహబూబాబాద్:** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐ డీ ఓ సీ లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను పట్టణంలోని స్థానిక ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మాచారి లతో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ పోలీసు గౌరవ వందనం పరేడ్ కార్యక్రమాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యం నిర్వహణ మున్సిపల్ కమిషనర్ కు సూచిస్తూ వేదికను పుష్పాలంకరణ చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్య అతిథులకు ఆహ్వాన పత్రాలు అందించడం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమానికి విచ్చేసే ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ సభ నిర్వహణను చేపట్టాలని ఆర్డీఓ మహబూబాబాద్ కు తెలిపారు. జిల్లా ప్రగతి పై రూపొందించే కాపీ ఏర్పాట్లను సీపీఓ, డీపీఆర్ఓ చూడాలన్నారు. ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని తాహసీల్దార్ కు సూచించారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని పలు శాఖ అధికారులకు సూచించారు. అగ్నిమాపక యంత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఫైర్ శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారికి తెలియజేశారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం కదం తొక్కిన

# పాలమూరు పేదలు




### టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండల కార్యాలయం ముట్టడి

### తహసిల్దార్ ఝూన్సీరామ్ నాయక్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రం

### ఈనెల 26 తర్వాత అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్

**విశ్వంభర, మహబూబ్‌నగర్:** 523 సర్వేనెంబర్లో తమ ఇంటి స్థలాల పట్టా సర్టిఫికెట్లు 2018లో ప్రభుత్వానికి స్వాధీనపరచి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందుటకు అర్హులుగా నిర్ధారించబడిన వారు తక్షణం తమకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని వందలాది మంది పేదలు మహబూబ్ నగర్ అర్బన్ తహసిల్దార్ కార్యాలయం ముట్టడించారు. సర్వేలని, విచారణలని కాలయాపన చేయడం అర్హులకు అన్యాయం చేయడమేనని వారు ధ్వజమెత్తారు. పదుల సార్లు విచారణ జరిపి, ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లను స్వాధీనపరుచుకొని డబల్ బెడ్ రూమ్ లు పొందుటకు అర్హులుగా నిర్ధారించబడ్డ వారిని మళ్లీ విచారణల పేరుతోటి జాప్యం చేయడం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ అతని అనుచరులు, అప్పటి రెవెన్యూ ఇతర అధికారులు అర్హులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వకుండా అక్రమంగా అమ్ముకున్న చేదు అనుభవాలను మరువలేక పోతున్నామని బాధితులు తెలిపారు. అవినీతికి పాల్పడ్డ అధికారులను, అప్పటి మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఇతర పైరవీకారులపై కేసులో నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో విచారణ జరిపి అర్హులు కారని తేల్చిన తర్వాత అర్హువులు కాని వారికి డబల్ బెడ్ రూములు ఇవ్వడం అమానుషమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతిపరులపై చర్యలు తీసుకొని, తమకుతమకు న్యాయం చేస్తారని బాధితులు సంబరపడ్డారని నాయకులు తెలిపారు. తీరా సంవత్సరం గడుస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో బోధపడటం లేదన్నారు. ఎమ్మెల్యే ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని ఆందోళన ఉధృతం చేయకముందే సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ లో ఉండి అవినీతిపరులుగా ముద్రపడ్డ నాయకులు, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల తమకు న్యాయం జరగడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందనే అనుమానాన్ని వారు వ్యక్తపరిచారు. మహబూబ్నగర్ అర్బన్ మండల పరిధిలో 4,800 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, సొంత ఇల్లు సొంత భూమిలేని పేదలకు 130 చదరపు గజాల భూమిని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన అమౌంట్ను మంజూరు చేయాలని ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు కోరారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుందని, ఇల్లు గాని ఇంటి స్థలం గాని లేని పేదల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఎందుకు అది పేదలకు ఇళ్ల స్థలాల కొరకు పంచడం లేదని ఈ సందర్భంగావారు నిలదీశారు. మహబూబ్నగర్ అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ భూమి వివరాలు తెలుపు శ్వేత పత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా మహబూబ్నగర్ పట్టణంలోని పేదాల నివాస స్థలాల వద్ద తమ సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని టిఎఫ్టియు నాయకులు తెలిపారు. ఈ సర్వేలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని వారు తెలిపారు. ప్రధానంగా మహబూబ్నగర్ పట్టణ మూలవాసులైన వీరన్నపేట్, మదీనా మజీద్, బండ్ల గిరి, పాత పాలమూరు, తిరుమల దేవుని గుట్ట, ఫైర్ స్టేషన్, శాశాబ్ గుట్ట, మొనప్పగుట్ట, ప్రాంతాలలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో వీరికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తమ సర్వేలో తేలిందన్నారు. చిన్నచిన్న గదుల్లో రెండు మూడు కుటుంబాలు జీవిస్తున్నారని, కుటుంబ పోషణకు నిర్దిష్టమైన ఉపాధి అవకాశాలు కూడా వారికి లేవని, ఇంటి కిరాయిలు చెల్లించడానికి వాళ్ల సంపాదనలో 40 శాతం ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మూలవాసులు పట్టణాన్ని వదిలి వలస పోవడమో, సమరశీల పోరాటాలకు సిద్ధపడము వారి ముందు రెండే మార్గాలు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు గమనించాలని వారు కోరారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మహబూబ్‌నగర్ అర్బన్ మండల తహసిల్దార్ ఝూన్సీరామ్ నాయక్ కి ఇచ్చారు. తాసిల్దార్ స్పందిస్తూ ఈనెల 26 తర్వాత అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డబల్ బెడ్రూంలో అవినీతిపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ జరిగిందని తదుపరిచార్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి ఖలీల్, టిపిజేఏసీ రాష్ట్ర నాయకులు కె. రామకృష్ణ, టి ఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి విజయకుమార్, పి యాదగిరి, జిల్లా నాయకులు జలాల్ పాషా, జి గట్టన్న, కే జయపాల్, బాలకృష్ణ, కెవిఎస్పిస్ జిల్లా నాయకులు గోవిందు, డబల్ బెడ్ రూమ్ బాధితులు బషీర్, కుమ్మరి రాజు, హనీఫా బేగం, శ్రీదేవి, అస్మిన్ బేగం, శంకరమ్మ, ఫర్హానా బేగం అజీజ్ బేగం, పద్మమ్మ,తస్మిన్ బేగం, హాజీరా బేగం, కైరున్నీసా బేగం, అబ్దుల్ అజీజ్, రాజ్ కుమార్, పరమేష్, రమేష్, మంజుల,పారిజాతం, మాధవి, లలితమ్మ లక్ష్మీదేవి, అలివేలు,గాయత్రి, తదితరులు పాల్గొన్నారు





## నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

**ఎమ్మెల్యే బాలు నాయక్**

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండల పరిధిలోని మాల్ గోడకొండ్ల, విటి నగర్ గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. అనంతరం మధనాపురం గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయం నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన పాలక వర్గ ఛైర్మన్, కమిటీ సభ్యులకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీలు భవాని పవన్ కుమార్, రవి



నాయక్, మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాజి జడ్పీటీసీలు హరి నాయక్, జంగిటి నర్సింహా, మాస మంజుల భాస్కర్, వైస్ ఎంపీపీ యాది గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటయ్య, మండల నాయకులు దోతిరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కొండల్ యాదవ్, మాజి సర్పంచులు ముచ్చర్ల యాదగిరి, రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకట్ నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

## గడిచిన పదేళ్లలో బీసీలపై ప్రేమ ఏమైంది?

**బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



**విశ్వంభర, హైదరాబాద్ :** నేడు దేశవ్యాప్తంగా మొత్తం జనాభా లెక్కల తో పాటు కులాల వారీగా అన్ని సామాజిక వర్గాల జనాభా లెక్కలను ప్రజల ముందు ఉంచవలసిన అవసరం ఎంతో ఉన్నది అని గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణకు ఆదేశాలు ఇచ్చిన విషయం విధితమే అని బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ బీసీ జనాభా ఎంత ఉన్నదో అంతకు తగినట్టుగా విద్య, ఉద్యోగ, రాజకీయ ,రంగాలలో రిజర్వేషన్లు లేకపోవడంతో వారు చట్టసభలలో తగిన ప్రాధాన్యత పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న, చేసిన, కుల గణన బీసీల రాజకీయ రిజర్వేషన్లకు ఆర్థిక అసమానతల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. యావత్ బీసీ కులాలు ఈ సందర్భంగా తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి అని అన్నారు. రాజకీయ ప్రాధాన్యంలో భారీవ్యత్యాసాలు ఉన్నాయని ప్రభుత్వాల నుంచి పొందే అవకాశాలలో కూడా అంతే స్థాయిలో అసమానతలు ఉన్నాయి అన్నారు. వీటిని సమతుల్యం చేసేలా ప్రత్యేక బీసీ కమిషన్ తో పూర్తి సమాచారాన్ని సేకరించి రిజర్వేషన్ ఫలాలు అందరి బీసీలకు ఈ కులగణనను లెక్కలతో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పడని బీసీలు భావించడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వం చేసిన ఒకరోజు సమగ్ర కుటుంబ సర్వే అసలు ఎందుకు చేశారో? ఆ లెక్కలు ఎక్కడున్నాయో? అందులో బీసీ జనాభా శాతం ఎంతో? ఆ లెక్కలు బయట పెట్టకుండా పదేళ్లపాటు ఏం చేశారో ఎవరికీ తెలియదని అన్నారు. కానీ ఇప్పుడు ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ బీసీలు 52% పైగా ఉన్నారు అంటున్నారని ఈ లెక్క వారికి తెలిసినప్పుడు తమ పార్టీ ఒక దశాబ్ద కాలం అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు బీసీలకు గుర్తింపు రాలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో బీసీలకు చట్టసభలలో ఎన్ని సీట్లు ఇచ్చిందో అధికారంలో బీసీల ప్రాధాన్యత ఏంటో మన కళ్ళ ముందు కనిపిస్తున్నది కదా అన్నారు. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి పార్టీ 2014 –22 వరకు 8 సంవత్సరాల పాటు టిఆర్ఎస్ పార్టీగా 2022 నుంచి రెండేళ్ల పాటు బిఆర్ఎస్ పార్టీగా మొత్తం పదేళ్లు అధికారంలో ఉండి ఏ రోజు కూడా బీసీ కుల గణన గురించి రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదని అధికారం కోల్పోయిన తర్వాత బీసీలపై కులగణన పై మొసలి కన్నీరు కారుస్తున్నారని గతంలో బీసీలతో ఒక్క మాట ముచ్చట లేకుండా ఎలాంటి కమిటీ వేయకుండా 33% ఉన్న రిజర్వేషన్ 23 శాతానికి తగ్గించినప్పుడు ఆ ఎమ్మెల్సీ ఎందుకు కేసీఆర్ ను ప్రశ్నించి ఎన్నికలను అడ్డుకోలేదని ఆక్షేపించారు. ఎందుకు బీసీలపై జరుగుతున్న దాడులను అన్యాయాలను అరికట్టడానికి బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురా లేక పోయారు వీటన్నిటినీ ప్రశ్నించేందుకు అప్పుడు ఒక్క బహిరంగ సభ అయినా ఎందుకు పిలుపునివ్వలేదని స్థానిక సంస్థలలో తీరని అన్యాయం జరుగుతుందని అనేక బీసీ సంఘాలు మేధావులు బీసీ విద్యార్థి సంఘాలు ధర్నాలు సెమినార్ల ద్వారా ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ ఏనాడు బీసీలను పిలిచి మాట్లాడే సమయం ఇవ్వని కేసీఆర్ కుటుంబం నేడు అధికారం కోల్పోయిన తర్వాత బీసీల రిజర్వేషన్లపై అధ్యయనం పేరిట పార్టీ నాయకులు బృందాన్ని ఒక్కొక్క రాష్ట్రానికి పంపి అదిగో బీసీలకు ఆ రాష్ట్రంలో రిజర్వేషన్ ఇలా ఉన్నాయి. మీరు ఇలా చేయండి అని మరో కొత్త డ్రామాకు తెరలేపారని ఓటమి తర్వాత బిఆర్ఎస్ పార్టీకి బీసీలపై ఎక్కడలేని చిత్తశుద్ధి పుట్టుకొచ్చిందని అన్నారు. బీసీలకు నాయకత్వం వహించడానికి ఒక్క బీసీ లీడర్ కూడా లేదు అన్నట్లు ఎమ్మెల్సీ నాయకత్వం వహించడం బీసీలను అవమానకరం కాదా? అన్నారు. అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టాలని ఆ ఎమ్మెల్సీ డిమాండ్ చేయడం ముందు ఆమే కోరుకున్న సమానత్వాన్ని మీరు మీ పార్టీలో అమలు చేయాలి కదా పార్లమెంట్ లో మహిళా బిల్లు పెట్టినప్పుడు అందులో బీసీ మహిళల వాటా గురించి ఎన్నడూ మాట్లాడని ఎమ్మెల్సీ తెలంగాణ చేస్తున్న కులగణనలలో తప్పులు వెతుకుతూ బీసీలకు న్యాయం జరగాలని బీసీ కమిషన్ కు వినతి పత్రం ఇవ్వడం ఆశ్చర్యకరం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల వల్ల గతంలో ఆయా సామాజిక వర్గాల నుంచి తమ పార్టీకి ఉన్న పట్టు కోలిపోతామో ఏమో అన్న భయం భారత రాష్ట్ర సమితిలో మొదలైందని, అన్నారు. కులగణనపై వారికి ఏ భయం లేనట్లయితే వారు చేసిన ఒక్కరోజు సమగ్ర కుటుంబ సర్వే ఫలితాలను ఆనాడే ప్రజలకు చెప్పేవారు, కానీ అలా జరగలేదంటే వారికి ఎక్కడో ఎందుకో బీసీల భయం పట్టుకుందని అందుకే కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇంత ద్వేష భావం ఎందుకు? ఇది బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చేసి తీరుతామన్న రాహుల్ గాంధీ పై ,రేవంత్ రెడ్డి పై, ద్వేషమా? లేక బీసీలపై ద్వేషమా? అని నూతి శ్రీకాంత్ గౌడ్ ప్రశ్నించారు.

## బీఆర్ఎస్ పార్టీ అంటే ఎందుకు భయం

### రైతు ధర్నాకు అనుమతులు ఎందుకు ఇవ్వలేదు

### సాకులు చెప్పి తప్పించుకోవడం కాంగ్రెస్ కు అలవాటే

### కాంగ్రెస్ పాలనలో నిరసన తెలిపే హక్కు లేదా...?

**తెలంగాణ ఫుడ్స్ మాజీ ఛైర్మన్ మేడే రాజీవ్ సాగర్**



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీని చూసి కాంగ్రెస్ సర్కార్ ఎందుకు భయపడుతుందని తెలంగాణ ఫుడ్స్ మేడే రాజీవ్ సాగర్ ప్రశ్నించారు. నల్గొండ లో తలపెట్టిన రైతు భరోసాకు కావాలనే అనుమతులు ఇవ్వలేదని మండిపడ్డారు. షాబాద్ ధర్నా విజయవంతం కావడంతో కాంగ్రెస్ జంకుతుందని విమర్శించారు. ప్రజల పక్షాన సర్కార్ ను నీలదీస్తుంది కాబట్టే బీర్ఎస్ పార్టీ చేపట్టే ధర్నాలకు కావాలనే అడ్డంకులు సృష్టిస్తుందని దుయ్యబట్టారు. ప్రజాపాలన చెప్పే కాంగ్రెస్ పాలనలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్బంధం అని మరోసారి రుజువయ్యిందన్నారు. ఎన్నికలు ఇచ్చి మరిచిన హామీలను బీఆర్ఎస్ ప్రజావేదికగా గుర్తు చేస్తే కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడడం లేదన్నారు. 100 శాతం రుణ మాఫీ ఒక్క గ్రామం కూడా రాష్ట్రంలో లేదని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టిన సరే రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

## మోహన్ భగవత్, అమిత్ షాలపై కేసులు పెట్టాలి

**విశ్వంభర, హైదరాబాద్:** మోహన్ భగవత్ స్వాతంత్రం గురించి మాట్లాడిన విషయంలో ఎందుకు కేసు పెట్టలేదని హైదరాబాదు గాంధీభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వి హనుమంతరావు అన్నాడు. మోహన్ భగవత్ అయోధ్యలో రాముడి గుడి కట్టినపుడే నిజమైన స్వాతంత్రం వచ్చిందని అన్నాడు. 1947 ఆగస్టు 15 లో రాలేదు అని అన్నాడు. సమాజాన్ని, పిల్లలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడిన ఆర్.ఎస్.ఎస్ అధ్యక్షులు మోహన్ భగవత్ పై, అంబర్ పేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసామని, హోమ్ శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేశాడు. వ్యవస్థలు బీజేపీ, ఆర్.ఆర్.ఎస్ లు వారి ఆధీనంలో ఉన్నాయని అన్నందుకు రాహుల్ గాంధీ పైన అస్సాంలో కేసు పెట్టిన అక్కడి ప్రభుత్వం వెంటనే ఉపసంహరణ చేయాలి. మోహన్ భగవత్, అమిత్ షాలపై కేసులు పెట్టాలి. లేకపోతే ఉద్యమాన్ని చేపడుతాం అన్నాడు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చరణ్ యాదవ్, ఉన్నారు.

## సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**విశ్వంభర, చింతపల్లి:** సంగారెడ్డి లో జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారీ ఐలయ్య తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో సోమవారం సీపీఎం రాష్ట్ర మాసభల పోస్టర్ ను అయన ఆవిష్కరించి మాట్లాడుతూ. సీపీఎం నాల్గవ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు 4 రోజుల పాటు జరగనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్,మండల కార్యదర్శి వుడుగుండ్ల రాములు, మండల కమిటీ సభ్యులు పోలే యాదయ్య,అమృతాచారి, ఎండి సర్దార్,పెద్దయ్య,ఎల్లంకి సైదులు, జావిద్, తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్ 2.0.. ప్రపంచం దృష్టంతా
# పెద్దన్న వైపు!

## 78ఏళ్ల వయస్సులో రెండో పర్యాయం అగ్రరాజ్యధినేతగా బాధ్యతల స్వీకరణ

కొందరు ఆయన్ను ప్రేమిస్తారు.. మరికొందరు ఆయన్ను ద్వేషిస్తారు.. కానీ ఆయన్ను విస్మరించడం మాత్రం ఎవరి వల్లా కాదు.. ఆయనే డొనాల్డ్ ట్రంప్. అమెరికా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు సార్లు అభిశంసనకు గురైన మిస్టర్ ట్రంప్..రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వైట్ హౌస్ లోకి అడుగు పెట్టారు. కోర్టు కేసులు, విమర్శలు, న్యాయపరమైన చిక్కులు.. ఇలా ఎన్ని అడ్డంకులు ఎదురైనా.. ఓడిన చోటే గెలవాలన్న పట్టుదలతో అనుకున్నది సాధించిన డొనాల్డ్ ట్రంప్.. రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు. ఓ నేరస్థుడిగా ముద్రపడిన తొలి అమెరికా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. 78 ఏళ్ల వయసులో అగ్రరాజ్యాధినేతగా మరోసారి బాధ్యతలు స్వీకరిస్తున్న వేళ.. వ్యక్తిగతంగా, అమెరికాపై 'ట్రంప్ మార్క్' ఏవిధంగా ఉండబోతుందన్న విషయంపై యావత్ ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది.

**మద్దతుదారులు అభిమాన నేత వెంటే..**

మొదటిసారి అధ్యక్ష ఎన్నికల నుంచి.. మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ పడే నాటికి ఎన్నో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2020 నవంబర్ ఫలితాలను అంగీకరించేందుకు నిరాకరించిన వేళ.. ఆయన మద్దతుదారులు యూఎస్ క్యాపిటల్‌ను ముట్టడించిన తీరు, ఆ క్రమంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచాయి. ట్రంప్‌తోపాటు వందలాది మద్దతుదారులపై కేసులు నమోదయ్యాయి. మరోవైపు హష్ మనీకి సంబంధించి క్రిమినల్ కేసులు, న్యాయ విచారణ వంటి అంశాలు ఆయన్ను వెంటాడాయి. వీటిలో దోషిగానూ తేలారు. అయినప్పటికీ మద్దతుదారులు మాత్రం అభిమాన నేత వెన్నంటే నిలిచారు.

**ట్రంప్‌పై హత్యాయత్నం..**

పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారంలో ఉన్న సమయంలో ట్రంప్‌పై హత్యాయత్నం జరగడంతో అంతా ఉలిక్కిపడ్డారు. చెవిని తాకుతూ బుల్లెట్ దూసుకెళ్లడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఆ తర్వాతా ఆయనపై దాడికి ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ దూకుడుగా వ్యవహరించిన ట్రంప్ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వానికి ఆమోదం తెలిపే కార్యక్రమానికి చెవికి బ్యాండేజీతో వచ్చిన ఆయనకు మద్దతుదారుల నుంచి పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించింది.

**అక్రమ వలసలను అరికడతానని హామీ..**

తాను అధికారంలోకి వస్తే అమెరికాను మళ్లీ గొప్పగా మారుస్తానని, మెక్సికో సరిహద్దులో కంచె నిర్మాణం పూర్తిచేసి అక్రమ వలసలను అరికడతానని ట్రంప్ తన ప్రచారంలో పదేపదే పేర్కొన్నారు. యుద్ధాలను నిలిపివేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యర్థుల నుంచి విమర్శలు వ్యక్తమైనప్పటికీ దీటుగా ఎదుర్కొంటూ తన విధానాలను స్పష్టంగా ప్రకటించారు. తనదైన శైలిలో అమెరికన్ ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేసి విజయం సాధించారు.

**ఫలితాల అనంతరం కీలక ప్రకటనలు**

ఫలితాల అనంతరం కూడా ట్రంప్ పలు కీలక ప్రకటనలు చేశారు. కెనడాను 51వ రాష్ట్రంగా చేయడం, గ్రీన్‌ల్యాండ్, పనామాలను స్వాధీనం చేసుకోవడం, గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చడం వంటి ప్రకటనలు చేసిన ట్రంప్.. అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే కీలక ఆదేశాలపై సంతకాలు చేస్తానని ప్రకటించారు. ముఖ్యంగా అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డిపార్టేషన్ ఆపరేషన్ చేపడతామని చెప్పారు. మరోవైపు గతంలో చైనా వంటి దేశాలతో దూకుడుగా వ్యవహరించిన ఆయన.. ప్రపంచశాంతికి కలిసి పనిచేద్దామని స్నేహహస్తం చాచారు.

**కుటుంబ నేపథ్యం..**

న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ, ఫ్రెడ్ దంపతులకు జూన్ 14, 1946న డొనాల్డ్ ట్రంప్ జన్మించారు. తండ్రి ఫ్రెడ్ ట్రంప్ ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఐదుగురు సంతానంలో ట్రంప్ నాలుగోవాడు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ కామర్స్‌లో 1968లో డిగ్రీ పట్టా పొందారు.

తండ్రి కంపెనీలో 1971లో బాధ్యత స్వీకరించిన ట్రంప్.. అనంతరం ట్రంప్ ఆర్గనైజేషన్‌గా పేరు మార్చారు. హోటల్స్, రిసార్టులు, నిర్మాణ రంగం, క్యాసినోలు, గోల్ఫ్ కోర్స్‌ల్లో అడుగుపెట్టి తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. 2004లో 'ది అప్రెంటిస్' రియాల్టీ టీవీ షోతో దేశమంతా పాపులర్ అయ్యారు.

క్రీడాకారిణి, మోడల్ ఇవానా జెలింకోవాను తొలుత వివాహం చేసుకున్న ట్రంప్.. 1990లో ఆమెకు విడాకులు ఇచ్చారు. వీరికి డొనాల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్‌లు సంతానం. ఆ తర్వాత నటి మార్లా మార్పెల్స్‌ను 1993లో పెళ్లి చేసుకున్న ట్రంప్.. 1999లో ఆమెతో విడాకులు తీసుకున్నారు. వీరి కుమార్తె టిఫానీ ట్రంప్. స్లోవేనియాకు చెందిన మాజీ మోడల్ మెలానియాను 2005లో ట్రంప్ వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడు బారన్ విలియమ్ ట్రంప్.

**వ్యాపారవేత్తగా..**

చదువులు పూర్తి చేసిన తర్వాత ట్రంప్ తన తండ్రి లాగే రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి వెళ్లారు. తండ్రిలా కాకుండా వ్యాపారంలో రిస్క్ చేయాలన్నది ట్రంప్ ఆలోచన. బోల్డ్‌గా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్లిన ట్రంప్ చాలాసార్లు వ్యాపారంలో ఘోరంగా దెబ్బతిన్నారు. 1980లలో విలాసవంతమైన భవనాలు, హోటళ్ళు, కాసినోలలో భారీగా పెట్టుబడి పెట్టారు. అయితే 1990ల ప్రారంభంలో అమెరికాను చుట్టేసిన మాంద్యం ట్రంప్ కు నష్టాలను తెచ్చిపెట్టింది. భారీ అప్పులు ఆయన నెత్తిమీద వచ్చి పడ్డాయి. కొన్నాళ్లపాటు దివాలా అంచు వరకు ఉన్న ట్రంప్ 2000వ సంవత్సరం తర్వాత కోలుకున్నారు. నాడు రియాలిటీ టీవీ షోలలో కనిపించి మెరిశారు. ది అప్రెంటిస్ అనే బిజినెస్ పోటీ షోతో ప్రజలకు దగ్గరయ్యారు . ఈ ప్రోగ్రామ్‌లో 'యు ఆర్ ఫైర్' అని ట్రంప్ చెప్పే డైలాగ్ నాడు అమెరికాలో మారుమోగింది. ఇలా తనకంటూ ఓ సపరేట్ బ్రాండ్ క్రియేట్ చేసుకున్న ట్రంప్ మరోసారి విజయవంతమైన వ్యాపారవేత్తగా మారారు.

**ఓటమి తర్వాత..**

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన ట్రంప్ ఆ తర్వాత మరిన్ని వివాదాల్లో చిక్కుకున్నారు. ముఖ్యంగా 2021 జనవరి 6న క్యాపిటల్ హిల్ భవనంపై ఆయన మద్దతుదారులు దాడి చేయడం, అక్కడి పరిసరాలకు నిప్పు పెట్టడం అమెరికాను ఉలిక్కిపడేలా చేసింది. నాడు ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ట్రంప్ తన సపోర్టర్స్‌ను ప్రసంగాలతో రెచ్చగొట్టడం కారణంగానే వారంతా విధ్వంసానికి దిగారని నాటి సైనికాధికారులే ప్రకటించారు. హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ నుంచి ట్రంప్ అభిశసంనలకు గురవడంతో ఆయన రాజకీయ జీవితం ముగిసినట్టేనని అంతా భావించారు.

**రెండోసారి అధ్యక్ష పీఠంపైకి..**

అందరి ఆలోచనలకు తగ్గట్టుగా నడుచుకుంటే ఆయన ట్రంప్ ఎందుకవుతారు.. 2020 ఎన్నికల్లో బైడెన్ చేతిలో ఓటమి చెందిన ట్రంప్.. 2024లోనూ బరిలోకి దిగారు. డెమోక్రట్ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై విజయం సాధించి రెండోసారి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

**పడిలేచిన కెరటంలా..**

భారీ సంపద, హోదా ఉన్నప్పటికీ ఆయన ఎదుర్కొన్న ఎదురుదెబ్బలు, కిందపడి మళ్లీ లేచి గెలిచిన నైజం ఆయనలోని పోరాటయోధుడిని కళ్లకు కడుతోంది. ఎన్నో కష్టమైన ఆర్థిక, రాజకీయ క్షణాలను ఒంటరిగానే ఎదుర్కొన్న ట్రంప్ వ్యక్తిగతంగానూ ఎన్నో బాధలు పడ్డారు. ట్రంప్‌ని ఎన్నో అంశాల్లో తిట్టేవారు ఉండొచ్చు కానీ ఆయన్ను మెచ్చుకోకుండా ఉండలేని విషయం ఒకటుంది. ఆయన మందు తాగరు.. అల్కహాల్‌కు చాలా దూరంగా ఉంటారు. 1981లో తన సోదరుడు అల్కహాల్ అలవాటు కారణంగానే అనారోగ్యంతో చనిపోయాడు. ఇది ట్రంప్‌ను ఎంతగానో కుంగదీసింది. అందుకే మద్యాన్ని పుచ్చుకోని ట్రంప్ తన తోటివారికి కూడా మందు తాగవద్దని చెబుతుంటారు. అటు ట్రంప్ వైవాహిక జీవితం కూడా ఎన్నో వివాదాలతో ముడిపడి ఉంది. 1990లో మొదటి భార్య ఇవానాతో విడాకులు ట్రంప్‌ను మానసికంగా కుమిలిపోయేలా చేసింది. అటు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. ఇలా వ్యక్తిగతంగా, రాజకీయపరంగా ఎన్నో కష్టనష్టాలను అనుభవించిన ట్రంప్ మరోసారి అధ్యక్షుడిగా గెలవడాన్ని ఒక ఏడాది ముందు వరకు ఎవరు ఊహించి ఉండరు కూడా. అత్యంత శక్తివంతమైన వ్యక్తులు కూడా తమతో తామే మూసివేసిన తలుపుల లోపల సొంత యుద్ధాలను ఎదుర్కొంటారని చెప్పేందుకే ట్రంప్ జీవితమే ప్రత్యక్ష సాక్ష్యం.. మరి అగ్రరాజ్యపు అధ్యక్షునిగా ముమ్మందు ప్రపంచానికి ఎటువంటి దక్షత ప్రదర్శిస్తాడో ఈ మొక్కవోని వ్యాపారి ట్రంప్. తన టెంపరితనంతో ప్రత్యర్థులకు టెంపరేచర్ పెంచి ఎదురులేని విక్టరీ సాధించిన ట్రంప్ వచ్చే నాలుగేళ్లు ప్రపంచంపై ఎలాంటి ప్రభావం చూపిస్తారో చూడాలి

**రాజకీయాల్లోనూ..**

ఇలా 2015 వరకు వివిధ వ్యాపారాల్లో బిజీగా ఉన్న ట్రంప్ అదే సంవత్సరం నుండి ఎవరూ ఊహించని విధంగా రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు.రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని ట్రంప్ చెప్పినప్పుడు అంతా నవ్వారు. పిచ్చోడు ఏదో మాట్లాడుతున్నాడని ఎగతాళి చేసినవారు కూడా ఉన్నారు. అయితే ట్రంప్ ఎవరి మాటలు పట్టించుకోలేదు.. చేయాల్సింది చేశారు.. నామినేషన్ వేయడమే కాదు.. 2016ఎన్నికల్లో గెలిచి అమెరికా 45వ అధ్యక్షుడిగా వైట్ హౌస్ మెట్లెక్కారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యారే కానీ ఎన్నో సమస్యలు ఆయన్ను చుట్టుముట్టాయి. ఎన్నో వివాదాల్లో ఆయన చిక్కుకున్నారు. వివిధ అంశాల్లో ఆయన విధానాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్ విధానాలను మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముస్లిం వ్యతిరేకి అంటూ దుయ్యబట్టాయి. అంతేకాదు అనేకసార్లు నల్లజాతీయులకు వ్యతిరేకంగా విద్వేష వ్యాఖ్యలు చేసిన ట్రంప్ అపఖ్యాతి మూటగట్టుకున్నారు.ఆయన హయంలోనే ప్రపంచాన్ని కుదిపేసిన జార్జ్ ఫ్లాయిడ్ హత్య జరిగింది.ట్రంప్ పాలనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించిన సందర్భాలు చాలానే ఉన్నాయి.అటు NATO మిత్రదేశాలతోనూ అమెరికా సంబంధాలు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే దెబ్బతిన్నాయి.

# తెలంగాణ వైతాళికుడు ముచ్చర్ల సత్యనారాయణ

## నేడు ఆయన 92వ జయంతి, ఆయన ఊరు పేరే.. ఇంటి పేరుగా స్థిరపరుచుకున్న పోరాట యోధుడు

**తెలంగాణ సాధనే జీవిత ఆశయంగా తుదివరకు పోరాడిన వ్యక్తి సంగం రెడ్డి సత్యనారాయణ. కవి, గాయకుడు, జర్నలిస్ట్, మాజీ మంత్రిగా వివిధ బాధ్యతలు నెరవేరుస్తూనే తెలంగాణ కోసం విశేషంగా కృషి చేశారు. ఆయన రాసిన, పాడిన పాటలు ప్రజలను చైతన్యం చేశాయి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, వివక్ష ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవి. వివక్ష గురించి సత్యనారాయణ రాసిన ''మా పెంట మీదా కోడి మీకు వంటయినప్పుడు, మేము అంటరానోళ్లం ఎట్లయితం'' అని దళిత బహుజనులు ఎదుర్కొన్న వివక్షను ముక్కుసూటిగా ప్రశ్నించారు. నేడు ఆయన 92వ జయంతి సందర్భంగా విశ్వంభర, ప్రత్యేక కథనం..**



తెలంగాణ వైతాళికుల్లో ఒకరైన సంగం రెడ్డి సత్యనారాయణ తన స్వగ్రామమైన ముచ్చర్ల పేరుతోనే ప్రాచుర్యం పొందడం అందరికీ తెలుసు. తన పేరుకు ఊరును జోడించడం ఆయనకూ ఆనందమేనేమో! తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎర్రగా ఉదయించి, మలి ఉద్యమ దశ దాకా తాను అస్తమిస్తూ కూడా అంతే దేదీప్యమానంగా వెలిగిన తీరులోనే ఆయన పోరాట తత్వం దాగి ఉంది. తెలంగాణలో ప్రజా పాలన రావాలన్న ఆయన కలలను నెమరేసుకుంటూ నేడు రవీంద్ర భారతిలో ముచ్చర్ల సత్యనారాయణ 92వ జయంతిని జరుపుకుంటున్నారు. ఇదే జనవరి మాసంలోనే నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారులైన ప్రొఫెసర్ కేశవరావు జాదవ్, సంగం రెడ్డి సత్యనారాయణల ఇరువురి 92వ జయంతి జరుపుకోవడం యాదృచ్ఛికమైనా, ఒక విశిష్టతగానే మనం భావించవచ్చును. బహుగుణ సంపన్నుడైన ముచ్చర్ల సత్యనారాయణలోని బహుజన తత్వం, అంతర్గత జీవన తత్వంగా ఎలా పెరిగి పెద్దయ్యిందో తెలుసుకోవడానికి ఇంతకంటే మంచి సందర్భం మరొకటి ఉండజాలదు. దాన్ని గుర్తించి ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి కాగలదు.

పోరాటాల ఖిల్లాగా ప్రఖ్యాతి పొందిన వరంగల్ జిల్లాలోని ముచ్చర్ల గ్రామంలో ఒక యాదవ కుటుంబంలో 1933 జనవరి 1 తేదీన సంగం రెడ్డి సరసయ్య-నరసమ్మ దంపతులకు ఏడుగురు సంతానంలో చివరి వారుగా సంగం రెడ్డి సత్యనారాయణ జన్మించారు. నాలుగు సంవత్సరాల వయసులోనే కన్నతల్లిని కోల్పోయారు. అయితే ఇంటిల్లిపాదిని పెంచి, పెద్ద చేసి చదివించిన తండ్రి పెంపకంలో, అక్కలు-అన్నలు-వదినెల ప్రేమలతో పెరిగి పెద్దవాడైన సత్యనారాయణ చదువులో రాణించాడు. 5వ తరగతి నుండి రోజు 12 కిలోమీటర్లు కాలినడకన నడిచి పోయి వస్తూ ఆయన చదువు సాగేది. ఇంత సుదీర్ఘ నడకతో పాటు, పేదరికం వెంటాడుతున్నా నిరంతరం సాగే ఆటపాటలతో చదువుతోపాటు తన వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకున్నాడు. నిజాం వ్యతిరేక రైతాంగ పోరాట ప్రభంజనాన్ని, కమ్యూనిస్టు పార్టీ ప్రభావాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా చూస్తూ వడిసెల దళాలలో, గుతుపల దండులో భాగమవుతూ ఆయన యవ్వనమంతా సాగింది. సమాజ అస్తిత్వమే మనిషి చైతన్యాన్ని నిర్ణయిస్తుందన్న మహోపాధ్యాయులు కారల్ మార్క్స్ మాటలు ముచ్చర్ల సత్యనారాయణ విషయంలో అక్షర సత్యాలు.

మూడు చెరువులు, 30 కుంటలుగా విలసిల్లిన గ్రామంలో జీవిత పర్యంతం వ్యవసాయంతో ముడి వేసుకున్న అనుభవం నుండి ఆయనలో నిజమైన రైతాంగ నేత, నిరంతర శ్రమజీవి మొగ్గ తొడిగాడు. ఆనాటి గ్రామీణ సంఘ జీవితంలో జానపద కళారూపాల్లోని భజనలు, బాగోతాలు, చిరుతల రామాయణాల నుండి ఒక వాగ్గేకారుడు ఉద్భవించి తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమ ప్రారంభంలోనే 'సంజీవరెడ్డి మామ' అంటూ ఎన్నో పాటలు పాడుతూ ప్రజలను ఉర్రూతలూగించాడు. ఆధిపత్య వాద దోపిడిదారుల చేతుల్లో న్యాయం తల్లడిల్లినప్పుడు, నిరుపేదలకు న్యాయం దక్కడానికి, తన న్యాయవాద వృత్తి సర్వస్వాన్ని ధారబోసి ప్రజల పక్షాన నిలబడ్డాడు. అన్నింటికి మించి అవినీతి, కులాధిపత్యం, ముఠాకక్షలతో పాపకింలమైన స్థానిక సంస్థల అప్రత్యక్ష ఎన్నికల్లో గ్రామ సర్పంచిగా రెండుసార్లు ఏకగ్రీవంగా మూడోసారి తీవ్రమైన పోటీలో గెలిచారు. మొదటిసారి హనుమకొండ పంచాయితీ సమితి (Block) ఉపాధ్యక్షుడిగా, మరో రెండు సార్లు అదే సమితి అధ్యక్షుడిగా గెలిచాడు. రెండవసారి సమితి అధ్యక్ష ఎన్నికల్లో క్యాంపులు, బెదిరింపులు, దాడులు, అరెస్టులు ఎదుర్కొంటూ దీరోదాత్తుడుగా నిలిచాడు. ఈ కృషిలో చీడలు, పీడలు ఎదిరించి పంటలు దక్కించుకునే ఒక రైతన్నతో పాటు, ఆయనలో అంతర్లీనంగా దాగివున్న తత్వమే బహుజన తాత్వికత. అందుకే అడుగడుగున ఎదురవుతున్న సంఘర్షణల గుండా బ్రాహ్మణ, రెడ్డి, వెలమ భూస్వామ్య అధిపత్యాల నడుమ బహుజన నాయకత్వ పటిమకు దొరికిన ప్రతి నిచ్చెన మెట్టును ఎక్కుతూ ఎమ్మెల్యే గానే గాకుండా క్యాబినెట్ హెూదా కలిగిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగానూ ఎదగాగలిగాడు.

ఈ విధంగా తను ఎదుగుతూ, తనతో పాటు పీడిత కుల నాయకులను బూర్జువ పార్టీల్లోనే ఒక జట్టుగా కూడగడుతూ ముందుకుపోయిన సత్యనారాయణ బహుజన సామాజిక తత్వాన్ని, బహుజన రాజకీయ సంస్కృతిగా మార్చాడు. ఈ క్రమంలో హత్యగావించబడ్డ తన సహచరులను చూసి ఎంతో చింతిల్లాడు. అందుకే రాజకీయ హెూదా ఆయనకెవరో దయతలిచి బిక్షగా ఇచ్చింది కాదు, పోరాడి సాధించుకోవడమే ఆయన ప్రత్యేకత. ఈ బహుజన రాజకీయ తాత్వికతలో పోరాడి గెలిచిన వాళ్లు తెలంగాణ వైతాళికులుగా వన్నెకెక్కారు. ఈ రాజకీయ చింతన లేకుంటే ముచ్చర్ల సత్యనారాయణ గారు సామాజిక సంస్కర్తగానో, వాగ్గేయకారుడిగానో లేదంటే ఉత్తమ న్యాయవాదిగానో ఎక్కడో ఒక చోట ఆగిపోయేవాడు. వీటన్నింటికి మరింత విస్తృతి కలిగించింది ఆయన బహుజన రాజకీయ తాత్విక చింతన అనడం అతిశయోక్తి కాదు. అందువల్ల బహుజన రాజకీయాలు, బీసీల రిజర్వేషన్లకై పోరాడుతున్న వాళ్లు ముచ్చర్ల సత్యనారాయణ జీవిత పాఠాన్ని అధ్యయనాంశంగా స్వీకరించాలని నా అభిప్రాయం. వీటన్నింటికీ మించిన ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్నాడు కాబట్టే, ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీలోనూ ఇముడకుండా బయటకు వచ్చాడు. సహకార ఉద్యమం ద్వారా బహుజనుల ఆర్థికాభివృద్ధికి వేసుకున్న పథకాలు అంతగా సఫలీకృతం కాకపోవడంతో "గాయపడిన కవి గుండెలలో రాయబడని కావ్యాలెన్నో" అన్న దాశరథి కవిత లాగా ఎన్నో భావాలతో చివరి దశలో అనారోగ్యంతో ఉండిపోయాడు. తెలంగాణ ఉద్యమంలో డా. పృథ్వీరాజ్తో పరిచయమైన ముచ్చర్ల సత్యనారాయణ మా తండ్రి బంద్రు నర్సింహులు లాగానే నన్ను, నా మార్గాన్ని నిరంతరం ప్రోత్సహించేవాడు.

వందేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమం (1925-2025) తనను తాను తరిచి చూసుకుంటున్న సమయంలో ప్రజల మనుషులుగా జీవించిన ముచ్చర్ల సత్యనారాయణ లాంటి వారిపై ఒక అంచనాకు రావాల్సి ఉంటుంది. తమది ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలకులు తన జీవితంలో సింహ భాగం తెలంగాణ కోసం అంకితం చేసిన బహుజన హితవాది, ప్రజా వైతాళికుడు ముచ్చర్ల సత్తన్న జీవిత సారాన్ని పాఠ్యాంశంగా కూర్చి ప్రజలకందించాలి. వారి స్మృతులను చిరస్మరణీయం చేయడానికి పూనుకోవాలి. 92 వ జయంతి సందర్భంగా ప్రజల మనిషి ముచ్చర్ల సత్యనారాయణకు హృదయపూర్వక నివాళులర్పిస్తున్నాను.



- అరుణోదయ విమలక్క
బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ

# లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

- ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి తో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) పై ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా, ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. గ్రామ సభలలో ఫ్లెక్సీ లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితాను ప్రచురించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్ లను ఏర్పాటు చేసి, అర్జీలను స్వీకరించాలని, గ్రామ సభలలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, గ్రామ సభలను ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నిర్వహించాలని, గ్రామ సభలకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా వివరించాలని, ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, ఎంతో జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీపీఓ హరిప్రసాద్, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, ఇతర జిల్లా ప్రత్యేక అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## పదోన్నతులు, సర్వీస్ రూల్స్‌పై దృష్టి సారించిన మంత్రి కోమటిరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** రోడ్లు, భవనాల శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఏఈఈ)హోదాలో ఉన్న 118 మందికి డిప్యూటీ ఇంజనీర్లు (డీఈ)గా పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. పదోన్నతులకు సంబంధించిన కసరత్తును ఉన్నతాధికారులు పూర్తిచేసి ఇప్పటికే జాబితాను సిద్ధం చేశారు. త్వరలోనే పదోన్నతుల ఉత్తర్వులు విడుదలకానున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే.. ప్రస్తుతం పదోన్నతి పొందుతున్న 118 పోస్టులకు సంబంధించి కొత్త వారితో భర్తీకి చర్యలు తీసుకోవాలంటూ ఆర్ అండ్ బీ అధికారులు టీజీపీఎస్సీకి లేఖ రాయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఏఈఈ నుంచి డీఈలుగా కొంతమందికి పదోన్నతులు దక్కుతుండగా.. డీఈ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ), ఈఈ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పోస్టుల్లో పదోన్నతుల కోసం మాత్రం ఎదురు చూడాల్సిన పరిస్తితులున్నాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితా రాకపోవడమే కారణంగా కనిపిస్తోంది. అక్కడి నుంచి సీనియారిటీ జాబితా వస్తే.. మరి కొంతమందికి పదోన్నతులు లభించనున్నాయి. కాగా, గత ప్రభుత్వం ఏళ్ల తరబడి శాఖ సర్వీస్ రూల్స్‌ను ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో.. అప్పట్నుంచి పలు హోదాల్లోని ఉద్యోగులకు పదోన్నతులు దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆర్ అండ్ బీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉద్యోగుల పదోన్నతులు, సర్వీస్ రూల్స్‌పై దృష్టి సారించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడారు. సర్వీస్ రూల్స్ ఖరారుకు సీఎం ఆమోదం తెలపడంతో.. పదోన్నతులకు మార్గం సుగమమైంది.

## కమ్యూనిస్టు యోధుడికి నివాళులు




**విశ్వంభర, నార్కెట్ పల్లి:** మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై హైదరాబాద్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించిన నార్కట్ పల్లి మండల ప్రజా పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ కామ్రేడ్ కల్లూరి యాదగిరి పార్థివ దేహానికి రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య యాదవ్, మండల కాంగ్రెస్అధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్, నార్కెట్ పల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు జెర్రి పోతుల భరత్, సట్టు సతయ్య మరియు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పద్మ బ్రాహ్మణులు తమ వృత్తిలో రాణించాలి




**విశ్వంభర, రామన్నపేట:** పద్మ బ్రాహ్మణులు తమ వృత్తిలో మరింతగా రాణించాలని పద్మ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రుద్ర పాండురంగ శాస్త్రి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని జేపీ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రోజు పద్మ బ్రాహ్మణ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా కమిటీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని మాట్లాడుతూ, వృత్తి ధర్మాన్ని, కుల ధర్మాన్ని, మత ధర్మాన్ని రక్షించుకుంటూ ముందుకు సాగాలని ఆయన కోరారు. పద్మశాలి కులస్తులు పద్మ బ్రాహ్మణుల చేతనే కార్యక్రమాలను నిర్వర్తించుకోవాలని అయన కోరారు. పద్మ బ్రాహ్మణులు విలువలు, ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలో పద్మ బ్రాహ్మణ సంఘ భవణ నిర్మాణానికి ప్రభుత్వాన్ని కోరాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు అవిరేణి కృష్ణశాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు కొంగరి నరసింహ శాస్త్రి, కర్నాటి నరేందర్ పంతులు, చిట్యాల వెంకటేశం, ఐటిపాముల భీమయ్య, కేమ రామదాసు, రాపోలు అయోధ్య, దోర్నాల లింగస్వామి, బడుగు యాదగిరి, అప్పం రాములు, చెరుపల్లి భాస్కర్, రవ్వ పండు, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు రచ్చ యాదగిరి, కైరంకొండ నాగభూషణం, సంగిశెట్టి సుదర్శన్, జెల్ల వెంకటేష్, బొడ్డుల నారాయణ, భోగ మహేష్, రాపోలు విఘ్నేష్, ఉమ్మడి నల్లగొండ జిల్లా పద్మ బ్రాహ్మణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖల నియామకం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని నిదానపల్లి, లక్ష్మాపురం, శోభనాద్రిపురం గ్రామాలలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి ఆధ్వర్యంలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ మేడి శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఈర్లపల్లి మల్లయ్య, ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షుడు నల్ల స్వామి హాజరై మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ను గ్రామ గ్రామాన బలోపేతం చేయడంలో భాగంగా గ్రామ కమిటీలు నియమించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిదానపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా వర్కల శ్రీనివాస్ మాదిగ, లక్ష్మాపురం గ్రామ శాఖ అధ్యక్షులుగా చిత్రకంటి స్వామి మాదిగ, శోభనాద్రిపురం గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎర్ర రాజకుమార్ మాదిగ లను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఎన్నికైనట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి మాదిగ తెలిపారు.

## ఐరా సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వరంలో భారీ రైతు ప్రదర్శన క్షేత్రం



**విశ్వంభర, కారేపల్లి:** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని పాటి మీద గుంపు గ్రామంలో ఐరా సీడ్స్ వారి ఆధ్వర్యంలో భారీ రైతు ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం గాంధీ చౌక్ సాయి కృష్ణ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ వెదుళ్ళ మురళి మాట్లాడుతూ రైతులకు నమ్మకమైన నాణ్యమైన విత్తనాలు కేరాఫ్ గా ఐరా సీడ్స్ వారి స్నైపర్(ఏ.వీ.హెచ్.పీ 610) మిర్చి రకం అధిక దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు. పాటిమీద గుంపు గ్రామానికి చెందిన భూక్య రమేష్ అనే రైతు రెండు ఎకరాల భూములలో స్నైపర్ ఎఫ్ 1 అనే కొత్త రకం వేశారు. ఇది ఎకరానికి 40 క్వింటాల దిగుబడి వస్తుందని అన్నారు. ఈ రైతు ప్రదర్శన క్షేత్రానికి ఏన్కూర్, కామేపల్లి, తల్లాడ, ఇల్లెందు తదితర మండలాల నుండి సుమారు 1,000 మంది రైతులు భారీగా తరలివచ్చారు. ఐరా సీడ్స్ సెల్స్ మేనేజర్ ముత్తినేని నరసింహారావు మాట్లాడుతూ రైతులకు నమ్మకానికి చిరునామాగా ఐరా సీడ్స్ పనిచేస్తుందని అన్నారు. అన్నదాతలకు భోజనం ఏర్పాటు చేశారు. ఉత్తమ రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెల్స్ ఆఫీసర్ శంకర్, పుల్లారావు, రైతులు పాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే నాగరాజు సమీక్ష సమావేశం



**విశ్వంభర, వర్ధన్నపేట:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఇళ్ళపై రేపటి నుంచి ప్రారంభమయ్యే గ్రామ సభలు, బస్తీ సభలు సందర్భంగా పథకాల పై నేడు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ఎమ్మార్వో, ఎంపీడీవో, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, ఎంఈఓ, ఎంఈవో, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారుల నుంచి ఎమ్మెల్యే నాగరాజు అభ్యంతరలు స్వీకరించి, అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు.

## అభివృద్ధి పలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** తెలంగాణ ప్రజలకు అభివృద్ధి పాలాలు అందించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని పెద్ద శంకరంపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను, నూతన అంబులెన్స్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల పరిధిలోని బుజ్రానపల్లి గ్రామంలో సీసీ రోడ్ పనులకు శంకుస్థాపన ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఉత్తులురు మన ఊరు మనబడి పథకంలో మరమ్మతులు చేసిన పాఠశాల భవనంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ కింద 4 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులతో వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రికార్డ్ లను తనిఖీ చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని అన్నారు. ప్రతి ఒకరికి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో 10,00000 రూపాయల వరకు చికిత్సకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ గ్రేసీ బాయ్ ఎంఈఓ వెంకటేశం డిఈ, ఏఈతో పాటు మండల్ అధ్యక్షులు రాయిని మధు సుధన్, మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, ఎంపీటీసీ శుభాష్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు గంగారెడ్డి, మెదక్ మహిళ సంగం అధ్యక్షురాలు భవాని చారి, సంగమేశ్వర్ సెట్, రవీందర్ పటేల్, సుభాష్, సాయిలు, విట్టల్, అనంతరావు, అంజిరెడ్డి, శ్రీశైలం, గోవిందరావు, పటేల్, మాజీ ఎంపీటీసీ సాయి రెడ్డి, రాజు, మండల్ యూత్ అధ్యక్షులు హరి ప్రసాద్ రెడ్డి, మండల్ యూత్ పట్టణ అధ్యక్షులు భాను గౌడ్, శేషిధర్ రెడ్డి, నిరుడు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీని పటిష్టత కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ లోనీ ఆయన నివాసంలో పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్, నారాయణఖేడ్ నియోజకవర్గ బీజేపీ నాయకులు పత్రి రామకృష్ణ, సంజీవరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ తో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బూత్ స్థాయి వరకు భారతీయ జనతా పార్టీని పటిష్ట పరచాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలలో బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధిక స్థానాలను గెలుపొందేలా కృషి చేయాలి అన్నారు. భారతదేశ అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజలందరికీ వివరించాలని పిలుపునిచ్చారు.

## బహుజన కవితా భాస్వరం డాక్టర్ బెల్లి యాదయ్య


తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్



**విశ్వంభర, హైదరాబాద్:** బహుజన కవితా భాస్వరం డాక్టర్ బెల్లి యాదయ్య అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి అన్నారు. కవి రచయిత డాక్టర్ బిల్లి యాదయ్య కు అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం వచ్చిన సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, సాహిత్య ప్రియుల ఆధ్వర్యంలో బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన స్థానిక వివేకానంద హై స్కూల్ లో బెల్లి యాదయ్యకు అభినందన సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైవారు మాట్లాడుతూ బెల్లి యాదయ్య తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు గ్రామీణ ప్రాంతా నేపథ్యాలకు నిలువుటద్దం అన్నారు. రచనా శైలితో విద్యార్థులనే కాకుండా సమాజాన్ని కూడా చైతన్యం చేస్తున్నారన్నారు. కవులకు సామాజిక బాధ్యత ఉండాలని. సమాజంలో జరుగుతున్న అంతరాలపై, అసమానతలపై, వెనకబాటుపై రచనలు చేయాలని దానిని ఆచరించి చూపినవాడు బెల్లి యాదయ్య అన్నారు. అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి పిల్లలమర్రి రాములు, ప్రజా గాయకుడు పీవీ రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు వివేకానంద హై స్కూల్ కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బాసరరాజు యాదగిరి, ప్రజావాగ్గేకారుడు చింతల యాదగిరి, కుక్కడపు రమేష్, గెజిటెడ్ అధ్యాపకుల జిల్లా అధ్యక్షుడు మెరుగు లింగయ్య, నీలా ఐలయ్య, మేడి మధుబాబు కళ్లెం ధనుజ ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, కందుల హనుమంతు, నీలా ఐలయ్య, మునికుంట్ల లెనిన్ మెట్టు శ్రవణ్ కుమార్, పండుగ రాజమల్లు,తుర్కపల్లి నరేష్, కళ్లెం ధర్మ లీల, పొట్ల చెరువు గాయత్రి, మేకల జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డుకు రూ. 1.75 కోట్లు మంజూరు

శంకుస్థాపనలో పాల్గొన్న కుడా ఛైర్మన్ ఇనుగాల



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ కుడా ఛైర్మన్ చొరవతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం, ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామంలో పాత బస్ స్టాండ్ నుండి రెడ్డిపల్లి చర్చి వయా గ్రామ పంచాయతీ వరకు సింగిల్ లేన్ రోడ్డు ను డబుల్ రొడ్డుగా మార్చడానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) 1.43 కిలో మీటర్ల మేర రూ. 1.75 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా సోమవారం స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గార్లతో కలిసి శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్ రెడ్డి ఈఈ భీంరావు ఇతర మండల నాయకులు పాల్గొన్నారు. అనంతరం గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ను కూడా ఛైర్మన్ ప్రారంబించారు. ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్లను అభివృద్ధి చేయడం, సక్రమంగా నిర్వహించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని అన్నారు. ఈరోజు పెద్ద పెండ్యాల గ్రామంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు అయ్యాయని, గ్రామాల్లో 1323.86 కిలో మీటర్ల మేర కొత్త రోడ్ల నిర్మాణ పనుల కోసం రూ.1377.66 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఈ క్రమంలోనే కుడా ద్వారా రోడ్ల అభివృద్దికి రూ. 1.75 కోట్లు మంజూరు చేశామని ఈ సందర్భంగా తెలియచేశారు. ప్రజల అవసరాన్ని బట్టి మరిన్ని రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తోట స్రవంతి, మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు, సంఘం సబ్యులు ఇతరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, కాళేశ్వరం:** 1998-99 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు తమ విద్యా ప్రయాణానికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఇటీవల సిల్వర్ జూబిలీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమం పూర్వవిద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, అందరిలో ఆనందం, స్మృతులు పునరుద్దరించుకుంది. సమావేశానికి హాజరైన పూర్వవిద్యార్థులు తమ విద్యా కాలంలోని మధుర స్మృతులను పంచుకుని, ప్రస్తుతం వారు వ్యక్తిగత మరియు వృత్తి జీవితాల్లో సాధించిన విజయాలను హర్షాతిరేకంగా గుర్తు చేసుకున్నారు. పాఠశాల గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యా ప్రాముఖ్యతను అందరూ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పూర్వగురువులు అంకమ్మ సార్, సంజీవరెడ్డి సార్, రాజిరెడ్డి సార్, లక్ష్మణ్ నాయక్ సార్, శ్రీనివాస్ సార్, సారయ్య సర్, ప్రభాకర్ రెడ్డి సార్, కుమారస్వామి సార్ ముఖ్య అతిథులుగా పాల్గొని, తమ అనుభవాలు పంచుకున్నారు. పూర్వవిద్యార్థుల జీవితాలలో పాఠశాల బాటలో నేర్చుకున్న విలువలు ఇప్పటికీ దారిచూపుతున్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చల్ల. శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, నాగభూషణం, శివకుమార్, ఉస్మానా?న్, శ్రీనివాస్ జి, శ్రీనివాస్ ఎం, పూర్ణచందర్, కొమురయ్య, జగదీష్ , సందీప్, శ్రీనివాస్ చల్ల, ,జ్యోతి,కల్పన, అన్నపూర్ణ, కవిత, శ్వేత, మంజుల, గాయత్రి మరియు 1998-99 ఎస్ఎస్సీ స్నేహితులందరూ పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజీ కాల్వలకు శంకుస్థాపన

ఎమ్మెల్యే మురళీ నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** చోక్లతండ గ్రామ పంచాయతీ పరిధిలో మేగ్యా తండలో సీడీఎఫ్ నిధులతో మంజూరైన సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో సోమవారం నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ కాలువల శంకుస్థాన కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డా.భూక్యా మురళీ నాయక్ , డీసీసీ అధ్యక్షులు జాన్నరెడ్డి భరత్ చందర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ ల నిర్మాణం పనులు చెప్పాడుతామని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. మంజూరు చేసిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి నాణ్యత ప్రమాణాలు అమలు చేస్తున్నామన్నారు. మీ ఊరులో గ్రామసభ ఏర్పాటు చేస్తారు. దయచేసి మీరందరు మీకు ఏ రోజైతే గ్రామ సభ ఏర్పాటు చేస్తారో ఊరు, ఆయా తండాల వారు ఇళ్ల వద్ద ఉండి అధికారులు వచ్చినప్పుడు మీ ఇల్లు చూపించి మీకున్నటువంటి రేషన్ కార్డుల లిస్టులో మీ పేరు ఉందా లేదా అని మీరు చెక్ చేసుకోవాలని తెలిపారు. 'జనవరి 26వ తారీకున కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇవ్వబోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, కాంగ్రెసు సీనియర్ నాయకులు భూక్యా సుందర్ నాయక్,గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోత్ మురళి,ఉపాధ్యక్షులు బోడ సురేష్, లాలావత్ రమేష్,బోడ బాలకిషన్, నరేందర్, హెూలీ, సుందర్, కొండయ్య ,లింగ శ్రీను, శేఖర్, అంజిబాబు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ మాధవి ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఏఈ రాజశేఖర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుంభాభిషేకం, పుష్కరాలకు శృంగేరి పీఠాధిపతులు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర లో ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు కుంభాభిషేకం మరియు మే 15 నుండి 26 వరకు వరకు సరస్వతి నది పుష్కరాలు నిర్వహించబడుచున్నవి. దేవాదాయ శాఖ మంత్రి, ఐ.టి శాఖ మంత్రి, రెవెన్యూ అండ్ ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు దేవాదాయ శాఖ కమీషనర్ ఆదేశాల ప్రకారం శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానించుటకు, వారి ఆశీస్సులు తీసుకొనుటకు దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఆధ్వర్యంలో అధికారులు, అర్చకులు బళ్లారి లోని శృంగేరి మఠం వెళ్లి ఆలయ సాంప్రదాయం ప్రకారం పీఠాధిపతులు శ్రీ విధుశేఖర భారతి తీర్థ స్వామి వారిని దర్శించుకొన్నారు. వారికి కుంభాభిషేకము మరియు సరస్వది నది పుష్కరాల ఆహ్వానం అందజేసి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ప్రత్యేక ఆహ్వానితులు గోవింద హరి, కాళేశ్వరం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎండపల్లి మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, ఉప ప్రధానార్చకులు పనకంటి ఫణీంద్ర శర్మ, వేద పారాయణ దారు సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

## కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న సింగరేణి డాక్టర్లు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి పట్టణంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో టీ.ఎస్.య.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య మాట్లాడుతూ సింగరేణి హాస్పిటల్లో ఈసీజీ కి సంబంధించిన పురాతన యంత్రాలతో కార్మికులను టెస్టు చేస్తూ అయంత్రాలు పనిచేయక ఈసీజీ ప్రాబ్లం ఉన్నదని కార్మికులను సింగరేణి కంపెనీ మరియు డాక్టర్లు కార్పొరేట్ హాస్పిటల్ కి టెస్టుల కోసం పంపిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ హాస్పటల్ లలో డాక్టర్లు టెస్టు చేస్తూ మీకు ఎలాంటి ప్రాబ్లం లేదని తిరిగి పంపిస్తున్నారు. దీని మూలంగా కార్మికులు నాలుగైదు మాస్టర్ల వేతనాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఏదైనా అనారోగ్యంతో ఉంటే వారి ఆరోగ్యం కుదుటపరేవరకు సింగరేణి కంపెనీ వేతనాలు చెల్లించాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.య.ఎస్ నాయకులు దాసరి జనార్ధన్, కాసర్ల ప్రసాద్ రెడ్డి, నామాల శ్రీనివాస్, రాళ్ల బండి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత జాగ్రత్తలు తీసుకోవాలి

**– సబ్ ఇన్స్పెక్టర్ బాధావతు రవి**



**విశ్వంభర, జూలూరుపాడు:** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద జులూరుపాడు సబ్ ఇన్స్పెక్టర్ బాధావతు రవి విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ బాదవతు రవి మాట్లాడుతూ వాహనదారుడు ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలని, రోడ్డు భద్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర, తలకొండపల్లి:** ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్, చుక్కాపూర్ మాజీ మార్కెట్ ఛైర్మన్ నాలపురం శ్రీనివాస్ రెడ్డీ అన్నారు, ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన కళ్యాన్ కార్ రఘు, ఎన్నేడ్ల జంగా రెడ్డీ, యేశాల పెంటయ్య కుటుంబాలకి ఉప్పల వెంకటేష్, నాలపురం శ్రీనివాస్ రెడ్డీ బీఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడు లక్నామోని మాల్లేష్ ద్వార 6 వేల రూపాయాల చొప్పున, 18 వేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట్ రెడ్డి, రైతు అధ్యక్షుడు మల్లా రెడ్డి, మల్లేష్, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** 21వ తేది నుండి నిర్వహించనున్న గ్రామసభలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి గ్రామ పంచాయతీల్లో 21వ తేదీ మంగళవారం జరుగనున్న గ్రామసభల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహణ సమాచారం ప్రజలకు తెలిసేలా టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేయనున్న సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుండి 20 వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వ్యవసాయ యోగ్యమైన, వ్యవసాయం చేయని భూముల సమగ్ర సమాచారం సేకరణ చేసారని తెలిపారు. అట్టి జాబితాను గ్రామసభల్లో లబ్ధిదారుల జాభితా చదివి వినిపినించి తుది జాభితా తయారు చేయనున్నట్లు తెలిపారు. నూతన రేషన్ కార్డులకు గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరించాలని తెలిపారు. రేషన్ కార్డులు జారీ అనేది నిరంతర ప్రక్రియని ఆయన పేర్కొన్నారు. రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం ఈ నెల 26 న శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రైతు భరోసా, నూతన రేషక్ కార్డులు జారీకి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు క్షేత్రస్థాయి విచారణ చేశారన్నారు. అట్టి జాభితాను గ్రామ సభలలో ఫైనల్ చేయనున్నామని తెలిపారు. ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు విస్తృతమెన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామ సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు త్రాగునీరు, నీడ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో మండల, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారు లు పాల్గొనాలని సూచించారు. రేషన్ కార్డులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు రిజిష్టర్ లో నమోదు చేయాలన్నారు. అంతకు ముందు రాఘవవరెడ్డిపేటలో వంగా మల్లయ్య ఇంటి వద్ద జరుగుతున్న విచారణ ప్రక్రియను తనిఖీ చేశారు. నమోదులు పరిశీలించి, వంగా మల్లయ్య ఇచ్చిన సమాచారం వాస్తవమా కాదా మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, వ్యవసాయ అధికారి కళ్యాణ్ పాల్గొన్నారు.

## పేపర్ బాయ్ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వరకు



**విశ్వంభర, హైదరాబాద్:** బర్కత్పురా సామాజిక భవన్లో జరిగిన మీడియా సమావేశంలో వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఉద్దేశించి ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజాంబాద్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. ఈ సందర్భంగా తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ఛైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్ మాదిగ, సామాజిక పరివర్తకులు నేషనల్ పొలిటికల్ పార్టీ ఫ్రంట్ ఛైర్మన్ నారగోని, భారతీయ ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ గొల్లపల్లి దయానంద రావు మాట్లాడారు. నేటి యువతకు మధునం గంగాధర్ జీవితం ఎంతో ఆదర్శవంతమైందని అన్నారు. మదనం గంగాధర్ జీవితం చూస్తే చదువుకే దూరమైనటువంటి సంచార జాతి నుండి ఉన్నత చదువులు చదివి ఉస్మానియా యూనివర్సిటీలో పట్టభద్రుడై పోలీసు ఉద్యోగిగా డీఎస్పీ స్థాయిలో ఉండి నేటి పట్టభద్రుల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేశారు. తను ఒక అట్టడుగు స్థాయి కులంలో పుట్టి ఒక పేపర్ బాయ్ గా తన జీవితాన్ని మొదలు పెట్టినటువంటి గంగాధర్ నేడు ఎమ్మెల్సీ స్థాయిలో పోటీకి రావడానికి తాను పడిన కృషిని తెలిపారు. ఎంతో ధైర్యసహసాలతో ఎన్నికల్లో పాల్గొనడానికి సంసిద్ధుడైన తన జీవితాన్ని సమాజానికి పరిచయం చేయాల్సిన బాధ్యత మన సమాజంపై ఉందని అన్నారు. ఇలాంటి వ్యక్తిని ఏకగ్రీవంగా ఎంపిక చేయాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలకి ఉందని అన్నారు. గంగాధర్ పై పోటీ నిలపవద్దని ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ముక్తకంఠంతో తెలియజేశారు. గంగాధర్ గెలుపు కోరకు ప్రతి ఒక్కరం పల్లె పల్లె తిరిగి గెలిపించుకుంటామని ముక్తకంఠంతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పుట్ట జంగన్న గౌడ్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కేబి శ్రీధర్, ఆర్పిఐ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరావు, 57 ఉపకులాల జాతీయ అధ్యక్షులు కళ్యాణ్ ప్రేమ్ రాజు, ఉత్తర తెలంగాణ అధ్యక్షులు కొండ్రు రాజు మాదిగ, బీసీ సంఘాల జేఏసీ ఉత్తర తెలంగాణ అధ్యక్షులు ఐలయ్య యాదవ్, తమిళనాడు ఇన్చార్జ్ రాజ్ పటేల్, బాల్రాజ్, బాలస్వామి, జనార్ధన్ బాబు, పాల్గొన్నారు.

# డీసీసీబీ మహాజన సభ విజయవంతం

**టీజీ క్యాబ్ ఛైర్మన్ రవీందర్ రావు**



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా సహకార ఆంధ్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ రవీంద్రరావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు పరిపాలన నివేదిక, ఆర్థిక సంవత్సరము 2024-25 నకు జారీ చేయబడిన ఆడిట్ సర్టిఫికెట్, బ్యాంకు యొక్క జమ, ఖర్చు, లాభనష్టాలు ఆస్తులు, అప్పుల మహాజన సభ ముందు ప్రవేశపెట్టడం జరిగిందనీ ఈ బ్యాంకు తన 32 శాఖల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘముల, చేనేత సహకార సంఘల, ఇతర సహకార సంఘాలలోని సభ్యులకు బ్యాంకు ఖాతాదారులకు ఉచితమైన బ్యాంకులు సేవలు అందిస్తున్నామని, కేవలం వ్యవసాయ రుణములే కాక ఇతర వాణిజ్య బ్యాంకులకు దీటుగా అన్ని రకంగా రుణ సేవలు అందిస్తున్నామనీ, డిపాజిట్ల మీద ఇతర బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్నామని తెలియజేశారు. అందరి సహకారంతో ఈ బ్యాంక్ టర్నోవర్ 893 కోట్ల నుండి 2000 కోట్ల టర్నోవర్ మైలురాయి దాటిందని తెలుపుటకు సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా మాకు సహాయ సహకారాలు అందజేసిన ప్రతి ఒక్కరికీ మన బ్యాంక్ తరపున కృతజ్ఞతలు అభినందనలు తెలుపుతున్నాను అన్నారు. ఈ సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, బ్యాంక్ వైస్ ఛైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు సంపెల్లి నర్సింగరావు, కంది శ్రీనివాస్ రెడ్డి, కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కక్కిరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి దొంగల రమేష్, నాయిని రంజిత్, మాడుగుల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, పోలిపాక శ్రీనివాస్ కే నరేందర్, ఎలుగం రవి రాజా, సంజీవరెడ్డి, డీజీఎం అశోక్, నాబార్డ్ డీడీ ఏం చంద్ర శేఖర్, మార్క్ ఫెడ్ ఛైర్మన్ రంగా రావు, డీసీఓలు కోదండరాం, వెంకటేశ్వర రావు, రాజేందర్ పాల్గొన్నారు.

## నేత్రదానంతో మరోమారు జీవించండి

**మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర**




**విశ్వంభర, ఆమనగల్లు:** రంగారెడ్డి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ కళావతి ఆదేశానుసారంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి, లయన్ ఐ ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరోమారు జీవించాలని నేత్రదానం మహాదానమని నేత్రదానం చేసి మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించిన వారు అవుతారని ఆయన పిలుపునిచ్చారు. కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలో, గ్రామాల్లో గాని ఆశా వర్కర్ల ద్వారా మండల పరిసర గ్రామ ప్రాంతాలలో నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను అవగాహన కల్పించి నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చే విధంగా చైతన్య కలుస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిభిరంలో కంటి వైద్యులు ఏం చంద్రశేఖర్ 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందిని ఐ ఓ ఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రికి తరలించినట్లు పీఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, క్లబ్ పీ ఆర్ ఓ ఎం ఏ పాష, క్లబ్ సభ్యులు కొర్వి వెంకటయ్య, హెల్త్ సూపర్వైజర్ తిరుపతిరెడ్డి, డిఈఓ విష్ణు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**– జర్నలిస్టు దర్శన్ గౌడ్**



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ గ్రేడ్-1 శాఖ గ్రంథాలయం ఆవరణలో సోమవారం సీనియర్ జర్నలిస్ట్ అల్వాల దర్శన్ గౌడ్ గ్రంథాలయ కమిటీ లో ఆర్గనైజర్ మరియు మీడియా సెక్రెటరీ బాధ్యతలు అప్పగించి ప్రమాణస్వీకారం నిర్వహించారు. దర్శన్ గౌడ్ మాట్లాడుతూ, షాద్ నగర్ గ్రంథాలయంలో నేటి వరకు గ్రంథాలయ కమిటీల లో ఏనాడు జర్నలిస్టులను గుర్తించలేదు. నేడు గుర్తించి జర్నలిస్టు అయిన నన్ను ఆర్గనైజర్, మరియు, మీడియా సెక్రెటరీ బాధ్యతలు అప్పగించినందుకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డికి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్ కు కొంకళ్ళ చెన్నయ్యకు అభినందనలు తెలిపారు. సమాజంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులను గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమానికి వచ్చిన నాతోటి జర్నలిస్టులకు పేరుపేరునా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## రేషన్ కార్డు ఇందిరమ్మ ఇల్లు అధికార పార్టీకే నా?: సీపీఐ



**విశ్వంభర, జూలూరుపాడు:** అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేద కుటుంబాలకు ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు ఇందిరమ్మ కమిటీ వేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే పథకాలు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తే మూల్యం చెల్లించక తప్పదని ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ప్రతి పేదవాడికి వర్తింపచేయాలని, లేనియెడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండి పిన్ని వెంకటేశ్వర్లు, చాంద్ పాషా, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజన కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలి

**ఏఐటీయూసీ డిమాండ్**



**విశ్వంభర, జూలూరుపాడు:** మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లుల తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా మాట్లాడుతూ కోడిగుడ్లను ప్రభుత్వం ఐదు రూపాయలు చెల్లిస్తుంటే మధ్యాహ్నం భోజన కార్మికులు ఎనిమిది రూపాయలకు కొనుగోలు చేసి వంట ఏజెన్సీ నిర్వహిస్తున్నారని నెలసరి, వేతనాలు అందక బిల్లులు సకాలంలో రాక అప్పులతో ఏజెన్సీలు నిర్వహిస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలు 25 రూపాయలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు కనీస వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని కోరారు. గత పాలకులు లాగా కాకుండా మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ లక్ష్మి, గడల మంగమ్మ, సత్యవతి, రజిని, పద్మ, సుశీల, రాణి, సుభద్ర, నిర్మల, లలిత, తదితరులు పాల్గొన్నారు.

## గాదె రేణు రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె రేణు రెడ్డి జన్మదిన సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి చౌరస్తాలో కేక్ కట్ చేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివ కుమార్ గౌడ్,మిన్నాల డేవిడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ హరికిషన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేసిన యువకులను అభినందించిన సీఐ



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ కు చెందిన మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం చేవేళ్ల ఆసుపత్రి లో అవసరం కాగా, కుటుంబ సభ్యులు యువ సత్తా లక్ష్మణ్ కుమార్ ను సంప్రదించారు. దీంతో స్పందించిన ఆయన ఈట అనిల్, సంపత్ కుమార్ లను పట్నం మహేందర్ రెడ్డి చేవేళ్ల ఆసుపత్రి లో రక్త దానం చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న సీ ఐ ప్రసాద్ ఈట అనిల్, సంపత్ కుమార్లను అభినందించి శాలువాలతో సత్కారించి, ప్రశంషా పత్రాలను అంద జేయడం జరిగింది.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, షాద్ నగర్:** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అందజేశారు. ఫరూక్ నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన ఎన్.సుధాకర్ గౌడ్, నందిగామకు చెందిన డి.సుజాత, కేశంపేట మండలం దేవునిగుడి తండా రాగ్యతండా కి చెందిన అంగోత్ వినోద్, కొత్తూరుకు చెందిన మైలారం సిందూజ, జంగగల్ల క్రిష్ణయ్యలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మధురపూర్ మాజీ సర్పంచ్ బొమ్మ రంగయ్య గౌడ్, పోమాల్ పల్లి మాజీ సర్పంచ్, భూపాల్ రెడ్డి, రావిర్యాల మాజీ సర్పంచ్ నర్సిములు, కొత్తూరు కౌన్సిలర్ గోపాల్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జహంగీర్ , సుమదీర్,జె.ఆర్.దినేష్ సాగర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం నియామకం



**విశ్వంభర, కేపీహెచ్బీ:** తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు గారి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం నియామకం. ఐ టీ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా కృష్ణ చైతన్య ను నియమించడం జరిగింది. ఈ నియకమకం ఐ టీ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్త గంధం రాములు (రాష్ట్ర అధ్యక్షులు)విజయ్ కోటేశ్వర గుప్త వెంకటేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ పాల్స్ 1975 బ్యాచ్‌కు 50 ఏళ్లు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదర్-గూడ, సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల జనవరి 26న షెడ్యూల్ చేయబడిన 1975 బ్యాచ్ యొక్క స్వర్ణోత్సవ వేడుకలను ప్రకటించింది. పాఠశాలలో జరిగే కార్యక్రమం పాఠశాల వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశంతో సమానంగా ఉంటుంది. 1975 బ్యాచ్ వారి గ్రాడ్యుయేషన్ 50 సంవత్సరాలను జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమం తరతరాలుగా పౌలైట్లను ఒకచోట చేర్చి, సంబరాలు చేసుకుంటూ స్నేహభావాన్ని పెంపొందిస్తుంది. వేడుకలు అధికారిక, నెట్‌వర్కింగ్ అవకాశాలు మరియు భాగస్వామ్య జ్ఞాపకాల హృదయాన్ని కదిలించే క్షణాల మిశ్రమాన్ని కలిగి ఉంటాయి. ఈ సందర్భంగా పాఠశాల మాజీ విద్యార్థులందరినీ ఆహ్వానించారు. 70 సంవత్సరాల క్రితం స్థాపించబడిన ఈ పాఠశాల నాణ్యమైన విద్యకు మూలస్తంభంగా ఉంది. సెయింట్ మోంట్-ఫోర్ట్ యొక్క అనుచరులైన సెయింట్ గాబ్రియేల్ సోదరులచే ఈ పాఠశాల నిర్వహించబడుతుంది. దశాబ్దాలుగా, ఇది అసంఖ్యాక విద్యార్థులను సమాజానికి దోహదపడే నిష్ణాతులైన వ్యక్తులుగా తీర్చిదిద్దింది.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వీరారెడ్డి, చౌటుప్పల్ డివిజన్ ఆర్డీఓ వి.శేఖర్ రెడ్డి లు సందర్శించారు. ఈ సందర్భంలో మంగళవారం నుంచి జరగబోవు గ్రామ సభలకు సంబంధించిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించిన విషయాలపై రివ్యూ చేశారు. గ్రామాలలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విషయాలను ప్రజలకు తెలియపర్చాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో స్థానిక రావన్నపేట తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీఓ బి.యాకూబ్ నాయక్, ఏపీ ఆర్.గాలయ్య, వ్యవసాయ శాఖ అధికారి అజీమ్ ఖాన్, ఏఈ గ్రామీణ నీటిపారుదల శాఖ ఇంజనీరు రాఘవ, ఎంపీఓ రావూఫ్ అలి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శోభారాణి, రాజేశ్వర్, సర్వేయర్ సోనీ, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న ప్రత్యేక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల నిమిత్తం నిర్వహించే ప్రత్యేక గ్రామ సభలు జనవరి 21వ తేదీ నుండి 24 వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఉదయం తొమ్మిది గంటల నుండి నిర్వహించబడునని రామన్నపేట ఎంపీడిఓ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక గ్రామ సభలు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆద్వర్యంలో రామన్నపేట మండలంలో 21వ తేదీన ఇస్కిళ్ళ, పల్లివాడ, బోగారం, నీర్నెముల, లక్ష్మాపురం, బాచుపల్లి గ్రామాల్లో, 22వ తేదీన జనంపల్లి, నిదానపల్లి, ఉత్తటూర్, కొమ్మాయిగూడెం, కొత్తగూడెం, శోబనాద్రిపురం గ్రామాల్లో, 23వ తేదీన కక్కిరేణి, మునిపంపుల, సర్నేనిగూడెం, బి.తుర్కపల్లి, సిరిపురం, సూరారం గ్రామాల్లో, 24వ తేదీన తుమ్మలగూడెం, రామన్నపేట, ఎన్నారం, కుంకుడుపాముల, దుబ్బాక, వెల్లంకి గ్రామాల్లో జరుగుతాయని, కావున అందరూ గ్రామస్థాయి అధికారులు, గ్రామ ప్రజలు తప్పకుండా గ్రామ సభలకు హాజరు కావలసిందిగా ఎంపీడీఓ కోరారు.

## ప్రజాస్వామ్యానికి మూల స్తంభం మీడియా

**– గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రాధాన్యం గల వ్యవస్థ మీడియా రంగం అని, ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా అని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందించడం గొప్ప విషయం అన్నారు. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మీడియా రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని రిపోర్టర్లు పనిచేయడం ప్రశంసనీయమన్నారు. కాలంతో పోటీపడి క్షణం క్షణం.. నిమిషం నిమిషం సమాజాన్ని జాగ్రత్త పరుస్తున్న మీడియా రంగానికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. సోమవారం రాజ్ భవన్ లో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ 2025 డైరీ ని గవర్నర్ ఆవిష్కరించారు. అనంతరం జర్నలిస్టు స్టేట్ కమిటీతో ప్రత్యేకంగా మాట్లాడారు. అత్యాధునిక టెక్నాలజీని అందుకొని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను దాటేసి డిజిటల్ రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులను అభినందించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజ సేవలో నిరంతరం పనిచేస్తున్న విలేకరులు ఆదర్శప్రాయులని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూలూరి రమేష్, నాయకులు చిలుకూరి అఖిలేష్, అశోక్, అనిల్, మోహన్, తిరుమలేష్, రాఘవేంద్ర గౌడ్, గిరిధర చారి, కిషోర్, సత్యం, దుర్గాప్రసాద్, రామ్మోహన్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తిచేయాలి



**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**విశ్వంభర, మరిపెడ:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపాలిటీ కేంద్రంలోని పలు వార్డులు, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలోని అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ మరిపెడ మునిసిపల్ కేంద్రంలో పర్యటించి మునిసిపల్ కేంద్రంలో వివిధ వార్డులలో చేపట్టే వివిధ సివిల్ పనులకు సంబంధించి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చూడాలని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలోని కిచెన్, డైనింగ్ హాలును పరిశీలించి పనులను త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులతో అన్నారు.

## మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**హాజరైన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి సోమవారం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి మున్సిపల్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని, ఇప్పటికే నీటి వసతులకు, సీసీ రోడ్లకు 15 కోట్లు, నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ అభివృద్ధి కోసం మున్సిపల్ పరిధిని పెంచడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, పరిగి పట్టణాన్ని ప్రణాళిక బద్ధంగా అన్ని రంగాలలో అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తుంకలగ్డ లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే నిధుల ద్వారా పనులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మున్సిపల్ ఛైర్మన్ అశోక్, వైస్ ఛైర్మన్ ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు తాహిర్ అలీ, వెంకటేష్, రవి, కృష్ణ, శ్రీనివాస్, నాగేశ్వర్, కిరణ్, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ శాసనమండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా, ఉమ్మెల్యే కేపీ వివేకానంద కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి లతో కలిసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా భవ్యాస్ ఆనందం అపార్ట్మెంట్స్ నుండి హిల్ కౌంటీ వరకు మూడు బిట్ల రోడ్ డివైడర్స్, హిల్ కౌంటీ నుండి రాజీవ్ గాంధీ నగర్ వరకు రెండు డివైడర్స్, 15,16, 20 డివిజన్ల పరిధిలో జయదీపిక నుండి పూజిత ఎంక్లేవ్ వరకు కుడి,ఎడమ వైపు సీసీ రోడ్డు,పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వద్ద బీటీ రోడ్, అండర్ మున్సిపల్ ఫండ్స్ ప్రగతి నగర్ మెయిన్ రోడ్ 2,3,4,5,6, 22, 23, 24, 25 డివిజన్ల సంబంధిత బీటీ రోడ్, 2వ డివిజన్ పరిధిలో ప్రగతి నగర్ కమాన్ నుండి లోహిత అపార్ట్మెంట్ వయా శ్రీ కృష్ణ కాలనీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు నిజాంపేట్ మేయర్ నీలగోపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బొంగునూరు శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్లు, కమిషనర్ సాబీర్ అలీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఎం.సి అధ్యక్షులు, కోలన్, రాజశేఖర్ రెడ్డి, ఎన్.ఎం.సి. కోఆప్షన్ సభ్యులు, నాయకులు మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుకాణాల సమస్యను పట్టించుకోని ఎమ్మెల్యే, కార్పొరేటర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ హౌసింగ్ దుకాణాల కేటాయింపు పై తగు నిర్ణయం తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్ అన్నాడు. హైదరబాద్ బాగ్ లింగంపల్లిలో తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కు సంబంధించిన 51 దుకాణాల విషయమై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ హౌసింగ్ బోర్డుకి సంబంధించిన దుకాణాలు పదిహేనేళ్ల క్రితం మూతపడ్డాయి. ఆ దుకాణాలను ఎవరికి కేటాయించకుండా పెండింగ్లో పెట్టడంతో భవనాలు నిర్వహణ లేక పూర్తిగా శిథిలమైపోతున్నాయి. కొన్ని అక్రమణలకు గురవుతున్నాయి. ప్రజాధనం వృధా అయిపోతున్నది. హౌసింగ్ బోర్డ్ దుకాణాలతో జనంతో కళకళలాడే బాగ్ లింగంపల్లి ప్రధాన రహదారి శిధిల భవనాలతో ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్నాయన్నాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎటు తేల్చకుండా నాన్చుతూ వచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ సమస్యపై ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. ఈ దుకాణాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలని అన్నాడు. అంతేకాకుండా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముటాగోపాల్ రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవి చార్యులు కూడా ఈ విషయంపై పట్టించుకోవడంలేదని ఆరోపణ చేశాడు. ఈ సమావేశంలో వెంకటేష్, దశరథ, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## సంతు సేవాలాల్ మందిరం, బంజారా భవన్‌కు భూమి కేటాయించాలి

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి వినతి**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మందిర్, బంజారా భవన్ కు 2 ఎకరాల భూమి కేటాయించలని బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కరెంటోతూ బిక్షపతి నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు కరెంటోతూ శ్రీరామ్ నాయక్ లు సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో సేవాలాల్ జయంతి సందర్భంగా మందిరం, బంజారా భవన్ కు భూమి కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కు గుర్తు చేశారు.మండలం లో 28 తండాలు, 15,000 వేల లంబాడా జనాభా ఉందని సేవాలాల్ గుడి కి, బంజారా భవన్ కు భూమి కేటాయింపు చేయాలనీ ఎమ్మెల్యే ను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి భూమి కేటాయింపునకు చర్యలు తీసుకోవలని కోరుతూ లెటర్ రాశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలువురు బంజారా నాయకులు ఉన్నారు.

## శారీరక శ్రమ చేయడంతో ఎంతో ఆరోగ్యం

**ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్**



**విశ్వంభర, మహబూబాబాద్:** శారీరక శ్రమ చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ అన్నారు. సోమవారం నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో 18 మరియు 20వ తేదీలలో మహబూబాబాద్ పట్టణంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబాద్ క్రీడ ప్రాంగణంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ గెలుపొందిన యువతకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బి మురళీ నాయక్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన దైనందిక జీవితంలో ఆటలాడడం అలవర్చుకోవాలని అప్పుడు మాత్రమే శారీరకంగా దృఢంగా వ్యక్తులు తయారవుతారని శారీరక శ్రమ చేయకుంటే ఆరోగ్యం అనేక అనారోగ్యాలకు దారి తీయడానికి అవకాశం ఉంటుందని కావున ప్రతి దైనందిన జీవితంలో కొన్ని గంటలు ఆటలకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర, చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు అచ్చ సుజిత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమెరికాలో కాల్పులు..

**హైదరాబాద్ యువకుడు మృతి**



**విశ్వంభర, హైదరాబాద్:** అమెరికా వాషింగ్టన్ ఏవ్‌లో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ అనే యువకుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు అతడి మరణవార్త విని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## విద్యార్థులు క్యాష్ మేనేజ్‌మెంట్ విధానం అలవర్చుకోవాలి

**సహాయ మేనేజర్ వెంకటేశం**



**విశ్వంభర, సికింద్రాబాద్:** విద్యార్థులకు చిన్నప్పటి నుండే క్యాష్ మేనేజ్మెంట్ విధానాన్ని అలవర్చుకోవాలని సహాయ మేనేజర్ పి. వెంకటేశం అన్నారు. సోమవారం బోయిన్పల్లి లోని ది ఆదర్శ్ కో.ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ బోయినపల్లి శాఖ ఆధ్వర్యంలో సెయింట్ పిటర్స్ హై స్కూల్ విద్యార్థులకు కిడ్డి బ్యాంకు ద్వారా దాని యొక్క ప్రాముఖ్యత గురించి సహాయ మేనేజర్ పి. వెంకటేశం తెలియజేశారు. అయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి నుంచే క్యాష్ మేనేజమెంట్ విధానం అలవర్చుకోవాలని అందులో భాగంగానే విద్యార్థులకు వారి బంధువులు, మిత్రులు పండుగకు, ఫంక్షన్స్ ఇచ్చే డబ్బును వృధాగా ఖర్చు చేయకుండ బ్యాంకు లో దాచుకోవలని అది పెద్ద మొత్తంలో ఏర్పడి భవిష్యత్తులో ఉపయోగపడుతుంది దాని వలన భవిష్యత్ లో జీవితం బంగారు బాట అవుతుంది తెలియపర్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ బి.యన్. రెడ్డి కిడ్డి సేవింగ్ బ్యాంకు విధి, విధానములు దాని యొక్క ప్రాముఖ్యతను చాల వివరంగా విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమములో బ్యాంకు మేనేజర్ కె. బ్రహ్మానందము, స్కూల్ టీచర్స్, ఆఫీస్ సిబ్బంది, విద్యారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 24 వరకు గ్రామ సభలు

**– ఎంపీడీఓ బాలరాజు**



**విశ్వంభర, నెల్లికుదురు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి నుంచి శుక్రవారం (21- 24)వరకు మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలరాజు తెలిపారు. 21న, నెల్లికుదురు, కాచికల్, ఆలేరు, హేమ్లతండ, మునిగలవీడు, మేచరాజుపల్లి, చిన్న ముప్పారం, లక్ష్మీపురం. 22న, నైనాల, రత్తి రామ్ తండ, రావిరాల, బ్రాహ్మణ కొత్తపల్లి, వావిలాల, మదనతుర్తి, పార్వతమ్మ గూడెం, పెద్దతండ ఎంఆర్ పి, పెద్దతండ సీఎం, మీట్య తండ. 23న, హనుమాన్ (తారా సింగ్ బావి) తండ, నల్లగుట్ట తండ, రామన్నగూడెం, బోటిమీద తండ, రాజ్య తండ, దుర్గ భవాని తండ, వస్రాంతండ, బంజర, జామ తండ, చిన్ననాగారం. 24న, నర్సింహుల గూడెం, కాస్య తండ, శ్రీరామగిరి, రాజుల కొత్తపల్లి, సీతారామపురం, ఎర్రబెల్లి గూడెం, సొల్ల తండ, బడి తండ లలో సభలు జరుగుతాయన్నారు.

## జిల్లా మహాసభకు సన్నాహాలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా మహాసభను విజయవంతం చేసేందుకు పాత్రికేయులు పెద్ద ఎత్తున తరలిరావాలని టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నిర్వహించాల్సిన రంగారెడ్డి జిల్లా మహాసభ ఏర్పాట్లు, ఇతర విషయాలపై చర్చించడానికి సోమవారం ఎల్.బి.నగర్ చిత్ర లేఅవుట్ లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో యూనియన్ పటిష్టంగా ఉందన్నారు. పాత్రికేయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామన్నారు. సమస్యలను పరిష్కరించుకోవడంలో భాగంగా నిర్వహిస్తున్న రంగారెడ్డి జిల్లా మహాసభను విజయవంతం చేయడానికి పాత్రికేయ మిత్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, మఫసిల్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కన్వీనర్గా నియామకమైన పేపర్ శ్రీనివాసులను యూనియన్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు సలీంపాషా, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్, కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, సభ్యులు శ్యామ్ కుమార్, అవంచ సురేందర్, జంగయ్య, రచ్చ శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య నుండి ఇస్కిళ్ళ వాసిని రక్షించిన పోలీసులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ళ గ్రామానికి చెందిన రాపర్తి నరసింహ కుమారుడు రాపర్తి మహేష్ రామన్నపేట నుండి చిట్యాల వెళ్ళే రైలు పట్టాల దగ్గర ఆత్మహత్య చేసుకుంటున్నాడని 100 నంబర్ కు ఫోన్ కాల్ వచ్చిన వెంటనే రామన్నపేట పోలీస్ పెట్రోలింగ్ వాహనం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ 1827, డ్రైవర్ హోం గార్డ్ 1102 శేఖర్ లు సంఘటనా స్థలానికి చేరుకుని, అతని ప్రాణాలు కాపాడి, ఇస్కిల్ల గ్రామంలోని తల్లిదండ్రులకు అప్పజెప్పి, అతనికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని రామన్నపేట ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే ఎస్.ఎస్.సి విద్యార్థులకు సాయంత్రం సమయంలో జరుగుతున్న ఎస్.ఎస్.సి విద్యార్థుల స్పెషల్ క్లాసులకు సహృదయంతో మునిపంపుల గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేశం విద్యార్థులకు వారం రోజులకు సరిపడా స్నాక్స్ అందజేయడం జరిగింది. అందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఏ ఏపీసీ ఛైర్మన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ శివారు అనంతారం గ్రామం ఐదో వార్డులో 9.99 లక్షల వ్యయంతో ఐదో వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సీడీఎఫ్ కింద సీసీ రోడ్లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జన్నారెడ్డి మురళీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మురళి నాయక్ మరియు వార్డ్ కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీనివాస్ యాదవ్ లు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విలీన గ్రామమైనటువంటి అనంతారం గ్రామానికి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదనీ ఇప్పుడు మన ప్రభుత్వంలో అభివృద్ధి బాటలో ముందుకు నడుచుకు వెళ్దామని, ఇది మాజీ ఎమ్మెల్యే జన్నారెడ్డి జనార్దన్ రెడ్డి గ్రామమని, దీనికి ఒక ప్రత్యేకత ఉందని, నాలుగేళ్లలో ఈ గ్రామాన్ని ఒక ప్రత్యేకతగా ఏర్పాటు చేద్దామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దాడికి చేసిన వారిని శిక్షించాలి: టీపీటీఎఫ్



**విశ్వంభర, నెల్లికుదురు:** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ హై స్కూల్ హెచ్ఎం కంబలి రాములు పై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండలంలోని నరసింహుల గూడెం యూపీఎస్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. డిసెంబర్ 21న, అయ్యప్ప మాల ధారణ స్టూడెంట్ ను సంబంధిత హెచ్ఎం కాలుతో తన్నాడనే నెపం తో సంబంధిత విద్యార్థితో పాటు ఇతర స్వాముల కాళ్లు మొక్కించడం అమానవీయ చర్య అన్నారు. బాధ్యులపై కఠిన చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు పద్మావతి, శ్రీనివాస్, సుకన్య , హరనాథ్, సయ్యద్,మమత, వీరేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం దేవునిపల్లి గ్రామం శ్రీ వేణుగోపాల స్వామీ కళ్యానోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. స్వామీ వారి కళ్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వేణుగోపాల స్వామీ ఆశీస్సులు షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని అన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి గారిని షాలువాతో, మెమెంటో తో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చేగు సుధాకర్, మిద్దె గణేష్, బాను గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సురేష్ గౌడ్, రవి గౌడ్, శ్రావణ్ గౌడ్, బాస్కర్ గౌడ్, కొట్టె మహేష్, కొట్టె నితిన్,ఎం.నవీన్, మణికంఠ రెడ్డి, శివ, పవన్ ఉన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత



**విశ్వంభర, కాళేశ్వరం:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన సల్ల వసుమతి అనే బాధితురాలు తన యొక్క సాంసంగ్ ఫోనును కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకోవడం జరిగింది. వెంటనే బాధితురాలు కాళేశ్వరం పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయగా పోలీస్ సిబ్బంది ఫిర్యాదును తీసుకొని సీ ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఈఐ నెంబర్‌ను బ్లాక్ చేసి, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఫోను ఉన్నట్లు గుర్తించి ఫోను రికవరీ చేసి ఎస్ఐ తమాషా రెడ్డి బాధితురాలికి ఫోన్ ను అందజేశారు. కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా 20-25 ఫోన్లను రికవరీ చేసి పోలీస్ సిబ్బంది భాదితులకు అప్పగించారు. దీంతో గ్రామ ప్రజలు, స్థానికులు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

# ఉద్యాన పంటలపై అధికారులు ఫోకస్ చేయాలి

**రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** ఉద్యాన వన పంటలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం హైదరాబాద్ రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కమిషన్ ఫెస్టిసైడ్ వాడకం తగ్గించేలా చూడాలని అధికారులకు చెప్పిన కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి వచ్చేలా కూరగాయల సాగు అవుతున్నాయని, దాని ద్వారా రైతులు, వినియోగదారులు అనారోగ్యానికి గురవుతున్నారని, సేంద్రియ సాగు ను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి. వంకాయ, బెండకాయ సాగులో విపరీతంగా ఫెస్టిసైడ్ వాడుతున్నట్లు అధికారులు కమిషన్ దృష్టికి తెచ్చారు క్లస్టర్ సాగులను ప్రోత్సహించాలన్నారు కమిషన్ ఛైర్మన్. ప్రభుత్వ సబ్సీడీలను క్లస్టర్ విధానంలో సాగుచేసే రైతులకు మరింత చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన పంటలు సాగుచేసే రైతులతో సమావేశాలు, అవేర్నెస్ ప్రోగ్రామ్స్ పెట్టాలన్నా.రు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి దిశానిర్దేశం చేశారు. త్వరలో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలో కూరగాయలు సాగయ్యే తోటలను సందర్శించి రైతులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని పెట్టాలని కమిషన్ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా పురుగు మందులను విచ్చలవిడిగా వాడకాన్ని కట్టడి చేయడానికి మండల వ్యవసాయ అధికారి దృష్టి సారించాలన్నారు. దానిపై రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి తోపాటు హార్టికల్చర్ డైరెక్టర్ ఐఏఎస్ షేక్ యాస్మిన్ బాషా, ఉద్యానవన శాఖ అధికారి బాబు, రైతు కమిషన్ ఏడీఏ అధికారి సంధ్యారాణి, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, సుస్థిర వ్యవసాయ ప్రతినిధి భాస్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**విశ్వంభర, మల్కాజిగిరి:** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని సంప్రదించారు. ఈ మేరకు ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి సంబంధిత చెక్కులను శుక్రవారం లబ్దిదారులకు అందజేశారు. మల్కాజ్‌గిరి గౌతమ్ నగర్ కి చెందిన నీల రవీందర్‌కి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రాము, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# అర్హులందరికీ రేషన్ కార్డు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

**సీపీఐ మండల శాఖ**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులను ఇవ్వాలని సీపీఐ నారాయణపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలనలో మండల వ్యాప్తంగా ఎంతో మంది రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి సర్వే సిబ్బంది కొంతమంది పేర్లను మాత్రమే జాబితాలో ఉన్నాయని చెప్పడంతో మిగిలినవారు తమకు రేషన్ కార్డు రాదేమోనని ఆందోళన చెందుతున్నారని ఏ ప్రతిపాదికన ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రేపటి నుండి జరిగే గ్రామ సభల ద్వారా అర్హుల జాబితాను ఎంపిక చేసి రేషన్ కార్డులను ఇందిరమైన మంజూరు చేయాలని కోరారు. రైతు భరోసాని కూడా అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, మండల సహాయ కార్యదర్శి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, పల్లే మల్లారెడ్డి, గడ్డం యాదగిరి, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాట్ ఓనర్స్‌కు న్యాయం జరిగేంత వరకు పోరాడుతాం



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్ పరిధిలోని కొర్రెముల గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 739 నుండి 749 లలో ఇళ్ల స్థలాలుగా 1985 సంవత్సరంలో ఏకశిలా నగర్ లో ప్లాట్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, కానీ 2006లో బిల్డర్ తప్పుడు పత్రాలు సృష్టించి, 40 సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలు కొన్న యజమానుల ను స్థలాలలో ఇళ్ళు కట్టుకోనివ్వకుండా అడ్డుపడుతూ, కట్టుకున్న వారి ఇళ్లను రాత్రికిరాత్రే బిల్డర్ కూల్చివేయడం తో, ఏకశిలా నగర్ లో ఇళ్ల స్థలాలు కొన్న యజమానులు అధికారులను ఆశ్రయించినా ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డిని ఆశ్రయించగా ఆయన స్పందించి, ఏకశిలా నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారికి అండగా నిలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, కార్యవర్గ సభ్యులు శివా రెడ్డి, మాటూరి రవి, శ్రీనివాస చారి, సుభాష్ చంద్రబోస్, ముత్తా రెడ్డి, వెంకటేష్ నాయక్, రమణా రెడ్డి, సోమ్లా నాయక్, బాల్ రాజ్ గౌడ్, ధర్మేందర్, గోవర్ధన్ రావు, మరియు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కొమరవెల్లి లో శివసత్తుల ను తమ కెమెరాలలో బంధించడం కోసం ఫోటోల కోసం పోటీ పడుతున్న ఫోటోగ్రాఫర్లు. ఇందులో ఆంధ్ర తెలంగాణ నుంచి వచ్చిన ఫోటోగ్రాఫర్లే కాకుండా ఫోటోగ్రఫీ కోర్సులో శిక్షణ పొందుతున్న వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు సైతం ఉన్నారు. వివిధ పత్రికల ఫోటోగ్రాఫర్లు. సోమవారం జరిగిన కొమరవెల్లి మల్లన్న పట్నం వేడుక కు వచ్చి కవరేజ్ చేశారు.
– విశ్వంభర, కొమరవెల్లి



సిద్దిపేట జిల్లా కొమరవెల్లి గ్రామంలోని కొమరవెల్లి కోర మీసాల మల్లన్న ఆలయంలో ఘనంగా పట్నం వారం అగ్నిగుండాలు. భారీగా తరలివచ్చిన భక్తులు. తెలుగు జిల్లాల నుండి తరలివచ్చిన అశేష భక్తజనంతో మల్లన్న నామ స్వరంతో భక్తులు. శివసత్తుల శిగాలు,అగ్ని గుండాలు తొక్కుతున్న శివసత్తులు, భక్తులు. – విశ్వంభర, సిద్దిపేట

## రాష్ట్ర పోలీస్ క్రీడలకు 5వ జోనల్ పోలీసు క్రీడాకారుల ఎంపిక

**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఎంపిక క్రీడలకు అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి లు పర్యవేక్షణ చేశారు. 5వ జోనల్ పోలీస్ సూర్యాపేట, నల్గొండ జిల్లాల పోలీసు సిబ్బందికి క్రీడలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 కు పోలీసు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగింది. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన సూర్యాపేట, నల్గొండ జిల్లాల పోలీసు క్రీడాకారులకు సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు క్రీడా పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినారు. ఎంపిక కాబడిన ఉమ్మడి జిల్లా పోలీసు క్రీడాకారుల జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, కోకో జట్లు, జావెలిన్ త్రో, హై జంప్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, ఫట్ బాల్, బ్యాట్మెంటెన్, పరుగు పందాలు, టగ్ ఆఫ్ వార్ పోటీలకు జట్లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం నందు ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, నల్గొండ ఆర్ఐ లు హరిబాబూ, శ్రీనివాస్, ఆర్ఎస్ఐ లు సురేష్, రాజశేఖర్, ఎం.అశోక్, కె.అశోక్, సాయిరామ్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామసభల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



**విశ్వంభర, భూపాలపల్లి:** గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు నిర్వహణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయం నుండి మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొదటిదశలో క్షేత్రస్థాయి విచారణ సజావుగా, సక్రమంగా చేశారని అదే స్ఫూర్తితో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. 16వ తేదీ నుండి 20 వ తేదీ వరకు జరిగిన క్షేత్రస్థాయి విచారణ పట్ల భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందించారు. ప్రజలు కూడా సహకారం అందించారని అభినందించారు. 21 నుండి 24వ తేదీ వరకు నిర్బహించనున్న గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలని ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని సూచించారు. గ్రామసభలు ప్రారంభానికి ముందు ప్రభుత్వం నుండి వచ్చిన సందేశాన్ని చదివి వినిపించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, భూపాలపల్లి మున్సిపాలిటీతో సహా 72 గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలు నిర్వహణకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం 26వ తేది నుండి రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణకు ప్రత్యేకంగా 4 కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్లులో నమోదులు చేయాలని సూచించారు. గ్రామసభల నిర్వహణలో పారదర్శకత పాటించి, ప్రజలతో సానుకూలంగా వ్యవహరించాలని ఆదేశించారు. అన్ని గ్రామసభలలో అర్హులైన కుటుంబాల ముసాయిదా జాబితా ప్రదర్శించాలని తెలిపారు. లబ్దిదారుల జాబితాను చదివి వినిపించిన తర్వాత తుది జాబితాకు గ్రామ సభ ఆమోదం పొందాలని, అట్టి జాబితాలో పొందుపర్చిన వివరాలపై ఏవైనా అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. గ్రామసభలో ముసాయిదా లబ్ధిదారుల జాబితాలో అభ్యర్ధనలు వచ్చినచో, అట్టి అభ్యర్ధనలను స్వీకరించి సాఫ్ట్-వేర్ లో అదే రోజు డాటా ఎంట్రీ చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహణపై టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. గ్రామసభల్లో గ్రామ పంచాయతీ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు తప్పని సరిగా పాల్గొనాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌర సరఫరాల అధికారి శ్రీనాద్, డీఆర్డీఓ నరేష్, డీపీఓ నారాయణ రావు, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో ఉపాధ్యాయుల నిరసన



**విశ్వంభర, చింతపల్లి:** మండల పరిధిలోని గడియ గౌరారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ నల్గొండ జిల్లా కార్యదర్శి కాషిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుక్కుగూడ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములు పై అమానుషంగా దాడి జరిపిన దుండగులను కఠినంగా శిక్షించాలని మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ చింతపల్లి మండల వైస్ ప్రెసిడెంట్ వెంకటేశం, సీనియర్ నాయకులు కృష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వాణి కుమారి, భాగ్యలక్ష్మి, శ్రీలత, పద్మ, హేమ, సువర్ణ, సుమలత, అన్నపూర్ణ, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నాతో బలవంతంగా సంతకాలు చేయించి ఇరికించారు

## కోర్టులో ఆర్జీకర్ హత్యాచార దోషి వాదన

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపైహత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్ కోర్టులో తన వాదనను వినిపించాడు. శిక్ష ఖరారు చేయడానికి ముందు తన వాదనను వినిపించుకోవడానికి జడ్జి అతడికి అవకాశం కల్పించారు. తాను ఏ నేరం చేయలేదని ఈ సందర్భంగా సంజయ్ కోర్టుకు వెల్లడించాడు."నేను ఈ నేరం చేయలేదు. ఏ కారణం లేకుండానే నన్ను ఇందులో ఇరికించారు. నన్ను దోషిగా నిలబెట్టారు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు ధ్వంసమయ్యాయని నేను విన్నాను. నన్ను ఇరికించారో, లేదో దానిని బట్టి మీరే నిర్ణయించుకోండి. నాతో బలవంతంగా కాగితాలపై సంతకాలు చేయించారు. నేను అమాయకుడిని. నేను ఎప్పుడూ రుద్రాక్ష ధరిస్తాను. నేను నేరం చేసి ఉంటే.. అవి ఘటనాస్థలంలోనే ఊడిపోయి ఉండేవి. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మీరు ఇవన్నీ చూశారు" అని అన్నాడు.అతడి వాదనపై జడ్జి స్పందిస్తూ.. "నాతో మాట్లాడేందుకు దాదాపు సగం రోజు సమయం ఇచ్చాను. మూడు గంటలు మీ మాటలు విన్నాను. నా ముందు అభియోగాలు, సాక్ష్యాలు, దస్త్రాలు అన్నీ ఉన్నాయి. వాటిని పరిశీలించాను. వాటి ఆధారంగా మిమ్మల్ని దోషిగా తేల్చాను.మీరు ఇప్పటికే దోషి. ఇప్పుడు శిక్ష గురించి మీ ఆలోచన ఏంటని మాత్రమే తెలుసుకోవాలనుకుంటున్నాను. మీ కుటుంబంలో మీతో ఎవరైనా సన్నిహితంగా ఉంటారా..?" అని అడిగారు. దానికి సంజయ్ బదులిస్తూ.. "లేదు సర్. నేను జైల్లో ఉన్నాను. నా దగ్గరకు ఎవరూ రాలేదు" అని చెప్పాడు. ఈసందర్భంగా సీబీఐ తరపు న్యాయవాది మాట్లాడుతూ.."ఇది చాలా అరుదైన కేసు. మరణించిన ఆ విద్యార్థిని ఎంతో ప్రతిభావంతురాలు. ఈ ఘటన సమాజాన్ని ఎంతగానో కలచివేసింది. ఆ తల్లిదండ్రులు తమ కుమార్తెను కోల్పోయారు. వైద్యులకే రక్షణ లేకపోతే.. ఇంకేం చేయాలి. మరణశిక్ష మాత్రమే సమాజంలో విశ్వాసాన్ని పునరుద్ధరించగలదు" అని వాదించారు. ఇక ఈ కేసులో మధ్యాహ్నం 2.45 గంటలకు శిక్ష ఖరారు కానుంది. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమబెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారించింది. దీనిలోభాగంగా ప్రత్యేక



కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## కర్తవ్యపథ్‌లో భారత ఆర్మీ 'డేర్‌డెవిల్స్' వరల్డ్ రికార్డు



**ఢిల్లీ:** భారత ఆర్మీకి చెందిన 'డేర్ డెవిల్స్' సరికొత్త రికార్డు నెలకొల్పింది. కదిలే మోటార్ బైక్‌లపై హ్యూమన్ పిరమిడ్‌తో వరల్డ్ రికార్డు నమోదు చేసింది. దిల్లీలోని కర్తవ్యపథ్‌లో డేర్‌డెవిల్స్ ఈ అసాధారణ ఘనతను సాధించింది. 20.4 అడుగుల ఎత్తులో నిర్వహించిన ఈ ఫీట్‌లో మొత్తం 40 మంది పాల్గొన్నారు. 7 మోటార్ వాహనాలపై నిలబడి కర్తవ్యపథ్‌లోని విజయ్‌చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు 2 కిలోమీటర్ల మేర రైడ్ కొనసాగించారు. వీరిలో సిగ్నల్స్ కార్ప్స్ ఆర్మ్ హెడ్ లెఫ్టినెంట్ జనరల్ కె.వి.కుమార్ కూడా ఉన్నారు. తాజా ఫీట్‌తో డేర్‌డెవిల్స్.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇలా 33 ప్రపంచ రికార్డులను సాధించింది. 1935లో డేర్‌డెవిల్స్ ప్రారంభమైంది. నాటినుంచి నేటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 1,600సార్లు మోటార్ సైకిళ్లపై ప్రదర్శనలను ఇచ్చింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే పరేడ్, ఆర్మీ డే పరేడ్‌లు ఇలా వివిధ మిలిటరీకి సంబంధించిన ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో ఆకట్టుకునేలా ప్రదర్శనలిచ్చింది.

## అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు భారీ ఊరట



ఢిల్లీః కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా , బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షాపై రాహుల్‌గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝూ పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు.అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార?ండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝూకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

# శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత..

**శబరిమల:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.రెండు నెలల పాటు జరిగే మండల–మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొ న్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హెూమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి




విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు.. కోర్టులో ఇద్దరు లాయర్ల గొడవ..

**ముంబై:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున



వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు.కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

## జేడీవాన్స్ దంపతులకు ప్రొఫెసర్ శాంతమ్మ శుభాకాంక్షలు



**వాషింగ్టన్‌:** అమెరికాలో సోమవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడిగా జేడీవాన్స్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈసందర్భంగా జేడీవాన్స్, ఆయన సతీమణి ఉషా చిలుకూరికి ప్రొఫెసర్ శాంతమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. "అద్భుతమైన స్థానాన్ని అందుకోబోతున్న మీ ఇద్దరికీ శుభాకాంక్షలు. మీకు, మీ దేశానికి, నా దేశానికి ఆ దేవుడి ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ శాంతమ్మ మీడియాతో మాట్లాడారు .తొమ్మిది పదుల వయసులోనూ విద్యార్థులకు పాఠాలు చెప్పడంతోపాటు పరిశోధనలు చేస్తున్న ప్రొఫెసర్ శాంతమ్మకుఉష మనవరాలి వరుస అవుతారు.గతంలో తమ బంధుత్వం గురించి మాట్లాడుతూ.. ఉష తల్లిదండ్రులు ఎప్పుడో అమెరికాలో స్థిరపడ్డారని, ఆమె అక్కడే పుట్టి పెరగడంతో పరిచయం తక్కువేనన్నారు. "మా బంధువులు అమెరికాలో వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారు. ఉష దంపతులు ఈ స్థాయికి వెళ్లారని తెలియగానే సంతోషంగా, గర్వంగా అనిపించింది. అమెరికా ఉపాధ్యక్షుడి భార్య అయితే ఎక్కువ, లేకపోతే తక్కువ అని కాకుండా నా ఆశీస్సులు వారికి ఎప్పుడూ ఉంటాయి" అని శాంతమ్మ వివరించారు.

## ప్రమాణస్వీకారానికి ముందు ట్రంప్ విక్టరీ ర్యాలీ



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు డొనాల్డ్ ట్రంప్ విక్టరీ ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్ డీసీలో ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో పాల్గొన్న తన మద్దతుదారులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను తన హయాంలో నెరవేరుస్తామని మరోసారి స్పష్టం చేశారు."రేపు సూర్యుడు అస్తమించే సమయానికి మన దేశంపై దాడి ఆగిపోతుంది. మన దేశాన్ని మనం తిరిగి స్వాధీనం చేసుకోబోతున్నాం. అమెరికన్ బలం, శ్రేయస్సు, గౌరవం, గర్వంతో సరికొత్త రోజును ప్రారంభించనున్నాం. చరిత్రలో కనీవినీ ఎరుగనివిధంగా అక్రమ వలసదారులను బయటకు పంపిస్తా" అని వ్యాఖ్యలు చేశారు. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తానని తన వైఖరిని స్పష్టంచేశారు. జాన్ ఎఫ్ కెనడీ, రాబర్ట్ ఎఫ్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్య కేసు ఫైళ్లను బహిర్గతం చేస్తానని తెలిపారు. ప్రభుత్వంలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు రాబోయే రోజుల్లో ఈమేరకు ఆదేశాలు జారీ చేస్తానని వెల్లడించారు. అలాగే మూడో ప్రపంచయుద్ధం రాకుండా అడ్డుకుంటానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న నిర్ణయాలు ఏవీ అమలుకాకుండా చూస్తానని వెల్లడించారు.ఇదిలాఉంటే.. ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ సేవలకు సంబంధించి కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. టిక్‌టాక్ కంపెనీలో కనీసం 50 శాతం వాటా అమెరికా పెట్టుబడిదారుల చేతిలో ఉండేలా షరతులు విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా వాటి సేవలను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించారు. ట్రంప్ నుంచి భరోసా లభించడంపై టిక్‌టాక్ సంస్థ కృతజ్ఞతలు తెలిపింది.

### మెలానియా ట్రంప్‌నకూ సొంత క్రిప్టో కరెన్సీ..

ట్రంప్ హయాంలో క్రిప్టో కరెన్సీకి జాతీయ ప్రాధాన్యం ఉంటుందని కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. దానికి తగ్గట్టే ట్రంప్ సతీమణి మెలానియా ఓ పోస్టు పెట్టారు. తాను సొంతంగా ఓ మీమ్‌కాయిన్ (క్రిప్టో కరెన్సీ)ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదివరకే ట్రంప్ సొంత మీమ్ కాయిన్ విడుదల చేశారు. ఆయన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో ఆ కాయిన్ విలువ భారీగా పెరగడం గమనార్హం.


# 35 మందిని కారుతో తొక్కించి చంపిన కేసు.. చైనీయుడికి ఉరి శిక్ష అమలు

**బీజింగ్‌:** చైనాలో ఇటీవల ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా కారు నడిపి 35 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడికి మరణశిక్ష పడగా.. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి శిక్ష అమలు చేశారు. ఈ మేరకు చైనా అధికారిక మీడియా సీసీటీవీ వివరాలు వెల్లడించింది.చైనాకు చెందిన ఫాన్ వీకియూ (62) అనే వ్యక్తి గతేడాది నవంబర్ 11న ఝుహాయ్ నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ బయట నిర్లక్ష్యంగా కారు నడిపారు. అక్కడ వ్యాయామం చేస్తున్న వారిపై దూసుకెళ్లిన ఘటనలో 35 మంది మరణించగా.. మరో 43 మంది గాయపడ్డారు. అనంతరం కారులో తనను తాను కత్తితో పొడుచుకుని ప్రాణాలు తీసుకునేందుకు యత్నించాడు. కోమాలోకి వెళ్లిన అతడిని ఆసుపత్రిలో చేర్చారు. ఇటీవలే విడాకులు తీసుకున్నాడని, భార్యతో జరిగిన ఆస్తి పంపకంలో అసంతృప్తికి గురవడంతోనే అతడు ఈ ఘోరానికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో తేలింది.ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు.. ఈ ఘటన అత్యంత ఘోరమైనదిగా పేర్కొంటూ నిందితుడికి మరణశిక్ష విధించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు అతడికి మరణశిక్ష అమలు చేసినట్లు చైనా అధికారిక మీడియా



వెల్లడించింది. చైనాలో ఇటువంటి దారుణాలు అరుదే అయినప్పటికీ గతేడాది అక్కడ ఈ తరహా ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం గమనార్హం. జియాంగ్సు ప్రావిన్సులో గత నవంబర్‌లో ఓ యువకుడు కత్తులతో దాడికి పాల్పడిన ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా 17 మంది గాయపడ్డారు. ఈ కేసులో స్థానిక న్యాయస్థానం నిందితుడికి మరణశిక్ష విధించింది. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఈ 21ఏళ్ల యువకుడికి ఇటీవలే మరణశిక్ష అమలు చేశారు.

## ప్రేమను తెంచుకునేందుకు.. ప్రియుడికి విషమిచ్చి చంపిన మహిళకు మరణశిక్ష



**తిరువనంతపురం:** మరో వ్యక్తితో పెళ్లి నేపథ్యంలో ప్రేమ సంబంధాన్ని తెంచుకునేందుకు ఒక మహిళ ప్రయత్నించింది. ప్రియుడికి విషం ఇచ్చి చంపింది. ఈ కేసుపై విచారణ జరిపిన కోర్టు ఆ మహిళకు మరణశిక్ష విధించింది. కేరళకు చెందిన 23 ఏళ్ల షారన్ రాజ్, తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల గ్రీష్మ ప్రేమించుకున్నారు. అయితే గ్రీష్మకు మరో వ్యక్తితో పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో ప్రేమ సంబంధాన్ని వదులుకోమని రాజ్‌కు చెప్పింది. అతడు ఒప్పుకోకపోవడంతో హత్య చేయాలని నిర్ణయించింది. తొలుత జ్యూస్‌లో పారాసిటమాల్ మాత్రలు కలిపి రాజ్‌కు ఇచ్చింది. అయితే చేదుగా ఉండటంతో తాగేందుకు అతడు నిరాకరించాడు.కాగా, 2022 అక్టోబరు 14న తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా రామవర్మంచిరైలోని తన ఇంటికి ప్రియుడు రాజ్‌ను గ్రీష్మ రప్పించింది. ఆయుర్వేద టానిక్‌లో విషం కలిపి ఇచ్చింది. అది తాగిన రాజ్ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యాడు. పలు అవయవాలు దెబ్బతినడంతో 11 రోజుల తర్వాత అక్టోబర్ 25న మరణించాడు. అతడిపై విష ప్రయోగం జరిగినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో నిర్ధారణ అయ్యింది.మరోవైపు రాజ్‌ను హత్య చేసిన గ్రీష్మ, సహకరించిన ఆమె కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండేళ్లుగా ఈ కేసుపై విచారణ కోర్టులో కొనసాగింది. జనవరి 17న తిరువనంతపురంలోని అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గ్రీష్మను దోషిగా నిర్ధారించింది. సోమవారం శిక్షలు ఖరారు చేసింది. గ్రీష్మకు మరణశిక్ష విధించింది. ఆమెకు సహకరించి, ఆధారాలు ధ్వంసం చేసిన మేనమామ నిర్మల్ కుమార్‌కు మూడేళ్లు కఠిన కారాగార శిక్ష విధించింది. అయితే గ్రీష్మ తల్లి సింధును నిర్దోషిగా కోర్టు విడుదల చేసింది.

# ఇస్కాన్ ఏనుగులకు వంతారా చేయూత

**ముంబై:** అనంత్ అంబానీ ఔదర్యం ప్రదర్శించాడు. జంతు సంరక్షణ కేంద్రం వంతారాకు.. కొత్తగా రెండు ఏనుగుల్ని తీసుకురానున్నారు. కోల్‌కతా సమీపంలోని మాయాపూర్‌లో ఉన్న ఇస్కాన్‌లో రెండు ఏనుగులు ఉన్నాయి. 18 ఏళ్ల బిష్ణుప్రియ, 26 ఏళ్ల లక్ష్మీప్రియాలను.. ఇప్పుడు వంతారా జంతు సంరక్షణ కేంద్రానికి తీసుకున్నారు. ఇక నుంచి ఆ ఏనుగుల బాగోగులు అక్కడే చూసుకోనున్నారు.గత ఏప్రిల్‌లో మావోతుపై బిష్ణుప్రియా దాడి చేసింది. ఈ నేపథ్యంలో దాని సంరక్షణ చూసుకునేందుకు అనంత్ అంబానీ ముందుకు వచ్చారు. ప్రత్యేకమైన కేర్ అవసరమన్న విషయాన్ని ఆ సంఘటన చెబుతోందని వంతారా పేర్కొన్నది. ఏనుగులకు సహజసిద్ధమైన పరిస్థితుల్ని వంతారాలో కల్పించనున్నారు. వెటర్నరీ కేర్ తీసుకోనున్నారు.వంతారా కేంద్రంలో ఉన్న ఇతర ఏనుగులతో కలిసే విధంగా ఆ కొత్తఏనుగుల్ని తీర్చుదిద్దుతారు. లక్ష్మీప్రియా, బిష్ణుప్రియాఏనుగులు ఇస్కాన్



లో జరిగే వేడుకలకు వాడుకుంటున్నారు. అయితే ఇటీవల ఓ ఏనుగు మావోతుపై అటాక్ చేసింది. ఈ నేపథ్యంలో వాటిని తరలిస్తున్నారు.

## కుమారుడు ఆత్మహత్య.. తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతి

**భోపాల్:** ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి అతడి తల్లి గుండెపోటుతో మరణించింది. తల్లి, కుమారుడు మరణించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. 33 ఏళ్ల మనీష్ రాజ్‌పుత్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా పరీక్షలు రాశాడు. ఏ ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో జనవరి 18న శనివారం రాత్రి వేళ ఇంట్లో విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మనీష్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు.కాగా, మనీష్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అయితే కుమారుడి మరణవార్త తెలిసి అతడి తల్లి రాధా గుండెపోటుతో కుప్పకూలి చనిపోయింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. రాధా పెద్ద కుమారుడు అనిల్ ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. దీంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భయపెడుతోన్న అగ్నిపర్వతం.. 20 రోజుల్లో వెయ్యిసార్లు విస్ఫోటం

ఇండోనేసియాః ఇండోనేసియా ప్రజలను మౌంట్ ఇబు అగ్నిపర్వతం వణికిస్తోంది. ఒక్క జనవరి నెలలోనే వెయ్యి సార్లు విస్ఫోటం చెందిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. రానున్న రోజుల్లో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉండొచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని హల్మహేరా ద్వీపంలోని మౌంట్ ఇబు జనవరి నుంచి విస్ఫోటం చెందుతూనే ఉంది. ఇప్పటివరకు దానినుంచి గాలిలోకి 0.3 కి.మీ. నుంచి 4 కి.మీ. వరకు బూడిద ఎగసిపడింది. తాజాగా ఆదివారం 1.5 కి.మీ. మేర పైవరకు బూడిద కనిపించింది. మౌంట్ ఇబు అబ్జర్వేషన్ పోస్ట్ వరకు శబ్దం వినిపించిందని ఇండోనేసియా జియోలాజికల్ ఏజెన్సీ వెల్లడించింది. ఇక ఒక్క ఆదివారమే 17సార్లు అగ్నిపర్వతం బద్ధలైందని తెలిపింది.ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చుట్టుపక్కల ఆరు గ్రామాల్లోని మూడు వేల మంది గ్రామస్థులు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే పలువురు గ్రామస్థులు అధికారుల హెచ్చరికలను పాటించేందుకు నిరాకరిస్తున్నారు. తమ పంటలను మధ్యలో వదిలి వచ్చేయడానికి వారు సిద్ధంగా లేరు. అయితే అధికారులు మాత్రం వారికి నచ్చజెబుతున్నారు. ఇండోనేసియాలోని క్రియాశీలక అగ్ని పర్వతాల్లో మౌంట్ ఇబు కూడా ఒకటి. అది గత జూన్ నుంచి మరింత క్రియాశీలకంగా మారింది.

# గ్రామాల్లో కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై కమిటీ ఏర్పాటు: పవన్ కల్యాణ్



**విశ్వంభర, అమరావతి:** గ్రామీణ ప్రజలకు నిరంతరాయంగా పంచాయతీ సేవలు అందేలా చూడాలని, దీని కోసం సిబ్బంది లేమి సమస్యను అధిగమించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానంలో మార్పులు చేపట్టి, కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని చెప్పారు. గతంలో పంచాయతీల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకొని క్లస్టర్ గ్రేడ్ల విభజన జరిగిందని.. నూతనంగా జనాభాను కూడా జోడించి పంచాయతీల క్లస్టర్ గ్రేడ్లు విభజించాలని అధికారులకు సూచించారు. ఆదాయంఎక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో జనాభా ఎక్కువగా ఉండే సందర్భాల్లో పరిస్థితులకు అనుగుణంగా ఇబ్బందులు లేకుండా క్లస్టర్ గ్రేడ్ల విభజన చేయాలని అధికారులకు సూచించారు.గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకొని కొత్త క్లస్టర్ గ్రేడ్ల విభజన విధానంలో సిబ్బందిని నియమించుకోవాలన్నారు.మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ కార్య క్రమాల నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత అయిన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య మెరుగుదలకు తగినంత మంది సిబ్బంది ఉండాలన్నారు. వీటిపై అధ్యయనం చేసి పంచాయతీల్లో పరిపాలన సులభతరం చేసేందుకు కమిటీ వేయాలని డిప్యూటీ సీఎం చెప్పారు.కొత్త క్లస్టర్ల విభజన, గ్రేడ్ల కేటాయింపుపై ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. పంచాయతీరాజ్ శాఖ నుంచి నలుగురు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు కానుంది. జిల్లా ఒక యూనిట్ ప్రాతిపదికన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న పంచాయతీల ఆదాయం,జనాభాను ప్రాతిపదికనజిల్లాల కలెక్టర్లు ఇచ్చిన నివేదికలను కమిటీ పరిశీలిస్తుంది. వీటిని కమిటీ పరిశీలించిన తర్వాత పంచాయతీల క్లస్టర్ గ్రేడ్ల విభజనకు సంబంధించిన సిఫార్సులను ప్రభుత్వానికి కమిటీ నివేదించనుంది.దీనిని అనుసరించి గ్రేడ్ల ప్రకారం పంచాయతీ, సచివాలయ సిబ్బందిని పంపిణీ చేయడానికి మార్గదర్శకాలను రూపొందిస్తారు.

# తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు




**విశ్వంభర, అమరావతి:** ఈనెల 11న జరిగిన ఘటనపై టీడీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులకు నేరుగా, రాతపూర్వకంగా తన వివరణ ఇచ్చానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "సోషల్ మీడియాలో వచ్చేది వేరు.. జరిగిన వాస్తవం వేరు. కంచె తొలగింపు ఘటన యాదృచ్ఛికంగా జరిగింది. కంచె ఉన్న విషయం అక్కడికి వెళ్లే వరకు తెలియదు. నాపై ఫిర్యాదు చేసిన వాళ్లే ఇవాళ నాతో కలిసి పనిచేస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వాళ్లను ఎవరూ దూరం పెట్టరు. తిరువూరు ప్రజలకు వాస్తవాలన్నీ తెలుసు" అని కొలికపూడి అన్నారు.ఏం జరిగిందంటే..ఈ నెల 11న కొలికపూడి.. ఎ.కొండూరు మండలం గోపాలపురంలోని టీడీపీ గ్రామ కార్యదర్శి భూక్యా రాంబాబు ఇంటికి వెళ్లారు. ఆ గ్రామంలో రాంబాబుకి, ఆయనకు వరుసకు సోదరుడయ్యే... వైసీపీ నాయకుడు భూక్యా కృష్ణకు ఎప్పటి నుంచో ఆస్తి తగాదా ఉంది. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఆ రోడ్డు తన స్థలంలోనే వేశారని.. వివాదం తేలేవరకు రోడ్డుని ఎవరూ వినియోగించడానికి వీల్లేదని కృష్ణ దానిపై కంచె వేశారు. రాంబాబు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆ రోడ్డు దగ్గరకు వెళ్లి కృష్ణ, ఆయన భార్య భూక్యా చంటిపైతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తమ ఇంట్లోకి వచ్చి తన భర్తను, తనను కొట్టారంటూ... భూక్యా చంటి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. తెదేపాలోని మెజార్టీ వర్గాలు కూడా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నాయి.దీంతో నేడు ఎమ్మెల్యేను క్రమశిక్షణ సంఘం ముందుకు పిలిపించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణకు కొలికపూడి వివరణ ఇచ్చారు.

## టీడీపీలో ఎవరైనా క్రమశిక్షణ పాటించాల్సిందే: వర్ల రామయ్య

టీడీపీలో ఎవరైనా క్రమశిక్షణ పాటించాల్సిందేనని పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. అమరావతిలో మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీలో కార్యకర్త, ఎమ్మెల్యే.. ఎవరైనా ఒకటేనని చెప్పారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి పార్టీ లైన్ దాటుతున్నట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించారు. ఏ ఉద్దేశంతో తెదేపా అధినేత చంద్రబాబు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారో ఆ నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉండాల్సిన బాధ్యత కొలికపూడిపై ఉందన్నారు. వ్యవహార శైలిని ఆయన మార్చుకోవాలని.. అందరితో కలివిడిగా ముందుకెళ్లాలని సూచించారు. కొలికపూడిపై క్రమశిక్షణ కమిటీ నివేదికను పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుకు సమర్పిస్తామని..ఆపై ఆయనే నిర్ణయం తీసుకుంటారని వర్ల రామయ్య అన్నారు.

# భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో చంద్రబాబు భేటీ



జ్యూరిచ్: దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు అక్కడిభారత రాయబారి మృదుల్‌కుమార్‌తో భేటీ అయ్యారు. జ్యూరిచ్ విమానాశ్రయం నుంచి హిల్టన్ హోటల్‌కు చేరుకున్న ఆయన మృదుల్ కుమార్‌తో వివిధ అంశాలపై చర్చించారు. కాసేపట్లో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం సమావేశం కానుంది. అనంతరం అక్కడి తెలుగువారితో చంద్రబాబు మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆ తర్వాత జ్యూరిచ్ నుంచి రోడ్డు మార్గంలో దావోస్ వెళ్లనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లిన సంగతి తెలిసిందే.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆఫీసుపై ఎగిరిన డ్రోన్ ప్రభుత్వానిదే!



**విశ్వంభర, అమరావతి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రతపై పలు అనుమానాలు వస్తున్నాయి. ఆ మధ్య పార్వతీపురం మన్యం జిల్లాలో పవన్ కల్యాణ్‌పర్యటన సమయంలో నకిలీఐపీఎస్ ప్రత్యక్షమవ్వడంటెన్షన్ పెట్టిస్తే.. తాజాగా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం, పవన్ కల్యాణ్ క్యాంప్ ఆఫీసుపై ఒక డ్రోన్ ఎగరడం కలకలం సృష్టించింది. దీంతో పవన్ కల్యాణ్ భద్రతపై చాలా రకాల అనుమానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ విచారణలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది.జనసేన కేంద్ర కార్యాలయంపై ఎగిరిన డ్రోన్ రాష్ట్ర ప్రభుత్వానిదే అని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో రెండ్రోజులుగా లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు ఆ డ్రోన్ ఏపీ ఫైబర్ నెట్ సంస్థదిగా తేల్చారు. ట్రాఫిక్, పారిశుద్ధ్య కాల్వల నిర్వహణ, రహదారుల స్థితిగతులపై కూటమి ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. పైలట్ ప్రాజెక్టులోభాగంగా మంగళగిరి నియోజకవర్గంలో ఈ అధ్యయనం కొనసాగుతోంది. ఇందులో పలు రకాల సర్వేల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఆడ్రోన్లలో ఒకటే జనసేన కార్యాలయాలపై ఎగిరినట్లు సమాచారం. కాగా, పవన్ కల్యాణ్ భద్రతపై ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజమండ్రిలో పర్యటించిన ఆయన.. పవన్ భద్రత అంశాన్ని సీరియస్‌గా విచారిస్తున్నట్లు తెలిపారు. పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా? లేదా? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై ఈ సాయంత్రానికి విచారణ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన సమయంలో నకిలీ ఐపీఎస్ ప్రత్యక్షమవ్వడంపై మీడియా ప్రశ్నించగా.. ఈ రెండు అంశాలను వేర్వేరుగా చూస్తున్నామని తెలిపారు. పార్వతీపురం మన్యం ఘటనలో పోలీసు శాఖ వైఫల్యంలేదని స్పష్టం చేశారు.పవన్‌కల్యాణ్ పర్యటనలో ఎటువంటి భద్రతా లోపం లేదని.. కేవలం పర్యటన పూర్తి అయిన తర్వాతే నకిలీ పోలీసు వచ్చినట్లు గుర్తించారని వివరించారు. దీనిపై కూడా విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బతకాలంటేనే భయమేస్తోందమ్మా..

## ఆవేదనతో ఎంబీబీఎస్ స్టూడెంట్ సూసైడ్

**విశ్వంభర, అమరావతి:** తమ కొడుకును డాక్టర్‌గా చూడాలని ఆ తల్లిదండ్రులు ఆశపడ్డారు. కానీ ఆ కొడుక్కేమో చదువు అబ్బలేదు. అమ్మానాన్నల కోరిక తీర్చేందుకు ఎంబీబీఎస్‌లో అయితే చేరాడు కానీ.. చదివింది బుర్రకు ఎక్కకపోవడంతో వరుసగా ఫెయిల్ అవుతూ వస్తున్నాడు. అలా ఫైనల్ ఇయర్‌కు వచ్చేసరికి గంపెడు సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్‌గా మిగిలిపోయాయి. ఇది చూసి ఆ పేరెంట్స్‌తో ఎంతో కుమిలిపోయారు. కష్టపడి చదివిస్తుంటే.. కొడుకు మాత్రం ఫెయిల్ అవుతున్నాడని తెగ బాధపడిపోయారు. అది చూసి కుమిలిపోయిన ఆ కొడుకు.. తన వల్లే అన్ని ప్రాబ్లెమ్స్ అని భావించి.. ఆత్మహత్య చేసుకున్నాడు. తన పరిస్థితిని చూస్తుంటే బతకాలంటేనే భయమేస్తోందని సూసైడ్ నోట్ రాసి మరి బలవన్మరణానికి పాల్పడ్డాడు.వివరాల్లోకి వెళ్తే.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ఆతుకూరి సాయి మణిదీప్ (24) విజయనగరం జిల్లానెల్లిమర్ల పట్టణంలోని మిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కానీ చదువులో అంతగా రాణించడం లేదు. దీంతో రెండో సంవత్సరం నుంచే బ్యాక్‌లాగ్స్ ఉండిపోయాయి. కొడుకు డాక్టరై రోగుల జబ్బులు నయం చేస్తాడేమో అనుకుంటే..ఇలా ప్రతి సంవత్సరం సబ్జెక్టులు తప్పుతుండటంతో సాయి మణిదీప్‌తో పాటు అతని తల్లిదండ్రులు చాలా బాధపడుతూ ఉన్నారు. దీంతో సాయి మణిదీప్ కూడా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.తాను బతికి ఉండటం వల్ల అందరూ ఇబ్బంది పడుతున్నారని.. తానే లేకపోతే ఎవరికీ ఏ సమస్య ఉండదని సాయి మణిదీప్ భావించాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆన్‌లైన్‌లో పురుగుల మందు తెప్పించుకుని, కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగాడు. కాలేజీ హాస్టల్ ప్రాంగణంలోనే పురుగుల మందు తాగడంతో విషయం తెలుసుకున్న సహ విద్యార్థులు.. సాయి మణిదీప్‌ను కాలేజీ యాజమాన్యానికి తెలియజేశారు. యాజమాన్య ప్రతినిధులు నెల్లిమర్ల పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. హాస్టల్‌లో సాయి మణిదీప్ ఉంటున్న గదిని పరిశీలించారు. అక్కడే వారికి సూసైడ్ నోటు లభించింది.



### సూసైడ్ నోట్‌లో ఏమున్నదంటే..

గత పది సంవత్సరాలుగా మిమ్మల్ని చాలా కష్టపెట్టాను. బాధపెట్టాను. నా వల్లే ఇంట్లో సంతోషం , ప్రశాంతత లేదు. నా వల్లే మీకు ఆరోగ్యం కూడా బాగుండట్లేదు. ఎంత కష్టపడి చదువుదామన్నా చదవలేకపోతున్నా, రకరకాల ఆలోచనలు, ఎందుకు బాధపడతానో తెలియదు. ఎందుకు సంతోషంగా ఉంటానో తెలియదు. నా వల్ల నా చుట్టూ ఉన్న వాళ్లు ఏదోవిధంగా బాధపడుతూనే ఉంటారు. ఆందోళన, కోపం, బాధ, భయం ఎందుకు ఎక్కువైపోతుందో తెలియట్లేదు. గత 8-9 నెలల నుంచి సూసైడ్ ఆలోచనలు తినేస్తున్నాయి. కానీ ఎవరికీ చెప్పలేదు.ఇప్పటికే నా వల్ల తమ్ముడు కూడా చాలా బాధపడుతున్నాడు. ఇంట్లో పరిస్థితుల వల్ల, నాకు నేనే పిచ్చోడిలా అనిపిస్తున్నా అమ్మ. నా కోసం మీరు ఇంత చేశారు. నేను మాత్రం మిమ్మల్ని బాధపెడుతూనే ఉన్నా. మీ నిద్ర, ఆరోగ్యం అన్నీ నావల్లే పోతున్నాయి. బతకాలి అంటేనే భయం వేస్తోందమ్మా.. నా గురించి కాదు, ఇంకా ఎంత కాలం మిమ్మల్ని బాధ పెడతా అని. నా లాంటి పిచ్చోడు ఉండకూడదు. బతుకుదామనే ఆశ ఉన్నా కూడా ఇంత అదృష్టం కూడా ఉండదు. అందుకే మీరు ఆనందంగా ఉండటమే నాకు కావాలి. నన్ను క్షమించండి డాడీ, అమ్మ. సారీ రా తమ్ముడు.. నీకు ఎప్పుడు ఒక అన్నలా కూడా ఉండలేకపోయా. కానీ ఒక్కటి అమ్మ.. మీ ముగ్గురే నా జీవితం. మీరంటే అంత ఇష్టం. మీరు ఆనందంగా ఉంటేనే నేను ఆనందంగా ఉంటా. సారీ.

# 'నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం' అంశం.. టీడీపీ అధిష్ఠానం కీలక ఆదేశాలు



**విశ్వంభర, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని డిమాండ్లు వినిపిస్తోన్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది.

# డిప్యూటీ సీఎం పదవికి వన్నె తెచ్చిందే పవన్ కల్యాణ్.. దీన్ని పెద్దలు గమనించాలి.. జనసేన నేత కిశోర్ గునుకుల కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, అమరావతి:** డిప్యూటీ సీఎం పదవిపై ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఏపీలో ఇప్పుడు పవన్ కల్యాణ్ ఒక్కడే డిప్యూటీ సీఎంగా ఉండగా.. టీడీపీ నుంచి నారా లోకేశ్‌కు కూడా ఆ పదవి కట్టబెట్టాలని తెలుగు తమ్ముళ్ల నుంచి డిమాండ్ వినిపిస్తున్నది. ఈ క్రమంలో జనసేన నేత కిశోర్ గునుకుల కీలక వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం అనే పదానికి వన్నె తెచ్చింది జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక్కరే అని ఆయన వ్యాఖ్యానించారు. పెద్దలు ఈ విషయాన్ని గమనించాలని కూడా సూచించారు.గతంలో చాలామంది డిప్యూటీ సీఎంలుగా పనిచేశారని నెల్లూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కిశోర్ గునుకుల తెలిపారు. నెల్లూరు జిల్లా కావలిలో సోమవారం నిర్వహించిన జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కిశోర్ మాట్లాడుతూ.. గతంలో ఎవరెవరు డిప్యూటీ సీఎంలుగా ఉన్నారో తనతో పాటు చాలామందికి తెలియదని అన్నారు. కానీ ఈరోజున ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి యావత్ దేశం చర్చిస్తోందని చెప్పుకొచ్చారు. వామన రూపంలో వచ్చి శ్రీమహావిష్ణువు ఇంతింతై వటుడింతై అని ఎదిగినట్లుగా పవన్ కల్యాణ్ ఎదుగుతున్నారని అన్నారు.పల్లెలు అభివృద్ధి చెందాలంటే పల్లె నుంచి నగరానికి కనెక్టివిటీ రోడ్లు ఉండాలని ఆరోజు ప్రశ్నించిన గొంతుక పవన్ కల్యాణ్ అని కిశోర్ గునుకుల అన్నారు. ఈ రోజు పల్లెలకే కాదు.. తండాలకు సైతం రోడ్లు వేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఆరోజు నినాదించిన స్వరం.. ఈ రోజు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడిందని పేర్కొన్నారు.

# నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. పవన్ కల్యాణ్‌కు సీఎం పదవి ఇస్తే స్వాగతిస్తా.. టీడీపీ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు

**విశ్వంభర, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగు తమ్ముళ్ల నుంచి రోజురోజుకీ డిమాండ్లు పెరిగిపోతున్నాయి. ఈ డిమాండ్‌పై పలు విమర్శలు కూడా వస్తూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రాధాన్యత పెరుగుతుంది. బాబు తర్వాత నెంబర్ 2 పొజిషన్‌లో జనసేనాని అనధికారికంగా కొనసాగుతున్నారు. దీంతో ఇది మింగుడుపడని చంద్రబాబు, లోకేశ్ సహా టీడీపీ నేతలు.. నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తే పవన్ కల్యాణ్ దూకుడు కళ్లెం వేయొచ్చని భావిస్తున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ క్రమంలోనే టీడీపీ నాయకుల నోటి నుంచి ఈ డిమాండ్‌ను చెప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో రాజమహేంద్రవరం టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.నారా లోకేశ్ డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. సీఎం కూడా అవ్వాలని తాను వ్యక్తిగతంగా కోరుకుంటున్నానని ఆదిరెడ్డి శ్రీనివాసు తెలిపారు. అలాగే పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి పదవి ఇస్తే స్వాగతిస్తానని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమిలో ఎవరికి ఏ స్థానం ఇవ్వాలో పెద్దలే నిర్ణయిస్తారని అన్నారు. వర్మ లేదా మా పార్టీలో ఇంకెవరైనా చెప్పినా అది వారి వ్యక్తిగత అభిప్రాయమే అవుతుందని చెప్పారు. నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటేనే దానికి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం, సీఎం పదవులు అంటూ టార్గెట్‌గా చేసుకుని కూటమిలో చిచ్చుపెట్టాలని వైసీపీ సైకోలు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఎవరి పార్టీ కార్యకర్తల మనోభావాలు వారికి ఉంటాయని, దీన్ని సోషల్ మీడియా, మీడియా ఛానళ్లు వక్రీకరించడం సరికాదని హితవుపలికారు. నారా లోకేశ్ కష్టాన్ని గుర్తించాలని కేడర్ కోరుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఓడిపోయి, భవిష్యత్తు ఏంటో కూడా తెలియని జగన్నే సీఎం.. సీఎం అని అంటున్నారని తెలిపారు. పవన్ కల్యాణ్‌ను కూడా జనసేన కార్యకర్తలు సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు.. అలాంటిది తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి, కార్యకర్తల్లో ధైర్యం నింపిన లోకేశ్‌ను డిప్యూటీ సీఎం అంటే తప్పేంటి అని నిలదీశారు. కరుడుగట్టిన టీడీపీ కార్యకర్తగా లోకేశ్ డిప్యూటీ సీఎం కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఇది తన ఒక్కడి అభిప్రాయం కాదని.. కార్యకర్తల మనసులోని మాట అని చెప్పారు. దీనిపై పార్టీ అధినేత చంద్రబాబు తీసుకునే నిర్ణయమే ఫైనల్ అని.. అది కార్యకర్తలు అందరికీ శిరోధార్యం అని స్పష్టం చేశారు.

# వైఎస్ జగన్ ఓ తోలుబొమ్మ: వైఎస్ షర్మిల



విశ్వంభర, అమరావతి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మరోసారి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విరుచుకుపడ్డారు. అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని విమర్శించారు. వైసీపీ పాలన ఓ విపత్తు అని అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఐదేళ్లలో విధ్వంసం జరుగుతుంటే ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా అని నిలదీశారు.ఆ ఐదేళ్లు కేంద్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులను ఆపితే ఒక్కనాడైనా అడిగారా అని అమిత్ షాను వైఎస్ షర్మిల ప్రశ్నించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఐదేళ్లు పాలన చేస్తుంటే కేంద్రానికి కనిపించలేదా అని నిలదీశారు. ఇష్టారాజ్యంగా రూ.10లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా ? సొంత బాబాయి హత్యకేసులో ఢిల్లీ స్థాయిలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే.. కేంద్ర హోం శాఖ మంత్రిగా మౌనంగా ఎందుకున్నారని ప్రశ్నించారు. భారీ స్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయటపెట్టారా నిలదీశారు.ఐదేళ్ల పాటు జగన్ మీకు దత్తపుత్రుడు.. ఆడించినట్లు ఆడే తోలుబొమ్మగా వ్యవహరించారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. పార్లమెంట్‌లో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంప్ అని విమర్శించారు. రాష్ట్రంలో సహజ వనరులను 'మోదానీ'కి దోచిపెట్టే ఏజెంట్‌అని వ్యాఖ్యానించారు. మీ ఇష్టారాజ్యంగా ఐదేళ్లు వైసీపీనీ వాడుకొని, రాష్ట్ర సంపదను దోచుకొని, ఇప్పుడు విధ్వంసం జరిగిందని మొసలి కన్నీరు కార్చితే నమ్మే అమాయకులు రాష్ట్ర ప్రజలు కారని స్పష్టం చేశారు.2019-2024 మధ్య జరిగిన విధ్వంసంలో కర్త జగన్ అయితే కర్మ, క్రియ బీజేపీ ప్రభుత్వమని మండిపడ్డారు. పదేళ్ల పాటు విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి, ఇప్పుడు అండగా ఉంటామని.. రూ.3లక్షల కోట్లు ఇస్తామని.. పూర్వవైభవం తెస్తామనే మీ మాటలు మరో మోసానికి నిదర్శనమని విమర్శించారు. మీ వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటే.. మీకు దమ్ముంటే గత వైసీపీ పాలనపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని అమిత్ షాను డిమాండ్ చేశారు.

# దావోస్‌కు వెళ్లడం ఫొటోలు దిగడం తప్ప.. ఒక్క కంపెనీని తీసుకురాలేదు.. వైసీపీ సెటైర్లు

**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు దావోస్ పర్యటపై వైసీపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. అధికారంలో ఉన్న సమయంలో ప్రతి ఏడాది ఈ పిట్టలదొర చంద్రబాబు నాయుడు దావోస్ వెళ్లడం.. ప్రముఖులతో ఫొటోలు దిగడం తప్ప రాష్ట్రానికి ఒక్క కంపెనీని తీసుకురాలేదని విమర్శించింది. రాష్ట్రానికి పైసా ప్రయోజనం లేకపోయినా ఆయన సొంత ఎలివేషన్లకు ఏ మాత్రం కొదవ లేకుండా భారీగా ఖర్చు పెడుతున్నారని ఎద్దేవా చేసింది.చంద్రబాబు దావోస్ వెళ్లడం ఫొటోలు దిగడం తప్ప రాష్ట్రానికి ఒక్క కంపెనీ కూడా రాలేదని వైసీపీ ఎద్దేవా చేసింది. దీనికికోట్లకు కోట్లు పెట్టిభారీగా ప్రచారం చేయించుకుంటున్నారని.. కానీ ఫలితం మాత్రం శూన్యమని పేర్కొంది.2014-19 మధ్య స్విట్జర్లాండ్‌లోని దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులకు అప్పటిముఖ్యమంత్రిగాచంద్రబాబు నాలుగు సార్లు, ఐటీ మంత్రిగా నారా లోకేశ్ ఒకసారి వెళ్లారని వైసీపీ తెలిపింది. మొత్తం దావోస్ పర్యటన కోసం రూ.55 కోట్ల వరకు ప్రజాధనం ఖర్చు చేయగా.. ఒక్క కోటి రూపాయల పెట్టుబడులు కూడా ఏపీకి రాలేదని విమర్శించింది.

# పవన్ భద్రతకు సంబంధించి ప్రతి అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం: డీజీపీ



విశ్వంభర,రాజమహేంద్రవరం: డీజీపీ ద్వారకా తిరుమలరావురాజమహేంద్రవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటిపై డ్రోన్ ఎగిరిన ఘటనపై ఈ సాయంత్రానికి విచారణ కొలిక్కి వస్తుందని చెప్పారు.పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా లేదా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. మన్యంలో పవన్ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి పట్టుబడిన ఘటనలో పోలీసు శాఖ వైఫల్యం లేదని పేర్కొన్నారు. పవన్ భద్రతకు సంబంధించి ప్రతి అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు.

# చివరి వారంవరకూ కేకేఆర్ నుంచి సరైన సమాచారం లేదు

## శ్రేయస్ అయ్యర్



**కోల్‌కతా:** ఐపీఎల్ మెగా వేలంలో రూ. 26.75 కోట్లను శ్రేయస్ అయ్యర్ దక్కించుకున్నాడు. పంజాబ్ కింగ్స్ అతడిని తీసుకుంది. రిషభ్ పంత్ (రూ. 27 కోట్లు) తర్వాత అత్యధిక మొత్తం సొంతం చేసుకున్న క్రికెటర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2024 సీజన్ విజేతగా నిలిచిన కేకేఆర్‌కు సారథిగా శ్రేయస్ ఉన్న సంగతి తెలిసిందే. కానీ, రిటెన్షన్‌లో మాత్రం అతడిని కోల్‌కతా మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. దీంతో మెగా వేలంలోకి వచ్చేసి భారీ మొత్తం దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో కప్ అందించిన కెప్టెన్‌ను ఎవరూ వదులుకోరు. కానీ, కేకేఆర్ వదిలేయడంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రేయస్ స్పందించాడు. చివరి వరకూ సరైన సమాచారం ఇవ్వడంలో కేకేఆర్ విఫలమైందని వ్యాఖ్యానించాడు.

''కోల్‌కతా తరఫున విజేతగా నిలవడం అద్భుతంగా అనిపించింది. కేకేఆర్‌కు అభిమానుల మద్దతు చాలా బాగుంటుంది. ప్రతి మ్యాచ్‌కు స్టేడియం మొత్తం నిండిపోయేది. అక్కడ గడిపిన ప్రతి క్షణం ఆస్వాదించా. ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత చాలాసార్లు మాట్లాడుకున్నాం. కానీ, ఎప్పుడూ రిటెన్షన్ అంశం చర్చకు రాలేదు. అసలు ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యా. సరైన సమాచారం లేకపోవడం వల్లే ఇదంతా జరిగింది. చివరికి విడిపోయే వరకూ వచ్చింది. అయితే ఇది పరస్పర అంగీకారంతోనే జరిగిందని బలంగా నమ్ముతా. కమ్యూనికేషన్ సరిగ్గా లేకపోవడం నన్ను తీవ్రంగా బాధించింది. రిటెన్షన్‌కు వారం రోజుల ముందే విషయాలు తెలిశాయి. దీంతో నేను నా నిర్ణయం తీసుకున్నా. ఆ తర్వాత ఏం జరిగినా ఫర్వాలేదని ముందడుగు వేశా'' అని అయ్యర్ తెలిపాడు.

**ఈ ధర అస్సలు ఊహించలేదు..**

''మెగా వేలం జరుగుతున్నప్పుడు నేను హైదరాబాద్‌లో జట్టుతోపాటు ఉన్నా. మంచి ధర వస్తుందని భావించా. కానీ, ఇంత భారీ మొత్తంతో సొంతం చేసుకుంటారని అస్సలు ఊహించలేదు. రెండు జట్లు నా కోసం తీవ్రంగా వేలంలో పాల్గొన్నాయి. ఇది నాకెంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది. కాసేపటికి రూమ్ డోర్ మూసేసి.. వాష్‌రూమ్‌కు వెళ్లిపోయా. బయట ఏం మాట్లాడుకుంటున్నారనేది వినకూడదనే అలా చేశా'' అని వ్యాఖ్యానించాడు.

# గిల్‌కు వైస్ 'కెప్టెన్సీ' భవిష్యత్తు కోసమే ఈ నిర్ణయం



అశ్విన్

**ముంబయి:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం జట్టును ప్రకటించిన సమయంలో వైస్ కెప్టెన్సీపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. చివరికి రోహిత్ శర్మకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ ను నియమిస్తూ జట్టును వెల్లడించింది. దీంతో భవిష్యత్తులో వన్డే జట్టును నడిపించే అవకాశం తొలుత గిల్‌కే ఇస్తారన్న ప్రచారం మొదలైంది. గతేడాది జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు గిల్ సారథ్యంలో భారత్ వెళ్లిన సంగతి తెలిసిందే. శ్రీలంకతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లకూ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. పేలవ ఫామ్‌తో జట్టులో స్థానంతోపాటు ఉప నాయకత్వమూ కోల్పోయాడు. ఇప్పుడు మళ్లీ గిల్‌కు వన్డేల్లో వైస్ కెప్టెన్సీ దక్కింది. ఎందుకు అతడికి ఆ బాధ్యతలు అప్పగించామనేది కూడా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చాడు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని అభినందించాడు. భవిష్యత్తును అంచనా వేసి గిల్‌కు అవకాశం ఇచ్చినట్లు విశ్లేషించాడు. ''ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రకటించిన జట్టులో శుభ్‌మన్ గిల్‌కు కాకుండా.. ఇతర క్రికెటర్లలో ఎవరికి వైస్ కెప్టెన్సీ అప్పగించవచ్చనేది మీరు చెప్పండి? ఇక్కడ నేను గిల్‌కు ఇవ్వడం సరైందా? కాదా? అనేది మాట్లాడటం లేదు. గతంలో కొన్ని సిరీసుల్లోనూ అతడు ఉపనాయకుడిగా వ్యవహరించాడు. కాబట్టి, అతడికి ఇవ్వడం సరైనది అనే వాదనా ఉంది. టెస్టుల్లోనూ వైస్ కెప్టెన్సీ చేసినట్లు గుర్తు. భవిష్యత్తులో తమ నాయకుడు ఎవరు ఉండొచ్చనే అంశంపై మేనేజ్‌మెంట్ ఆలోచించి ఉండొచ్చు. అందుకే, ఇప్పుడీ నిర్ణయం తీసుకొని ఉంటుందని భావిస్తున్నా'' అని అశ్విన్ పేర్కొన్నాడు.

**ఒకవేళ అదే జరిగి ఉంటే..**

''శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంతో ఫైనల్ XIలో అతడికి చోటు దక్కడం ఖాయమే. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు సూర్య కు డిప్యూటీగా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ విషయానికొచ్చేసరికి రవీంద్ర జడేజాతోపాటు అక్షర్ పటేల్ (Axar Patel) తుది జట్టులో స్థానం కోసం పోటీలో ఉన్నాడు. వీరిద్దరిలో ఒకరికే అవకాశం రావచ్చు. వికెట్ కీపర్లుగా రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌ను తీసుకుంది. కేఎల్ తాత్కాలికంగానే కీపింగ్ బాధ్యతలు చేపడుతున్నాడు. వీరిద్దరూ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడతారు. భవిష్యత్తులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్ అయితే విరాట్, బుమ్రా నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలి. అప్పుడే నాయకుడిగా మరింత రాటుదేలేందుకు అవకాశం ఉంది'' అని అశ్విన్ వెల్లడించాడు.



## క్రిస్ మార్టిన్ క్షమాపణలపై స్పందించిన బుమ్రా

**ముంబయి:** నవీ ముంబయిలో కోల్డ్‌ప్లే సింగర్ క్రిస్ మార్టిన్ తన కాన్సర్ట్‌ను కాసేపు నిలిపి వేసి.. భారత స్టార్ క్రికెటర్ జస్‌ప్రీత్ బుమ్రా ఇక్కడి వచ్చాడని, తెరవెనకే ఉన్నాడంటూ ప్రేక్షకులకు అబద్ధం చెప్పిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అదంతా నిజం కాదని క్షమాపణలు కోరాడు. దీనిపై బుమ్రా 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించాడు. ''నిజానికి ఇది నాకు నవ్వు తెప్పించింది. ముంబయిలో నిర్వహించిన కాన్సర్ట్‌లో ఏం జరిగిందనే దాన్ని పక్కన పెడితే.. ఇది ఉత్సాహం కలిగించింది. ఈ కాన్సర్ట్ ఎంతో ప్రత్యేకం'' అని బుమ్రా పేర్కొన్నాడు. కాగా.. క్రిస్ మార్టిన్ తన కాన్సర్ట్‌ను రెండు రోజుల పాటు (శని, ఆదివారం) నిర్వహించాడు. శనివారం నిర్వహించిన క్యాన్సర్ట్‌ను మధ్యలోనే ఆపేశాడు. బుమ్రా బౌలింగ్ క్లిప్‌ను ప్రదర్శించేందుకు కాన్సర్ట్‌కు కాస్త బ్రేక్ ఇవ్వడానికి కారణం. అభిమానుల్లో మరింత జోష్ పెంచేలా, స్టేజ్ వెనక బుమ్రా ఉన్నాడని.. బౌలింగ్ చేసేందుకు షోను కాసేపు ఆపాలని అడిగినట్లు మార్టిన్ చెప్పాడు. ఆ తర్వాత బౌలింగ్ క్లిప్‌ను ప్రదర్శించాడు. తరువాత తాను చెప్పింది అబద్ధమని.. అందుకు క్షమాపణలు కూడా కోరాడు.

# నా పేరు వచ్చేసరికి.. ఫ్రాంచైజీల వద్ద సొమ్ము లేదేమో!

## ఉమేశ్ యాదవ్



**ముంబయి:** భారత జట్టు సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్‌కు ఐపీఎల్ మెగా వేలం నిరాశ కలిగించింది. కనీసం ఒక్క ఫ్రాంచైజీ కూడా అతడిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపించలేదు. రిషభ్ పంత్‌ను రూ.27 కోట్లు వెచ్చించి మరీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో దాదాపు 150 వికెట్లు తీసిన వెటరన్ ప్లేయర్‌ను తీసుకోకపోవడం క్రికెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటివరకు దిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, గుజరాత్ జట్లకు ఆడిన అతడు ఈసారి మాత్రం అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇదే అంశంపై ఉమేశ్ స్పందించాడు. ఈ నిర్ణయం తనను తీవ్రంగా కలిచివేసిందని.. షాక్‌కు గురైనట్లు వెల్లడించాడు. అయితే, తన పేరు వచ్చేటప్పటికి ఫ్రాంచైజీల దగ్గర తగినంత సొమ్ము లేకపోవడం వల్ల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదేమోనని ఈ 37 ఏళ్ల పేసర్ వ్యాఖ్యానించాడు. ''ఐపీఎల్ 2025 సీజన్‌కు నేను ఎంపిక కాలేదని ప్రతిఒక్కరికీ తెలుసు. ఈ మెగా టోర్నీలో దాదాపు 15 ఏళ్ల పాటు ఆడా. ఇప్పుడు అన్‌సోల్డ్‌గా మిగిలిపోయా. ఇది నన్ను తీవ్ర షాక్‌కు గురిచేసింది. ఈ విషయంలో నాకు చాలా బాధ కలిగించిందని చెబుతా. దాదాపు 150 మ్యాచుల్లో ఆడిన తర్వాత సెలక్ట్ కాకపోతే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే, ఇది ఫ్రాంచైజీ స్ట్రాటజీ అయ్యుండొచ్చు లేదా మెగావేలం లో నా పేరు కాస్త ఆలస్యంగా రావడంతో ఇలా జరిగిందేమోనని అనుకుంటున్నా. అప్పటికి ఫ్రాంచైజీల వద్ద తగినంత సొమ్ము లేదు. ఏదేమైనా అది జరిగిపోయింది. నేను మాత్రం తీవ్ర నిరాశకు గురయ్యా. ఇతరుల నిర్ణయాన్ని నేను మార్చలేను'' అని ఉమేశ్ తెలిపాడు.

**అప్పుడే రిటైర్మెంట్‌పై..**

''నా రిటైర్మెంట్‌పై వార్తలు వస్తున్నాయి. ఆ నిర్ణయం తీసుకోవడానికి సమయం ఉంది. నా కాలికి సర్జరీ తర్వాత పూర్తిగా కోలుకున్నా. ఇప్పటికీ 140 కి.మీ.ల వేగంతో బంతిని విసరగలను. బౌలింగ్ చేయగలను. ఎప్పుడైతే అలా చేయలేనని భావిస్తానో.. క్రికెట్‌కు వీడ్కోలు పలికేస్తా. ఈ విషయం ఎవరికీ చెప్పను'' అని ఉమేశ్ యాదవ్ వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ సీనియర్ బౌలర్ 57 టెస్టులు, 75 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి మొత్తం 280కిపైగా వికెట్లు పడగొట్టాడు. రెండేళ్ల కిందట ఆసీస్‌తో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్ తరఫున చివరిసారిగా ఉమేశ్ ఆడాడు.



## అజింక్యా రహానె కెప్టెన్సీలో ఆడనున్న రోహిత్ శర్మ

**ముంబయి:** టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ 10 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ బరిలో దిగబోతున్నాడు. అజింక్యా రహానె సారథ్యంలో రోహిత్ రంజీ మ్యాచ్ ఆడనున్నాడు. జనవరి 23-26 మధ్య ముంబయి, జమ్మూ కశ్మీర్ రంజీ ట్రోఫీ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ముంబయి 17 మందితో జట్టును ప్రకటించింది. రోహిత్‌తోపాటు స్టార్ ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబె, శార్దూల్ ఠాకూర్ ముంబయి జట్టుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో అందుబాటులో ఉంటే ఆటగాళ్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బీసీసీఐ (BCCI) ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో రోహిత్‌తోపాటు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (సౌరాష్ట్ర), శుభ్‌మన్ గిల్ (పంజాబ్), రిషభ్ పంత్ (దిల్లీ) కూడా రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమవుతున్నారు.

రోహిత్ శర్మ 2015 తర్వాత తొలిసారి రంజీ మ్యాచ్ ఆడబోతున్నాడు. కొంతకాలంగా భారత కెప్టెన్ బ్యాటింగ్‌లో నిరాశపరుస్తున్నాడు. స్వదేశంలో కివీస్‌తో టెస్టు సిరీస్, ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో రోహిత్ టెస్టుల నుంచి వైదొలగాలనే డిమాండ్లు వినిపించాయి. మరోవైపు, కుదిరితే సీనియర్ ఆటగాళ్లు కూడా దేశవాళీ టోర్నీల్లో ఆడాలని బీసీసీఐ స్పష్టం చేసింది. దీంతో రోహిత్‌తోపాటు ఇతర స్టార్ క్రికెటర్లు రంజీ ట్రోఫీలో ఆడటానికి ముందుకు వచ్చారు.

ముంబయి జట్టు: అజింక్యా రహానె (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, ఆయుష్ మాత్రే, శ్రేయస్ అయ్యర్, సిద్ధేష్ లాడ్, శివమ్ దూబె, హార్దిక్ టామోర్ (వికెట్ కీపర్), ఆకాష్ ఆనంద్ (వికెట్ కీపర్), తనుష్ కోటియన్, శామ్స్ ములానీ, హిమాన్షు సింగ్, శార్దూల్ ఠాకూర్, మోహిత్ అవస్థి, సిల్వెస్టర్ డిసౌజా, రాయిస్టన్ డయాస్, కర్ష్ కొఠారి.

# లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా రిషభ్ పంత్



లక్నో: ఐపీఎల్-20225 సీజన్ ముంగిట లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నుంచి కీలక ప్రకటన వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర వెచ్చించి సొంతం చేసుకున్న రిషభ్ పంత్‌ను కెప్టెన్ నియమిస్తున్నట్లు ఫ్రాంఛైజీ తెలిపింది. పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు సోమవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గొయెంకా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంత్ కూడా గొయెంకాతో కలిసి పాల్గొన్నాడు. గతేడాది నవంబర్‌లో జరిగిన మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఏకంగా రూ.27 కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. దిల్లీ సారథిగా బాధ్యతలు నిర్వర్తించిన అతడిని లఖ్‌నవూ కెప్టెన్సీని అప్పగించేందుకే అంత మొత్తం పెట్టిందని వార్తలొచ్చాయి. నికోలస్ పూరన్ కూడా కెప్టెన్సీ రేసులో ఉన్నట్లు ప్రచారం జరిగినా పంత్ వైపే యజమాన్యం మొగ్గుచూపింది. 'రిషభ్ పంత్ ఐపీఎల్‌లో అత్యంత విలువైన ఆటగాడు మాత్రమే కాదు అత్యుత్తమ ఆటగాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మను విజయవంతమైన కెప్టెన్లు అని చెబుతారు. నా మాటలు గుర్తుంచుకోండి. 10-12 ఏళ్ల తర్వాత పంత్ కూడా వారి సరసన చేరుతాడు' అని సంజీవ్ గొయెంకా పేర్కొన్నారు.

# బ్యాంకింగ్ స్టాక్స్ అండ.. లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు.. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో బెంచ్‌మార్క్ సూచీలు రాణించాయి. ఇంట్రాడేలో దాదాపు 700 పాయింట్ల మేర సెన్సెక్స్ లాభపడగా.. నిఫ్టీ 23,300 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,978.53 (క్రితం ముగింపు 76,619.33) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,584.84- 77,318.94 మధ్య కదలాడింది. చివరికి 454.11 పాయింట్ల లాభంతో 77,073.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 141.55 పాయింట్ల లాభంతో 23,344.75 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 5 పైసలు బలపడి 86.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు లాభపడ్డాయి. జొమాటో, అదానీ పోర్ట్స్, టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 80 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2760 డాలర్ల వద్ద కొనసాగుతోంది.


**బిట్‌కాయిన్ ర్యాలీ..**

ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టనున్న వేళ బిట్ కాయిన్ దూసుకెళ్లింది. సోమవారం ఉదయం తొలిసారి 1,09,000 డాలర్ల మార్కు దాటింది. ప్రస్తుతం 107,000 డాలర్ల ఎగువన ట్రేడవుతోంది. క్రిప్టో కరెన్సీకి ట్రంప్ అనుకూలంగా ఉండడం బిట్‌కాయిన్ ర్యాలీకి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం బిట్‌కాయిన్ విలువ 20 వేల డాలర్లుగా ఉండేది.

# జొమాటో లాభంలో క్షీణత.. ఆదాయంలో 64% వృద్ధి

**ముంబయి:** ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.59 కోట్లుగా పేర్కొంది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం 57.2 శాతం క్షీణించడం గమనార్హం. గతేడాది రూ.138 కోట్ల నికర లాభాన్ని ప్రకటించిన జొమాటో.. గత త్రైమాసికంలో రూ.176 కోట్ల లాభాన్ని నమోదుచేసింది.కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 64 శాతం మేర పెరిగింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3288 కోట్లుగా ఉన్న ఆదాయం ఈ సారి రూ.5405 కోట్లకు పెరిగింది. ఖర్చులు సైతం రూ.3,383 కోట్ల నుంచి రూ.5,533 కోట్లకు ఎగబాకినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఫలితాల నేపథ్యంలో రోజంతా లాభాల్లో పయనించిన జొమాటో షేరు.. ఫలితాల అనంతరం బీఎస్‌ఈలో 3 శాతం మేర క్షీణించి రూ.240 వద్ద ముగిసింది. విభాగాల వారీగా చూస్తే.. ఫుడ్ డెలివరీ వ్యాపారం నుంచే వచ్చే ఆదాయం రూ.2413 కోట్ల నుంచి రూ.2602 కోట్లకు పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. నెలలో సగటున ఫుడ్ డెలివరీ చేసే వారి సంఖ్య క్రితం త్రైమాసికంతో పోలిస్తే 20.7 మిలియన్ల నుంచి 20.5 మిలియన్లకు తగ్గడం గమనార్హం.జొమాటోకు చెందిన క్విక్‌కామర్స్ విభాగం బ్లింకిట్ ఆదాయం సమీక్షా త్రైమాసికంలో ఏకంగా 117 శాతం పెరిగి రూ.1399 కోట్లకు చేరింది. క్యూ3లో సగటు ఆర్డర్ విలువ రూ. 707గా ఉంది. గతేడాది ఈ మొత్తం రూ.635గా ఉంది.జొమాటో గోయింగ్‌ఔట్ వ్యాపారం నుంచి రూ.254 కోట్లు, హైపర్ ప్యూర్ (బి2బి) వ్యాపారం నుంచి రూ.1671 కోట్లు ఆదాయం వచ్చినట్లు కంపెనీ తెలిపింది.

# అందుకు బాధగా ఉంది: కంగనా రనౌత్



ముంబయి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకుని బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ విషయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ చిత్రం ఎట్టకేలకు జనవరి 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కంగన యాక్టింగ్‌ను పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే కంగన తాజాగా ఓ వీడియో రిలీజ్ చేశారు. తన చిత్రాన్ని ఆదరిస్తున్న వారికి ధన్యవాదాలు చెప్పారు. ''నా తరఫున, జీ స్టూడియోస్ తరఫున మా చిత్రాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. మా చిత్రంపై మీరు ఎంతో ప్రేమను కనబరుస్తున్నారు. మీ ఆదరణ చూసి మాకు మాటలు రావడం లేదు. అయితే, పంజాబ్‌లో మా సినిమాపై నిషేధం విధించడం నన్ను ఒకింత బాధకు గురి చేసింది. ఒకానొక సమయంలో నా చిత్రాలు ఆ రాష్ట్రంలో బాగా ఆడేవి. కానీ, ఇప్పుడు నా సినిమా అక్కడ విడుదల కూడా కాలేదు. బ్రిటన్, కెనడాలో ఉంటున్న కొంతమంది ఆ రాష్ట్ర వాసులు ఈ చిత్రంపై వ్యతిరేకత చూపిస్తున్నారని నా దృష్టికి వచ్చింది. సినిమా చూడాలని ఆసక్తి చూపించే వారిపైనా దాడి చేస్తున్నారని తెలిసింది. కొంతమంది వ్యక్తుల కారణంగా ఈ రకమైన విద్వేషాలు ఏర్పడుతున్నాయి. నాలోని దేశభక్తికి నిదర్శనంగా దీనిని రూపొందించా. ఇది మనల్ని ఏకం చేస్తుందా? లేదా? అనే విషయాన్ని సినిమా చూసి మీరే తెలుసుకోండి'' అని కంగన చెప్పారు. ఇందిరా గాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీగా శ్రేయాస్ తల్పడే నటించారు. సెన్సార్ బోర్డు చాలారోజుల పాటు క్లియరెన్స్ ఇవ్వలేదు. కోర్టు జోక్యంతో సర్టిఫికేట్ ఇచ్చేందుకు సెన్సార్ ఆమోదం తెలిపింది. సెన్సార్ సూచన మేరకు చిత్రబృందం కొన్ని సన్నివేశాలు కూడా తొలగించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ పంజాబ్‌లో ఈసినిమాపై నిషేధం విధించారు.

## సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మల్టీస్టారర్.. పవర్‌ఫుల్‌గా 'భైరవం' టీజర్




బెల్లకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలిసి నటిస్తున్న యాక్షన్ మూవీ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న నేపథ్యంలో చిత్ర బృందం టీజర్ ని సోమవారం విడుదల చేసింది. 'రాత్రి నాకో కల వచ్చింది' అంటూ జయసుధ చెప్పే డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. 'ఆ రామలక్ష్మణులను సముద్రం దాటించేందుకు ఆంజనేయుడు ఉంటే.. ఈ రామలక్ష్మణులకు ఏ కష్టం రాకుండా చూసుకునేందుకు ఈ శ్రీనుగాడు ఉన్నాడు' అంటూ సాయి శ్రీనివాస్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ముగ్గురు సోదరుల అనుబంధం ఇతివృత్తంగా ఈ సినిమా రూపొందుతున్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది హీరోయిన్లుగా సందడి చేయనున్నారు.



# గుడ్ న్యూస్ చెప్పిన శోభిత ధూళిపాళ

తెలుగు అమ్మాయిలు హీరోయిన్‌గా ఆఫర్లు దక్కించుకోవడం కష్టం అనుకుంటున్న సమయంలో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లోనూ సినిమాలు చేసి నటిగా తనను తాను నిరూపించుకున్న ముద్దుగుమ్మ శోభితా ధూళిపాళ. 2013లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని మిస్ ఇండియా ఎర్త్ 2013 టైటిల్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా మారింది. రామన్ రాఘవ్ 2.0 (సైకో రామన్)తో తన అరంగేట్రం చేసింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. ఇదే సమయంలో హీరో నాగ చైతన్యతో ప్రేమయాణం సాగించి మరింత వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా నాగ చైతన్య వల్లే శోభిత ధూళిపాళ లైఫ్ లైన్‌లోకి వచ్చింది.సమంతతో విడాకుల తీసుకున్న తర్వాత తెలుగు హీరోయిన్ శోభిత ధూళిపాళతో రిలేషన్‌లో మెయిన్‌టైన్ చేశాడు. ఈక్రమంలోనే డిసెంబర్ 4వ తేదీన వీరి వివాహం జరిగింది. అతి కొద్దిమంది సమక్షంలోనే వీరి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత తన సినిమాలతో బిజీ అయిపోయింది శోభిత.ఇదిలా ఉంటే శోభిత ధూళిపాళ తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్‌ను షేర్ చేసింది. శోభిత ఓ గుడ్ న్యూస్ ప్రకటించింది.తాను నటించిన 'మంకీ మ్యాన్' బాఫ్టా ఆమోదం పొందడంతో పాటు రాటెన్ టొమాటోస్ బెస్ట్ రివ్యూడ్ మూవీగా అగ్ర స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. బ్రిటిష్ దర్శకుడు, నిర్మాత దేవ్ పటేల్ అవార్డు అందుకున్నట్లు తెలిపింది. నేను కలలు కంటున్నానా అనిపిస్తుంది. 2024 బాఫ్తా నామినేషన్‌లో యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్‌గా మంకీమ్యాన్ నిలిచిందని తెలిపింది. ఇక శోభిత కెరీర్ విషయానికి వస్తే.. తెలుగు అమ్మాయిలు హీరోయిన్‌గా ఆఫర్లు దక్కించుకోవడం కష్టం అనుకుంటున్న సమయంలో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లోనూ సినిమాలు చేసి నటిగా తనను తాను నిరూపించుకుంది శోభితా ధూళిపాళ. 2013లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని మిస్ ఇండియా ఎర్త్ 2013 టైటిల్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా మారింది. రామన్ రాఘవ్ 2.0 (సైకో రామన్)తో తన అరంగేట్రం చేసింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటే ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



## సినీ నటుడు విజయ్ రంగరాజు

# కన్నుమూత

సినీ నటుడు విజయ్ రంగరాజు కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. వారం రోజుల క్రితం ఓ సినిమా షూటింగ్‌లో గాయపడిన విజయ్ రంగరాజును చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనకు నేడు గుండెపోటు రావడంతో కన్నుమూశారు. 1994లో భైరవ ద్వీపం చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి వచ్చిన విజయ్ రంగరాజు తెలుగు, తమిళ సినిమాల్లో విలన్, సహాయక పాత్రల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. విజయ్ రంగరాజు అసలు పేరు ఉదయ రాజ్‌కుమార్. మోహన్‌లాల్ హీరోగా నటించిన 'వియత్నాం కాలనీ' అనే మలయాళ సినిమాతో సినీరంగంలోకి అరంగేట్రం చేశారు. ఆ చిత్రం విజయం సాధించడంతో వరుసగా అవకాశాలు అందుకున్నారు. ఆ సమయంలోనే తెలుగులో 'భైరవద్వీపం'లో విలన్‌గా నటించే అవకాశం వచ్చింది. ఆ సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఇండస్ట్రీలో అప్పటికే ఉదయ రంగరాజు అనే నటుడు ఉండడంతో తన పేరును విజయ రంగరాజుగా మార్చుకున్నారు.

**'ఛత్రపతి' కోసం ప్రయత్నిస్తే..**

ప్రభాస్ హీరోగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన 'ఛత్రపతి' లోని విలన్ పాత్ర (ప్రదీప్ రావత్ ప్లే చేసిన రోల్) కోసం విజయ రంగరాజు ప్రయత్నించారట. ''ఛత్రపతి'లోని రోల్ కోసం రాజమౌళిని కలిసేందుకు వెళ్లా. రాజమౌళి సర్ సంగీత చర్చల్లో ఉన్నారంటూ కో డైరెక్టర్ సమాధానమిచ్చాడు. మీ ఫొటో ఇవ్వండి సర్‌కు చూపిస్తానన్నాడు. 'యజ్ఞం'లోని క్యారెక్టర్‌కు సంబంధించిన స్టిల్ ఇచ్చా. అందులో నా వయసు కొంచెం ఎక్కువగా ఉన్నట్టు కనిపించడంతో డైరెక్టర్ ఆసక్తి కనబరచలేదని తెలిసింది. ఇలాంటి స్టిల్స్ ఇక ఆపేయండి అని కో డైరెక్టర్ సలహా కూడా ఇచ్చాడు. అది నా మనసులో బలంగా నాటుకుపోయింది. కొన్ని రోజుల తర్వాత 'విశాఖ ఎక్స్‌ప్రెస్' సినిమా ప్రారంభానికి రాజమౌళి వచ్చారు. ప్రెస్‌మీట్‌లో ఆ మూవీ, అందులోని నా పాత్ర గురించి చెబుతానని అందరూ అనుకుంటుండగా నేను ఆ ఘటన ప్రస్తావించా. 'మీరు ఇంత ఫిట్‌గా ఉంటారని నాకు తెలియదండీ. నేరుగా చూడలేదు కదా' అని రాజమౌళి అన్నారు'' అని విజయ రంగరాజు ఓ సందర్భంలో చెప్పారు. దర్శకుడు బోయపాటి శ్రీను 'అఖండ'లోని ఓ పాత్ర కోసం తనను సంప్రదించారని, అనివార్య కారణాలతో అది కార్యరూపం దాల్చలేదని చెప్పారు. తానెంత ఫిట్‌గా ఉన్నా ఎవరూ ఛాన్స్‌లు ఇవ్వడంలేదని పలు ఇంటర్వ్యూల్లో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**షూటింగ్ పూర్తయినా ఛాన్స్..**

రజనీకాంత్ తనతో ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారని విజయ రంగరాజు చెబుతుండేవారు. ''కథానాయకుడు' సినిమా షూటింగ్ జరుగుతుందని తెలిసి.. ఓ రోజు రజనీకాంత్‌ను కలవడానికి వెళ్లా. 'శివాజీ' మూవీలోని ఓ పాత్ర కోసం నిన్ను ఎంపిక చేద్దామనుకున్నాం. కానీ, నిన్ను కాంటాక్ట్ కాలేకపోయామని రజనీకాంత్ అన్నారు. వెంటనే దర్శకుడు పి. వాసుని పిలిచి.. నా కోసం ఓ క్యారెక్టర్ ఇవ్వమన్నారు. అప్పటికే సినిమా చిత్రీకరణ పూర్తయి.. ప్యాచ్ వర్క్ జరుగుతుందని దర్శకుడు చెబితే 'ఇతడు నా ఫ్రెండ్. ఎలాగైనా ఈ సినిమాలో కనిపించాలి' అని రజనీకాంత్ చెప్పగా డైరెక్టర్ ప్రత్యేకంగా చిన్న పాత్ర సృష్టించారు'' అని విజయ రంగరాజు చెప్పారు. చెన్నైలోని తన ఇంట్లో అద్దెకు ఉన్న ఎంతోమంది ప్రస్తుతం ఇండస్ట్రీలో రాణిస్తున్నారని ఓ సందర్భంలో తెలిపారు.

# నా కన్నీళ్లను తుడుచుకుంటూ.. కొత్త వాగ్దానం చేసుకున్నా: రామ్ గోపాల్ వర్మ

రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పాయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సత్య'. 27 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమాపై రామ్ గోపాల్ వర్మ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఇకపై దర్శకుడిగా తనకు గౌరవాన్ని పెంచే సినిమాలే తీయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.''27 ఏళ్ల తర్వాత మొదటిసారి 'సత్య' చూశాను. నాకు తెలియకుండానే కన్నీళ్లు వచ్చాయి. ఎందుకంటే కేవలం సినిమా కోసం కాదు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు గుర్తొచ్చాయి. ఒక సినిమాను చిత్రీకరించడమంటే బిడ్డకు జన్మనివ్వడంతో సమానం. సినిమా తీసిన తర్వాత ఇతరులు దాని గురించి ఏం చెబుతారనేది కూడా ముఖ్యమే. నేను తీసిన చిత్రాలు హిట్ అయినా.. కాకపోయినా.. నేను పనిలో నిమగ్నమై ముందుకుసాగుతున్నాను. రెండు రోజుల క్రితం 'సత్య' సినిమా చూసినప్పుడు ఎన్నో విషయాలు గుర్తొచ్చాయి. తాజాగా ఈ సినిమా చూసిన తర్వాత నేను ఈ చిత్రాన్ని బెంచ్‌మార్క్‌గా ఎందుకు పెట్టుకోలేదని అనిపించింది. అలాగే నిలబెట్టుకోలేకపోయాననే అపరాధభావంతో నాకు కన్నీళ్లు వచ్చాయి'' ''నేను తాగుబోతును అయ్యాను. మద్యంతోనే కాదు, సినిమాలు ఇచ్చిన విజయం, అహంకారంతో నా కళ్లునెత్తికెక్కాయి. సత్య' గొప్పతనం రెండు రోజుల ముందు దాన్ని మరోసారి చూసేవరకూ అర్థం కాలేదు. రంగీలా, సత్యలాంటి చిత్రాలు ఇచ్చిన వెలుగులో నా కళ్లు మూసుకుపోయాయి. దీంతో నా ఇష్టం వచ్చినట్లు సినిమాలు తీశా. ప్రేక్షకులను ఏదో ఆశ్చర్య పరచాలని, గిమ్మిక్కులతో ఆకట్టుకోవాలని, నాకున్న అతి తెలివితో అసభ్య సన్నివేశాలతో కూడిన సినిమాలు, ఇలా అర్థంపర్థంలేని విషయాలతో కథ, కథనాలపై ఏమాత్రం దృష్టి పెట్టకుండా సినిమాలు తీశా. సాధారణ కథతోనూ మంచి ఎలివేషన్ ఉన్న సినిమాలు చేయొచ్చు. కానీ, నేను అలా చేయలేకపోయాను. నేను ఎన్నో విజయవంతమైన చిత్రాలు తీశాను. కానీ, సత్యలో ఉన్న గొప్పతనం వాటిలో లేదు. నా ప్రతిభకు ఇండస్ట్రీ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. కానీ, నేను వాటిని చూడలేకపోయాను. నేను ఇప్పటివరకు చేసిన వాటిని సరిదిద్దుకోలేను. అందుకే నా కన్నీళ్లను తుడుచుకుంటూ 2 రోజుల క్రితం ఓ వాగ్దానం చేసుకున్నాను. ఇకపై నేను చేసే ప్రతి సినిమా దర్శకుడిగా నా గౌరవాన్ని పెంచేలా ఉండాలని



ఈ చిత్రంలోని భావోద్వేగం వల్ల నాకు కన్నీళ్లు రాలేదు. ఇంత గొప్ప జానర్ సినిమాను నేనే తీశాను అనే ఆనందానికి వచ్చాయని అర్థమైంది. 'సత్య' లాంటి గొప్ప సినిమా చూసి నాపై ఎంతోమంది పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిర్ణయించుకున్నా. 'సత్య' లాంటి సినిమాను మరోసారి తీయలేకపోవచ్చు. కనీసం ఆ జానర్ సినిమాలైనా తీయలేకపోతే నేను సినిమాలకు ద్రోహం చేసినవాడిని అవుతాను''

''సత్య' తీసిన తర్వాత నేను ఎన్నో సినిమాలు చేశాను. అవి కూడా 'సత్య' అంత బాగుంటాయా అని నన్ను ఎవరూ అడగలేదు. కనీసం ఇలా నన్ను నేను కూడా ప్రశ్నించుకోలేకపోవడం దారుణం. ఏదైనా సినిమా తీయాలని నిర్ణయించుకునే ముందు 'సత్య'ను కచ్చితంగా చూడాలనే నియమాన్ని పెట్టుకున్నాను. ఇప్పటివరకు తీసిన చిత్రాలకు ఈ నియమాన్ని పాటించినట్లైతే 90 శాతం చిత్రాలు తెరకెక్కించేవాడిని కాదేమో. చివరగా ఓ ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా జీవితంలో ఇంకా సగభాగం మిగిలే ఉంది. దానిని గౌరవంగా పూర్తిచేయాలనుకుంటున్నా. సత్య లాంటి సినిమాలను తెరకెక్కించాలనుకుంటున్నాను. ఇదే సత్యం. ఈ సత్యాన్ని నా సినిమా 'సత్య'పై ప్రమాణం చేసి చెబుతున్నాను'' అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ధనుష్.. అలా ఎలా సినిమా తెరకెక్కించారు?: ఎస్.జె.సూర్య



ధనుష్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం' (నీక్) . తాజాగా దీనిని వీక్షించారు నటుడు ఎస్.జె.సూర్య. చిత్రబృందాన్ని ముఖ్యంగా ధనుష్ మేకింగ్ స్టైల్‌ను మెచ్చుకుంటూ ఆయన ఎక్స్ వేదికగా తాజాగా పోస్ట్ పెట్టారు. సినిమా తనకెంతో నచ్చిందని అన్నారు. ''అంతర్జాతీయ నటుడు, దర్శకుడు ధనుష్‌తో 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం' సినిమా చూసే అవకాశం నన్ను వరించినందుకు ఎంతో సంతోషిస్తున్నా. జెన్-జెడ్ తరానికి చెందిన కథ ఇది. ఫన్, ఎమోషనల్, విభిన్నమైన కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న గొప్ప సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది. సర్.. నటుడు, దర్శకుడిగా వరుస సినిమా షూట్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ఫీల్‌గుడ్ చిత్రాన్ని మీరెలా రూపొందించగలిగారు. అది కూడా 'రాయన్' పూర్తైన వెంటనే దీనిని ఎలా పూర్తి చేయగలిగారు. వాట్ ఏ డైరెక్షన్. ఈ సినిమాతో వెండితెరకు పరిచయం అవుతోన్న యువ నటీనటులకు కంగ్రాట్స్. మీరందరూ చాలా చక్కగా యాక్ట్ చేశారు'' అని పేర్కొన్నారు.

2017లో విడుదలైన 'పా పాండి'తో దర్శకుడిగా ధనుష్ తొలి అడుగు వేశారు. ఈ చిత్రం ప్రేక్షకుల మన్ననలు సొంతం చేసుకుంది. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'రాయన్' గతేడాదిలో విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా ఇది తెరకెక్కింది. ఈ సినిమా పూర్తైన వెంటనే దర్శకుడిగా 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం', 'ఇడ్లీ కడై' చిత్రాలను ప్రకటించారు. పవీష్, అనిఖ సురేంద్రన్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం'.ఇందులోని 'గోల్డెన్ స్పారో' పాట యువతను విశేషంగా ఆకట్టుకుంది. ఫిబ్రవరి 21న ఇది విడుదల కానుంది. తెలుగులో ఇదే చిత్రాన్ని 'జాబిలమ్మ నీకు అంత కోపమా' పేరుతో విడుదల చేయనున్నారు. మరోవైపు, ధనుష్ ప్రస్తుతం 'కుబేర', 'ఇడ్లీ కడై'తోపాటు ఇళయరాజా బయోపిక్‌లో కూడా యాక్ట్ చేస్తున్నారు.



రిపోర్టర్స్ కావలెను
V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com